



కె. తంగ్రీకులీయెవ్

బంగారు గిన్నె





"రాదుగ" ప్రచురణాలయం
మాస్కో

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

మా బుజ్జి బాబులూ! మా బుజ్జి పాపలూ!

యీ పుస్తకం రాసిన ఆయన పేరు కయూమ్ తంగ్రికులీయెవ్. యెంతో పేరు వున్న సోవియట్ కవి, రచయిత. మీరు ఆయన్ని చూడాలనుకుంటే సోవియట్ యూనియన్ దక్షిణాది కంటా వెళ్లాలి. యెండగా, వేడిగా వుండే తుర్క్మేనియాకి వెళ్లాలి.

యిది మంత్ర ముగ్ధం కావించే దేశం. యిక్కడి వీధుల్లో నదురైన రంగుల కార్లు, ట్రక్కులు తిరుగుతూ వుంటాయి. వీటికి పక్కనే రాజసంగా వూగుతూ నడిచే వొంటెలూ, విచారకరమైన పెద్ద కళ్లు వున్న గాడిదలూ కూడా వుంటాయి. యిక్కడి పొలాల్లో గోధుమ, పత్తి పండుతాయి. యీ పత్తినుంచి అందమైన బట్టలు నేస్తారు. యీ బట్టలతో పెద్దలూ, పిన్నలూ దుస్తులు కుట్టించుకుంటారు. మరి పళ్ల తోటల్లో రసంవూరే రకరకాల పళ్లు పండుతాయి. ఎర్రటి ఆపిల్స్, జేగురు రంగు ఛేరీ పళ్లు, ఆప్రికాట్లు, గింజలు పక్కానికి వొచ్చిన దానిమ్మ పళ్లు, రసంవూరే ద్రాక్ష గుత్తులు వుంటాయి, బాదం కాయలు కూడా కాస్తాయి. యిక పుచ్చ కాయలున్నాయి — యెన్ని రకాల పుచ్చ కాయలు, కర్బుజాలు పొలాల్లో పండుతాయో! యీ నోరూరించే ఆరోగ్యకరమైన పళ్లనన్నిట్నీ తుర్క్మేనియా ప్రజలు పండిస్తారు. యెంత కష్టపడి మొక్కలు నాటి, నీళ్లు పోసి వాటిని పెంచుతారో! యిక పంటకోత అప్పుడు వుండే శ్రమ! అదీ యేం తక్కువ కాదు.

కయూమ్ తంగ్రికులీయెవ్ యిలాంటి దేశం గురించి రాశారు. ఆయన వొక తుర్క్మేన్ గ్రామంలో పుట్టేరు, పెరిగేరు. ఆ వూరు కారకూమ్ యెడారికి అంత దూరం కాదు. చిన్నప్పటినుంచీ ఆయన పొలాల్లో, పళ్లతోటల్లో తల్లిదండ్రులకి సాయం చేసేవాడు. వొక కొత్త కాలవ, కారకూమ్ కాలవ, గొడ్డు యెడారిని సస్యశ్యామలం చేస్తూ పారడం స్వయానా తన కళ్లతో చూశాడు. ఆ చవిటి పర్ర ఆకుపచ్చ పొలాలుగా మారి పళ్లతోటలుగా వికసించడం స్వయానా తన కళ్లతో చూశేడు. దీన్నంతటి గురించీ పిల్లలకీ పాపలకీ చెప్పాలని తపన పడ్డాడు.

యిరవై అయిదేళ్లుగా అనేక సోవియట్ రిపబ్లిక్కుల్లో, విదేశాలల్లో వున్న పిల్లలు తంగ్రికులీయెవ్ ఉల్లాసకరమైన గీతాలు చదివి ఆనందిస్తున్నారు. సమ్మోహకరమైన చిన్న కథలు చదివి ఆనందిస్తున్నారు. యీ గీతాలకీ, కథలకీ ఆయనకి హాన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ అంతర్జాతీయ బహుమతీ వచ్చింది. యీ కథలు చదివితే, పాపలూ, మీరు వీటిని రాసిన ఆయన నేలని చూసినట్టే వుంటుంది. మరి, అందుకు కయూమ్ తంగ్రికులీయెవ్‌కి కృతజ్ఞతలు చెపుదాం.

వై. అకీమ్

కె. తంగ్రీకులీయెవ్

బంగారు గిన్నె

అనువాదం: ఆర్వియార్

చిత్రాలు: జి. యూదిన్



К. Тангрыкулиев

ЗОЛОТАЯ ЧАША

На языке телугу

K. Tangrykuliev


THE GOLDEN GOBLET

In Telugu

యిందులో

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ISBN 5-05-002344-0


బంగారు
గిన్నె



కిజిల్ అయాక్

యీ భూమ్మీద కిజిల్ అయాక్ అంత చక్కని వూరు యింకోటి లేదు. నేను యిక్కడే పుట్టాను. దీని స్వరం అమూదార్య నది అనంత గీతం. యీ నది నీళ్ళు స్వచ్ఛంగా తియ్యగా వుంటాయి. వొక్క సారి తాగితే యిక జీవితంలో మరిచిపోలేం.

పొద్దున్నే వూరి చుట్టుతా నేలమీద అడివి కుందేళ్లవీ, ముళ్లపందులవీ, నక్కలవీ, గుంటనక్కలవీ జాడలు కనిపిస్తాయి. యిప్పుడు కూడా ఆ జాడలు పడుతూనే వుంటాయి.

నేను చిన్న పిల్లాడిగా వున్నప్పుడు కిజిల్ అయాక్ అంటే అర్థం యేమిటో తెలిసేది కాదు. పెద్దలు ఆ పేరు యెందుకు పెట్టారో! అసలు మా యింటికి వొచ్చే చుట్టాలిదే తప్పు అని చెప్పాలి! యెప్పుడు వాళ్ళు మా యింటికి వొచ్చినా నన్ను ఉడికించేవాళ్ళు:

''బాగుందిరా నాయనా! నీ కాళ్ళు చూడాలి, కడుపు నిండిపోతుంది! నువ్వు అసలైన కిజిల్ అయాక్ కుర్రాడివైతే నీ కాళ్ళు బంగారంలా వుండాలి'' అనేవాళ్ళు.

తుర్క్మేనియన్ భాషలో 'కిజిల్' అంటే యెరుపు. కాని బంగారం అని కూడా అర్థం. 'అయాక్' అంటే కాలు. కాని యిరుగుపొరుగు ప్రజల భాషలో దీనికి ''పాత్ర'', ''గిన్నె'', ''చషకం'' అని అర్థాలున్నాయి. ఒక అద్భుత కథలో షా జెమ్‌షిద్‌కి వున్న మంత్ర మహిమల బంగారు గిన్నె యీ ''కిజిల్ అయాక్''. ఆ గిన్నెలోకి చూస్తే లోకంలో జరిగే విశేషాలన్నీ ఆయనకి తెలిసేవి.

మొత్తంమీద మా వూరికి ఆ పేరు మా వూరి పూర్వుల ఐశ్వర్యం బట్టి వచ్చింది. ఒకప్పుడు మా వూరి యిసిక తిప్పలమీద తుఫాన్ పట్టినప్పుడు ఆకాశంలో ముసురుకు వచ్చే మేఘాల్లాగా గొర్రెలు మందలు మందలుగా

వుండేవట పెద్దవాళ్లు అంటారు. ఆ గొర్రెలన్నీ కొంతమంది సంపన్నులైన ఆసామీలవే అనుకోండి. ప్రజలు తామే పాలకులయినప్పుడు యీ ఆసామీలు గొర్రెల మందల్ని తోలుకుని పొరుగున వున్న అఫ్ఘనిస్తాన్‌కి వెళ్లిపోయేరు.

కిజిల్ అయాక్ భూములు సారవంతమైనవే. కాని ఉజాడైన భూములు. వో అరవై మంది రైతులు చొరవగా యిక్కడ స్థిరపడ్డారు. వాళ్లల్లో మా నాయన వొకడు. వాళ్లందరూ కలిసి ''త్యాజె దున్యా'' (''నవ లోకం'') అనే పేరుతో వో సహకార క్షేత్రాన్ని స్థాపించేరు.

అప్పట్నుంచి చాలా యేళ్లు గడిచేయి. యివాళ నిజంగానే మా వూరిని బంగారు గిన్నె అనవచ్చు. తమ మాతృ దేశాన్ని వదిలేసి పారిపోయి, ద్రోహం చేసిన వాళ్లకి కటువుగా, కళ్లల్లో నిప్పులు పోసుకునేటట్టుగా కూడా వుంటుంది మా వూరిని యిలా పిలవడం — అవును మరి, నిజంగానే బంగారు గిన్నె!



తొలి మోటారు వాహనాలు

మా యిల్లు వూరికి చివర కొంచెం దూరంగా వుంటుంది. మేం వున్న చోట సరిగా రోడ్డు కూడా లేదు. మా యింటికి ఆనుకునే వెనక్కాల దట్టమైన చిట్టడివి వుంది. మా యింటికి పొరుగునే, బాగా దగ్గరగా అన్నారి ఆగా వాళ్ల యిల్లుంది. కాని మా నేస్తం యాజ్లితో నేను మాట్లాడాలంటే వో చెట్టేనా యెక్కాలి, యింటి కప్పుమీదకేనా యెక్కాలి.

యివాళ పొద్దున్న కప్పుమీదకి ముందస్తుగా యాజ్లి వచ్చేడు.

''క... యూ... మ్'' అని గొంతు చించుకుంటూ అరిచేడు.

నేను తాగుతూ వున్న పాల గ్లాసు కింద పెట్టి పెరట్లోకి వెళ్లేను.

''యే...మిటి?'' అని నేనూ చించుకున్నాను.

''యిక్కడికి రా. నాన్నగారు యినప యెద్దు బండి తెచ్చేరు!'' అని యాజ్లి అరిచేడు.

నేను వాళ్ల యింటికి పరిగెత్తేను. పెరట్లో వో వింత యినప జంతువు వుంది. దానికి యినప వూచల చక్రాలు వున్నాయి. అది చాలా భారీగా వుంది.

''యిది నిప్పులు తింటుంది'' అని యాజ్లి రహస్యంగా చెప్పేడు. రెప్ప మూసి తెరిచేలోపల సీట్లోకి యెక్కి కూర్చు న్నాడు. ''యెక్కు! భయం లేదు, నిప్పు దాణా పెడితే గాని కదలదులే'' అన్నాడు.

నాకు బోలెడు భయం వేసేసింది, అలానే నుంచుండి పోయేను.

అప్పుడు అన్నాలి ఆగా యింట్లోనుంచి వచ్చేడు.

''యెక్కు బాబూ! యాజ్లి పక్క కూర్చో'' అన్నాడు.

నాకు వుహుఁ అనడానికి లేకపోయింది. గట్టిగా వున్న సీట్లోకి యెక్కి కూర్చున్నాను. అన్నాలి ఆగా ఇంజన్ స్టార్టు చేశాడు. ఆ జంతువుకి కుదుపుతో చలనం వచ్చింది. నేను యాజ్లిని గట్టిగా వాటేసుకున్నాను. రణగొణ చప్పుడు మోతలో మేం ముందుకు వెళ్లాం. పొలాల దగ్గరికి చేరే వేళకి ఆ యినప బండి వాసనకి, ఆ రణగొణ ధ్వనికి, గణగణ చప్పుడుకి నేను అలవాటు పడ్డాను. మా వెనక్కాలే యీడ్చుకుంటూ వస్తూ వున్న మరో యినప యంత్రం నాకు కనిపించింది. దానికి బండి చక్రం ఆకుల్లాంటి యినప కత్తుల పళ్లు వున్నాయి. అన్నాలి ఆగా నాకేసి తేరిపార చూశేడు.

''యిదేమిటో తెలుసా?'' అని అడిగేడు.

''ఆఁ!'' అని నేను బయట పడిపోయేను. ''యినప బండి గుర్రం పిల్ల'' అన్నాను.

అన్నాలి ఆగా పకపకా నవ్వేడు.

''అది నాగలి, బాబులూ! యిక మీరు యింటికి వెళ్లిపోండి. నాకు పనుంది. నేను నేల దున్నుతాను'' అన్నాడు.

నేను యినప యంత్రాన్ని చూడ్డం అదే మొదటి సారి.

* * *

యాజ్లి నాకంటె కొంచెం పెద్ద. అతనెక్కడికి వెళ్లినా నేనూ కూడా కూడా వెళ్లేవాణ్ణి, నోరు మెదపకుండా అతని వెనక్కాలే వుండేవాణ్ణి.

''ఆఁ, దొరికింది!'' అని యాజ్లి అరుస్తూ వో పొద కిందనుంచి పుట్టగొడుగుని యేరుతూ అన్నాడు. దానికి ముడతలు పడిన గొడుగు వుంది. ''కొంచెం దీన్ని మోకాళ్లమీద రుద్దుకుందాం'' అన్నాడు.

''దేని కోసం?''

''బాగా పరిగెత్తడానికి. అప్పుడు 'దెయ్యం చక్రం' మనల్ని అందుకోలేదు.''

నేను చుట్టూ చూశేను.

''యేదీ అది?''

''మా మామయ్యగారింటి దగ్గరుంది. ఆయన దానిమీద యెక్కి కాళ్లని గిర్రున తిప్పుతాడు. గుర్రంమీద స్వారీ చేసే దానికంటే వేగంగా వెడతాడు. యీ సారి మా మామయ్య వచ్చినప్పుడు చూపిస్తాలే'' అన్నాడు.

పుట్టగొడుగు ముడతలు పడ్డ గొడుగుని మేం మోకాళ్లకి రాసుకున్నాం. పొడుగ్గా వున్న రెమ్మల్ని కాసిని విరిచి వూపుతూ పిక్క బలం కొద్దీ పరిగెత్తేం. మేం పరిగెడుతూ వుంటే దుమ్ము లేచింది.

వున్నట్టుండి మేం ఆగిపోయేం, మా దారికి అడ్డంగా పాము జాడ పోతోంది. చాలా పెద్ద పాము జాడ, దాని కుబుసానికి పొడలు వుండి వుండాలి. మేం ఆ జాడని పట్టుకునే వెళ్లేం. కాని దానికి అంతుదరీ వున్నట్టు కనిపించలేదు. మేం పరుగు తగ్గించి చుట్టూతా చూశేం. ఆ జాడ స్పష్టంగా యాజ్లి వాళ్ల మామ యింటికి పోతోంది.

ఇంటి పక్కన వుంది ''దెయ్యం చక్రం'' — బైసికిలు.

యిది నా అనుభవంలోని విషయం. కాని మా తరం వాళ్లల్లో దాదాపు అందరూ, మోటార్లకి, విద్యుచ్ఛక్తికి, గాస్‌కి అలవాటు పడ్డ వాళ్లందరూ వొకనాడు ఆ సైకిళ్ల జాడల్ని పాము జాడలనే అనుకునేవాళ్లు. మేం యింకా జీవితంలో అప్పుడు ప్రారంభ దశలో వున్నాం. గత యాభై యేళ్ల కాలంలో జనం యెంత సాధించారో చూస్తే తల తిరిగి పోతుంది. మానవుడు చేసిన అద్భుతాల ముందు శుద్ధ అద్భుత కథా విశేషాలు వెలవెల బోతాయి!

జ్ఞాపకాలు

''నా గత శైశవ రాగమాలికల ప్రతిధ్వనులకై'' వెదుకాడకబోతే నాకు పోప్లార్ చెట్లు, శిధిలమైన పాత కోటల పచ్చి యిటికల గోడలు కళ్ల ముందు కనిపిస్తాయి. తోత మామ్మ కళ్లకి కట్టినట్టు కనిపిస్తుంది. ఆమె వచ్చి మేం పిల్లకాయలం ఆడుకుంటూ వుంటే చూస్తూ వుండేది. మమ్మల్ని కథలు చెప్పి ఆకట్టుకునేది. పేద రైతులకి గొర్రెల్ని యివ్వడం, వాటి వీపులమీద వాళ్లు యజమానులుగా ప్రత్యేకమైన గుర్తులు అచ్చుకొట్టడం నాకు గుర్తు వుంది. తమ 'సొమ్ములు' పక్క వాళ్ల వాటితో కలిసిపోకుండా మాసిపోని సిరా ముద్రలు కొట్టుకునేవాళ్లు. నాకు వూహ తెలిసినప్పటినుంచీ స్మృతిలో మిగిలినవి బహుశా అచ్చులు కొట్టిన ఆ గొర్రెల స్పష్టమైన జ్ఞాపకాలేనేమో.

ఓ రోజున యాజ్లి నన్ను ఆటపట్టించడం కూడా నాకు గుర్తుంది. ''యేం, కథ చెప్పమంటావా?'' అని అడిగి అతను మొదలుపెట్టేడు:

''అనగా అనగా వొకప్పుడు వో పెద్ద మనిషి వుండేవాడు. ఆయన్ని అందరూ గౌరవంగా చూసేవాళ్లు. ఆయనకి యిద్దరు కొడుకులు. వొకడి పేరు 'ఐత్' — అంటే 'మాట్లాడు' అని అర్థం. రెండో వాడి పేరు 'ఐత్మా' — 'మాట్లాడద్దు' అని అర్థం. ఐత్ తండ్రి చెప్పిన వాటినన్నిట్నీ వేలుపెట్టడానికి లేకుండా చేసేవాడు. 'ఐత్, ఆ సుత్తి పట్రా' అంటే పట్టుకొచ్చేవాడు. 'ఐత్, పాట పాడు' అంటే పాడేవాడు. ఐత్ తెలివైన పిల్లవాడు. కాని రెండో వాడున్నాడే వాడి పేరు... వాడి పేరేమిటి చెప్మా'' అని యాజ్లి మర్చిపోయినట్టుగా తల చేతులతో పట్టుకున్నాడు.

''ఐత్మా'' అని నేను అందించాను.

''సరే అయితే మాట్లాడను. వొక్క ముక్క కూడా మాట్లాడనులే'' అన్నాడు యాజ్లి రకామని.

నేను బోల్తాపడ్డానని తేలిపోయింది. యిక కథ ముందుకు సాగదు. దాంతో నాకు భోరున యేడుపు వచ్చేసింది. అది గుర్తువస్తే యివాల్టికి కూడా నాకు కళ్లమ్మట నీళ్లు తిరుగుతాయి.

తర్వాత నాకు అసలు భయం అంటే యేమిటో తెలిసింది కూడా అప్పుడే. వసంతరుతువు మొదలైంది. వెచ్చగా వున్న రోజు అది. చెట్లు చిగుళ్లు తొడుగుతున్నాయి. గుట్టలమీద మొక్కలు పువ్వులు పూస్తున్నాయి. గాలిలో అదో రకం వాసన కొడ్తోంది. జనం కాయగూరల మళ్లల్లో పేరుకున్న చెత్తా చెదారం శుభ్రం చెయ్యడానికి మంటలు వేస్తే వాటినుంచి లేచిన పొగ అది. యిప్పటిక్కూడా గాలిలో చిగుళ్లు తొడిగే మొక్కల వాసన, వానకి తడిసిన నేల వాసన, పొగ వాసన లాంటి తొలి వసంత వాసనలు వస్తే నాకు కళ్లల్లో ఆనందాశ్రువులు తిరుగుతాయి.

వంట చెరకు కోసం యెండిన పేళ్లని యేరుకు రమ్మని మమ్మల్ని పంపించేరు. మేం ముగ్గురం — యాజ్లి, జూమా, నేను. జూమా మరో పొరుగువాడు. యాజ్లి కంటే పెద్ద వాడు. వాకో అప్పుడు వంట చెరకు తోలుకు రావడానికి అతనికి గాడిదని కూడా యిచ్చేవాళ్లు.

మేం పంటకాలవ పాత బోదె దగ్గరికి వెళ్లేం. కొంచెం సేపట్లోనే తలా మోపు పోగు చేశాం. యిక యింటికి బయల్దేరి వెళ్లిపోదాం అనుకుంటున్నాం. అప్పుడు జూమా దూరంలో వున్న వో పాత అప్రికాట్ చెట్టుని చూపించేడు. ఆ చెట్టు పైన యేవో పెద్ద పక్షులు చక్కర్లు కొడుతూ యెగురుతున్నాయి.

''పదండి వెళ్లి వాటి గూడు చూద్దాం'' అని జూమా అరిచేడు.

మేం మా మోపులు తీసుకుని, గొడ్డళ్లు అందుకుని ఆ వొంటరి చెట్టు దగ్గరికి పరిగెత్తి వెళ్లేం.

''యిదుగో యెవళ్లు ముందు గూటిదాకా యెక్కుతారో'' అంటూ జూమా కొత్త పందెం పెట్టేడు.

యాజ్లి, నేను యెండిపోయిన కొమ్మల మధ్య నుంచి మహాకసిగా పైకి యెగబాకడం మొదలుపెట్టాం. జూమా బెసకలేదని గమనించను కూడా గమనించకుండా యెగబాకేం. యాజ్లి నాకంటే వో క్షణం ముందు వున్నాడు. మేం గూట్లోకి తొంగి చూశేం. మూడు గుడ్లు కనిపించేయి. అవి పొడలతో వున్నాయి. కోసుగా వున్నాయి. కోడిగుడ్ల సైజులో వున్నాయి. నేను వో గుడ్డు తీద్దామని చెయ్యి చాపేను. వున్నట్టుండి యేదో నా టోపీమీద సయ్యన గట్టిగా కొట్టుకుంది.

యాజ్లి తాచు పాములాగా గబగబ కిందికి జారిపోయేడు.

''కయూమ్! దిగు! మళ్లీ కొడతుంది నిన్ను'' అని అరిచేడు.

నేను కిందికి జారేను. ఆ జారేటప్పుడు నా చేతులు, మోకాళ్లు గీరుకుపోయేయి. కిందికి దిగేటప్పటికి నా కాళ్లు వొణుకుతూ వున్నాయి.

జూమా పగలబడి నవ్వేడు.

''డేగ యెలా వుంది?'' అని అడిగేడు.

మేమా చెట్టు దగ్గర్నుంచి పరిగెత్తి కొంత దూరం వెళ్లిపోయి ఆయాసం తీర్చుకుందామని కూలబడ్డాం. సూర్యుడు యెర్రగా మండి పోతూ పడమట దిక్కున వాలుతున్నాడు. మేం గొడ్డళ్లతో పాత మొద్దుల్ని నరుకుతున్నాం. కాని మునిచీకటి కమ్ముకుంటూ వుంది. నక్షత్రాలు పైన మిణుకు మిణుకు మంటూ ఉదయిస్తున్నాయి. అందుకని గబగబ యింటి దారి పట్టేం. జూమా మా యెదర నడుస్తున్నాడు. నేను వెనక్కాల ఆఖర్న యీడ్చుకుంటూ నడుస్తున్నాను.



హఠాత్తుగా పెను గాలి లేచింది. మా మోపులు బరువుగా వున్నాయి, గుచ్చుకుంటున్నాయి. గాలి ఉరవడికి మా కాళ్ళ తడబడ్డాయి.

మేం దుమ్ము కొట్టుకుపోయిన విశాలమైన పచ్చిక బీడుమీదకి వచ్చేక నేను వెనక్కి తిరిగి చూశేను. అంతే కొయ్య బారిపోయేను. మూడు తోడేళ్ళ మా వెనక్కాల పిక్క బలం కొద్దీ పరిగెత్తుకుంటూ వస్తున్నాయి.

''తోడేళ్ళ!'' అని మొత్తంమీద నత్తుతూ నత్తుతూ అన్నాను. వొక్క ఉదుట్న పారిపోవడానికి బదులుగా నేను దుమ్ములో కూలబడిపోయేను. మా మిత్రులు పరిగెత్తడం మొదలెట్టేరు. కాని కూడా నేను లేనని చూసి ఆగిపోయేరు. నేను కూలబడ్డ చోటికి పరుగు పరుగున వచ్చేరు.

''లే!'' అని జూమా అరిచేడు. ''యెక్కడ కనిపించేయి నీకు తోడేళ్ళ?'' అని అడిగేడు.

నేను కళ్ళ తెరిచి చీకట్లో కదిలే ఆకారాలకేసి చూపించేను. జూమా అటు పరిగెత్తి వెళ్లి వో ''తోడేలు''ని కాలితో తన్నేడు — అది గాలికి కొట్టుకుపోయే యెండు కంప.

మేం యిళ్లకి హుషారుగానే తిరిగివచ్చేం. కాని ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. మొదటగా, నేను పిరికివాడిలా ప్రవర్తించేను. రెండవదిగా జూమా యెలాంటి వాడో వూహించుకో ప్రయత్నించేను. మమ్మల్ని డేగ గూటి దగ్గరికి యెక్కేటట్టు యెగసన దోశాడు. డేగ మా కళ్ళ పొడిచేసేదే కదా! కాని తర్వాత నేను చేతులెత్తేసి తోడేళ్ల దయా దాక్షిణ్యాలకి లొంగి పోయేటప్పుడు అతను నన్ను వదల్లేదు. మా యింటి దాకా తీసుకొచ్చి దిగబెట్టేడు. అంచేత ఆ రాత్రి నేను యే నిర్ణయానికి రాలేకపోయేను.

నాలుగు కళ్ల కుక్క

మా నాన్న బజారునుంచి తిరిగివచ్చే వేళకి నేనూ, యాజ్లి పెరట్లో ఆడుకుంటున్నాం. ఆయన గాడిద వీపుమీద నుంచి జాగ్రత్తగా జోడు సంచీని దింపేడు. ఆ సంచీ మాంచి రంగులతో వుంది. వో సంచీలో గుమ్మడి కాయ వొకటీ, కొన్ని మూటలూ వున్నాయి. కాని రెండో దాంటో యెదో పెద్దది వుంది. దానికి ప్రాణం వుంది. ఆయన సంచీని దించి కిందపెట్టి

''పడుకో!'' అన్నాడు.

జేగురు రంగు ప్రాణి వొకటి కిమ్మనకుండా ఆయన కాళ్ల దగ్గర పడుకుంది. దానికి తోక వుంది. దాని చెవులు వాలి వున్నాయి.

''ఒరేయ్, బాబూ, నీకో వేట కుక్కని తెచ్చాను'' అన్నాడాయన. ''దీని పేరు జెక్. చురుకైన కుక్క. నువ్వు చెప్పేది దానికి అర్థమవుతుంది.''

నాన్న కొరడా యెత్తి దానికి వాసన చూపించేడు. తర్వాత కొరడాని యెక్కడికో పొదల్లోకి విసిరేశాడు.



''వూఁ, వెళ్లి తీసుకురా జెక్'' అన్నాడు. వేట కుక్క వెంటనే దూసుకుంటూ వెళ్లింది. కొరడాని నోటితో పట్టుకుని యిట్టే తిరిగివచ్చింది.

యిది చూశేక యాజ్లి వాళ్ల యింటికి వెళ్లిపోయేడు. కొన్ని క్షణాల తర్వాత వాళ్ల నాన్న అన్నారి ఆగా, వాళ్ల మామయ్య జాకూల్, యాజ్లితో వచ్చేరు. కొంచెం సేపట్లోనే వో గుంపు పోగయింది, యీ అద్భుతమైన కుక్కని చూడడానికి. అన్నారి ఆగా వెంటనే మా నాన్నకి సలహా యిచ్చేడు.

''తంగ్రీకులీ ఆగా, యీ కుక్క తోకనీ, చెవుల్నీ కోసెయ్యి'' అని చెప్పేడు.

''అవును'' అని వో కావి రంగు పెద్దాయన బలపరచేడు. ''తోడేళ్లు మొదటగా కుక్క తోకనీ, చెవుల్నీ కొరక చూస్తాయి'' అన్నాడు.

యెవళ్లెవళ్లు యేమేం చెప్పదలచుకున్నారో చెప్పేదాకా నాన్న ఆగేడు. తర్వాత టోపీ తీసేసి బోడిగుండు రుద్దు కుంటూ అన్నాడు.

''నాయనలారా! జెక్ అల్సేషియన్ కుక్క యేం కాదు. దీనికి తోడేళ్లతో యుద్ధం చేసే పని లేదు. యిది నేటకి నాకు ఉపయోగపడుతుంది. పిట్టల్ని, కుందేళ్లని నేను కొడితే వాటిని వెతికి పట్టుకు రావడమే దీని పని. దీనికి సంబంధించి చెప్పుకోవాల్సింది దీని బలం గురించి కాదు, వాసన పట్టగలిగే దీని శక్తిని. దగ్గర దగ్గర కిలోమీటర్ దూరంలో వున్నా యిది అడివి కోడిని వాసన పడుతుంది. మిమ్మల్ని ఆ చోటికి తీసుకెడ్తుంది.''

మా నేస్తం జూమా ముందుకు వచ్చేడు.

''తంగ్రికులీ ఆగా మామా! దీనికి మనిషి మాట అర్థమవుతుందట నిజమా?''

''ఒరేయ్ చూడు!'' అని మా నాన్న చిన్నగా నవ్వుతూ అన్నాడు. ''మంచి వేట కుక్క యజమాని ముఖంకేసి చూసి అతని మనసులో యేముందో పసికట్టగలదు. జెక్ యింకా చిన్న పిల్ల, కాని దీనికి అప్పుడే శిక్షణ వుందిలే. నేను తుపాకీని కింద పెట్టి కాపలా కాయమని దీన్ని పురమాయించానో చచ్చినా ఆ చోటునుంచి కదలదు'' అన్నాడు.

కాని జూమాకి యింకా తృప్తి కలగలేదు.

''దీనికి రెండు జతల కళ్లున్నాయంటావా?''

''జెక్ కళ్లమీద నల్లని మచ్చలున్నాయి చూశావా? అవి తప్పుడు కళ్లు. అడివి జంతువుల్ని ఆ కళ్లతో కనికట్టు కట్టేస్తుంది.''

ఆ వారం అంతా జనం యీ ''నాలుగు కళ్ల'' అద్భుతమైన కుక్కని చూడడానికి మా యింటికి వస్తూనే వున్నారు.



సినిమాలు

నేను 1930లో పుట్టేను. అప్పట్లో పంచదార పెద్ద అచ్చుల్లా వచ్చేది. అది కూడా అపురూపంగానే వుండేది. టీ తాగేటప్పుడు అమ్మ మాకు తలా వో పంచదార బిళ్లనీ, ఆప్రికాట్ గింజంత ముక్కని, యిచ్చేది. ''పిసరు కూడా పారెయ్యకుండా తినండి. కింద పారేసుకునేరు జాగ్రత్త! దయగల పిట్ట యిచ్చింది దాన్ని మనకి'' అని హెచ్చరించేది.

టీ తాగేక మేం బయట యెండలో కూర్చునేవాళ్లం. వీపులు యింటి వేపు తిప్పి కూర్చునేవాళ్లం. దయగల పిట్ట వస్తుందని చూస్తూ కూర్చునేవాళ్లం.

అమావాస్యకీ పున్నానికీ వొక్క సారే అయినా అమ్మ ఆ పిట్టని చూసింది. కాని మేం వొక్క సారి కూడా చూడ లేకపోయేం.

కాగితాలు చుట్టిన చాకొలెట్ బిళ్లల్లాంటి వాటిని యెన్నడూ యెరగనే యెరగం, ముచ్చి కాగితాలు, ముచ్చి బంగారం కాగితాలు చుట్టిన బిళ్లల సంగతి సరే సరి! అందుకనే యీనాటి చిన్న పిల్లలు సగంసగం తినేసిన చాకొలెట్లని యిల్లాంతా పారేస్తూ వుండడం చూస్తే మాకు అయ్యో అన్యాయం అనిపిస్తుంది.

యిక సినిమాలు... యివాళ తప్పటడుగులు వేసే పిల్లలు కూడా టెలివిజన్ బాండ్ తిప్పేసి మంచి ప్రోగ్రాం యెక్కడ వుందో చూసి దాన్నే పెట్టుకుంటారు. బళ్లో చదువుకునే పిల్లాడిగా వున్నప్పుడు నేను మొదటి సారి సినిమా చూసేను.

స్థానిక యెన్నికలకి నాన్ననీ, అమ్మనీ, అన్నాలి ఆగానీ, అత్తనీ తీసుకెళ్లడానికి ఎడ్ల బండి వచ్చింది. నాకు బాగా గుర్తుందది.

''నన్నూ తీసికెళ్లండి'' అని నేను బతిమలాడేను. ''నన్ను మీతో కూడా తీసికెళ్లకపోతే నేనే వెనక్కాల వచ్చేస్తా'' అన్నాను.

నాన్న ఆ వేళ హుషారుగా వున్నాడు.

''సరే, బూట్లు తొడుక్కుని, కొత్త కోటు వేసుకుని, టోపీ పెట్టుకుని రా'' అన్నాడు.

మేం గ్రామ సోవియట్ ముందర ఆగేం.

ఆ భవనం యెదురుగ్గా పెద్ద డేగిసాల్లో సూప్‌నీ, పలావ్‌నీ వండుతున్నారు. మిగతా పిల్లలు బిస్కట్ ముక్కలు కొరుక్కు తింటూ పరుగు లెడుతూ ఆడుకుంటున్నారు. నేను మా నాన్నకి కరుచుకు పోయేను. ఆయనకి యేదో కాగితం ముక్కల్ని యిచ్చేరు. ఆయన వాటిని వో యెర్ర పెట్టెలో వేశాడు.

''తెలిసిందా, వోటింగ్ అయింది'' అని మా నాన్న హుషారుగా అన్నాడు.

నాకేమీ తెలీలేదు. కాని అడగడానికి బెరుకనిపించింది. నాన్న నన్ను చేత్తో పట్టుకుని వో చీకటి గదిలోకి తీసికెళ్లాడు. వో తెల్ల గోడమీద జనం కదుల్తున్నారు. వాళ్ల నోళ్ల తెరుస్తున్నారు, వాళ్ల పెదాలు కదులుతున్నాయి. కాని వొక్క ముక్క కూడా నాకు వినిపించలేదు.

''నాన్నా, యేమిటి అంటున్నారు వాళ్లు?'' అని గోడమీద కనిపించే జనం గురించి అడిగేను.

''సినిమారా యిది. మూకీ సినిమా, మాటలు వుండవు. మాట్లాడే సినిమాలు కూడా వచ్చేయట. అవి యిక్క డికి వచ్చినప్పుడు చూద్దాం'' అన్నాడాయన.

దెయ్యం చక్రం

కొంతకాలానికే మా యింట్లో కొత్త రోజుల నాటి వింత ప్రత్యక్షమైంది. మా పెద్దన్నయ్య ''దెయ్యం చక్రాన్ని'' కొన్నాడు. మా పిల్ల వాళ్లకి, — పెద్దాళ్లకి కూడా — యంత్రాలు వో పెద్ద వింతగా వుండేవి. జనం చేస్తూ చేస్తూ వున్న పనిని ఆపు చేసేసి వాటికేసి గుడ్లప్పగించి చూస్తూ వుండేవాళ్లు. ఓ ట్రక్కో, వో మోటారు బండో దారమ్మట



వెడుతూ వుంటే వూరి పెద్దలు కూడా భయంతో నోరు వెళ్లబెట్టి చూస్తూ వుండేవాళ్లు.

మొదట్లో మా అన్నయ్య యెవళ్లనీ తన బైసికిల్ చాయలకి రానిచ్చేవాడు కాదు. తనే యిరవై నాలుగ్గంటలూ దాన్ని తొక్కేవాడు. తర్వాత మమ్మల్ని బైసికిల్‌మీద యెక్కించుకు తీసుకెళ్లేవాడు. వొకటో రకం బైసికిల్ కొన్నాడు. దానికి హెడ్ లైట్ కూడా వుండేది.

కటిక చీకట్లో జయ్యన దూసుకుంటూ పోవడం నాకిప్పటిక్కూడా గుర్తుంది. కొయ్య కాలుతున్న వాసన, రోడ్డు మీద కొంచెం దూరం దాకా వెలుతురు పరుచుకు దారి కనిపించేటట్టు చేసే హెడ్ లైట్ కాంతి, దీపం వెలుతురికి పోగయే చిన్న చిన్న నుసుమల గుంపు, ధూళి రేణువులు గాలిలో లేచి దీపకాంతిలో మెరుస్తూ వుండడం నాకు గుర్తుంది.

జానపదు డెవరో ఉచ్చస్వరంతో మృదువైన గాత్రంతో పాడుకుంటూ వెళ్లడం నాకు గుర్తు వుంది.

మేం ఆ జానపద గాయకుడి పాట దిశలో ఖాండ్జా ఆగా యింటికి వెళ్లేం.

కిరసనాయిలు దీపం పసుపుపచ్చ వెలుతుర్లో కొంతమంది నాకు కనిపించేరు. వాళ్లు వో మంచంమీద దగ్గర దగ్గరగా కూర్చున్నారు.

ఆ మంచం మధ్యలో వో పెద్ద తివాసీ వుంది. అక్కడ మామూలుగా వుండే పలావ్ గాని, పెద్ద గిన్నెలో సూప్ గాని లేవు. వాటి బదులుగా జానపద గాయక యంత్రం వుంది — మా వూళ్లో అప్పుడు గ్రామఫోన్‌ని అలా పిలిచేవాళ్లు.

గ్రామఫోన్ ప్లేటు మారుస్తూ ఖాండ్జా ఆగా తర్వాత వచ్చే పాటనీ, పాడిన వారి పేరునీ పెళ్లిళ్లలో కానుకలిచ్చే వారి పేర్లు చదివినట్టుగా చదివేవాడు. తర్వాత ముల్లుని ప్లేటుమీద పెట్టి, అరచేతిలో గడ్డం ఆన్చుకుని మెదలకుండా కూర్చునేవాడు.

''అబ్బ! యేమద్భుతం!'' అని అక్కడ పోగయిన వాళ్లు వొకళ్లకొకళ్లు అనుకునేవాళ్లు. ''యిలాంటి దాన్ని భూమ్మీద యెన్నడేనా చూసి యెరుగుదురా, మనది కదా అదృష్టం అంటే! దీన్ని చూడ గలుగుతున్నాం'' అనుకునేవాళ్లు.



మా నాన్న

మా నాన్న భుజాలు వెడల్పు. ముఖం గుండ్రంగా వుంటుంది. యెర్రటి గడ్డం వుండేది. మెల్లిగా, అలసంగా నడుస్తున్నట్టు పైకి కనిపించేవాడు కాని ఆయన చురుకు, వేగం పై వాళ్లకి తెలియనిచ్చేవాడు కాదు. యీ రెండు లక్షణాలూ పచ్చిక మైదానంమీద, వేటలోనూ, పనిలోనూ తేలేవి. మా నాన్న పశువులని కాసేవాడు.

నేను చిన్న పిల్లాడిగా వున్నప్పుడు ఆయన దర్శనమే నాకు అపురూపంగా వుండేది. ఆయన మందని తోలుకుని వెళ్లేటప్పటికి నేనింకా కలలుకంటూ నిద్రలోనే వుండేవాణ్ణి. ఆయన తిరిగి యింటికి వచ్చే వేళకి గుర్రు కొట్టి నిద్ర పోతూ వుండేవాణ్ణి.

నేను బళ్లో చేరాకనే ఆయన్ని బాగా చూడగలిగేను. తన బిడ్డలందరికీ ఆయనే పాఠాలు చెప్పేవాడు, ఆయనకిగా ఆయనకే చదవడం, రాయడం రాకపోయినా. ఆయనకి వచ్చిందల్లా సంతకం చెయ్యడం. తంగ్రీకులీ అని లాటిన్ లిపిలో రాసేవాడు. ఆ నాలుగక్షరాలూ రాసేటప్పటికి ఆయన నాలిక నీలంగా అయిపోయేది. ఆయన వూదా పెన్సిల్‌తో రాసే వాడు. అక్షరం అక్షరానికీ పెన్సిల్‌ని నాలిక చివర తట్టుకుంటూ వుండేవాడు.

ఆయన గొంతు సవరించుకుంటూ వాకిట్లో పచార్లు చేస్తూ వున్నా, కూర్చుని తలమీదనుంచి బొచ్చు టోపీ తీసేసి, గుండు రుద్దుకుంటూ వున్నా ఆయన మంచి హుషారుగా వున్నాడన్న మాట. ధైర్యంగా ఆయన దగ్గరికి వెళ్ళి యేమన్నా అడగగలం అన్నమాట. కాని ఆయన చూపు తప్పించుకుని, చేతులు రుద్దుకుంటూ వుంటే ఆయన మనసు బాగో లేదనీ, కోపంగా వున్నాడనీ సూచన అన్నమాట. అలాంటప్పుడు ఆయన కంటబడకుండా తప్పించుకోవడం మంచిది.

నిజానికి యీ విషయాలు క్రమేపీ పెద్దవాడయే కొద్దీ నాకు తెలిశాయి.

''దయ్యం చక్రాలు'', మోటారు సైకిళ్ల, కార్లు, ట్రక్కులు, భారీ ట్రాక్టర్లు, కొత్త పద్ధతులు, కొత్త శైలులు, కొత్త ఆశలు. బ్రహ్మాండమైన పందెం గుర్రాల గురించి మేం ఆలోచించడం మానేశాం, యంత్రాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాం.

యాజ్లి, మా అన్నయ్య, నేను – మేం ముగ్గురం కలిసి నాలుగు చక్రాల బండిని తయారు చేశాం. దానికి స్టీరింగ్ పెట్టాం. మా అద్భుత శకటాన్ని యెత్తైన కొండ పై కంటా దొర్లించుకు పోయేవాళ్లం. అక్కణ్నుంచి బజార్లో కంటా జారుకుంటూ వచ్చేవాళ్లం. మాకు అంతకంటే మంచి చోటు దొరికింది కాదు. ఆ బజార్లో జనం గుంపులు గుంపులుగా వుండేవారు. మాకు అమ్మా నాన్నా బట్టలూ గిట్టలూ అక్కడ్నే కొనిపెట్టేవాళ్లు.

మా బండి చూస్తే మా స్నేహితులు అందరికీ కన్నుకుట్టేది. అడిగిన వాళ్లందర్నీ యెక్కించుకునేవాళ్లం. వో సారి నాలుగేళ్ల బుజ్జి చారి పడుతూ లేస్తూ కొండ పైకి వచ్చి తనని యెక్కనియ్యమని అడిగేడు. నేను వీల్లేదన్నాను. కిందికి జారడం నూటికి నూరుపాళ్లూ యే ప్రమాదమూ లేకుండా వుందా యేమన్నానా, బండి తిరగబడచ్చు, యెవడికో కాలో చెయ్యో విరగచ్చు.

''నువ్వెక్కద్దు, కొంచెం పెద్ద వాడయే దాకా ఆగు'' అన్నాను.

ఆ సాయంత్రం చారి వాళ్ల నాన్న మా యింటికి వచ్చేడు.

''మీ కయూమ్ మా చిన్న పిల్లల్ని బెదరేస్తున్నాడు. మా చారిని కొట్టేడు. పిల్లాడు యింకా యేడుపు మాన లేదు'' అని చెప్పాడు.

అదంతా అబద్ధం అని అసలేం జరిగిందో చెప్పాను. అయినా మా నాన్న వింటేనా! అక్కణ్ణే ఆయన తపాతపా నాలుగు వొడ్డించేడు నాకు, దోషిని శిక్షించకుండా వదల్లేదుస్మా అని చారి వాళ్ల నాన్నకి అనుమానం లేకుండా తెలియాలని.

చారి వాళ్ల నాన్న శాంతించేక, వెళ్లిపోయే ముందు నాకేసి తిరిగి అన్నాడు:

''మళ్లీ కొంటె పనులు చేశావని తెలిసిందో, తాట వొలిపిస్తా.''

నాకు అప్పటికే యెనిమిది యేళ్లు. నేను కొర్సక్ అన్నా, నక్క అన్నా భయపడేవాణ్ణి కాదు కాని దగాకోర్లు అంటే భయపడేవాణ్ణి, అబద్ధాలు చెప్పేవాళ్లంటే భయపడేవాణ్ణి.

యీ కటువైన గుణపాఠానికి అంతే బాధగా వున్న తరవాయి వచ్చింది. అదే ఆశ్చర్యకరమైన సంగతి.

పశువుల దొడ్డికి పక్కనే చదునుగా వున్న జాగా వుంది. అది ఖాళీగా వుండేది. బడి అయిపోయేక పిల్లలంతా లప్తా అని వొక ఆట ఆడుకునేవాళ్లు అక్కడ. ఆ ఆట వో రకంగా బేస్‌బాల్ ఆటలా వుంటుంది. మేం గుడ్డ పీలికలు

చుట్టి బంతిని తయారు చేశాం. అది బాగా యెగిరేది కాదు. కాని చకచక సాగిపోయే ఆ ఆట అంటే అందరికీ యిష్టంగా వుండేది.

నన్ను యెప్పుడో గాని ఆడనిచ్చేవాళ్లు కారు. నేను చిన్నగా వుండడంవల్ల యెక్కువ చెయ్యి తిరిగిన పెద్ద పిల్లలు నన్ను యిట్టే కొట్టెయ్యడానికి వీలు వుండేది. ఓ సారి యెవళ్లో బస్తీనుంచి పసుపచ్చ రబ్బరు బంతిని తెచ్చేరు. దాన్ని నేలకేసి కొడితే అది ఒంటె కంటే యెత్తు యెగిరేది. ఆ రోజున నన్ను యెప్పటిలాగానే ఆటలో చేర్చుకోలేదు. నేను పక్కన నుంచున్నాను. పెద్ద కుర్రాళ్లు ఆడుతూ వుంటే అసూయగా చూస్తూ నుంచున్నాను. వున్నట్టుండి యెవళ్లో బంతిని గట్టిగా కొట్టేరు. అది వొచ్చి నా కాళ్ల దగ్గర పడింది. అది యెగిరేటప్పుడు నేను దాన్ని పట్టుకున్నాను. అది వూలులా వుంది. స్ప్రింగులాగా గట్టిగా వుంది. నాలుగు యెర్రటి పట్టీలు వున్నాయి. ఆ అద్భుతమైన బంతిని చేత్తో పట్టుకుని యింకా సరిగా చూశానో లేదో మరి!

''దాన్నిలా విసురు'' అని వాళ్లు అరిచేరు.

''నన్నాడ నివ్వకపోతే నేనివ్వను'' అన్నాను.

''నువ్వు పొడుగయేక ఆడినిస్తాం, బంతిని యిలా యియ్యి'' అని అరిచేరు.

నేను గట్టిగా చుట్టు తిప్పి బంతిని కంచె పై నుంచి పశువుల దొడ్డిలోకి విసిరేశాను.

బంతి యెవడిదో ఆ కుర్రాడు పరిగెత్తుకుంటూ వొచ్చి నన్ను వూచిపుచ్చుకు లెంపకాయ కొట్టేడు.

నాకు హఠాత్తుగా చారితో జరిగిన గొడవ గుర్తు వచ్చింది. పిక్క బలం కొద్దీ యింటికి పరిగెత్తి వెళ్లిపోయేను.

''నాన్నా! ఆ వెధవ నన్ను కొట్టేడు. వాడు నాకంటే పెద్దగా వున్నాడు, వెళ్లి వాడికి బుద్ధి చెపుదాం'' అని కళ్లల్లో నీళ్లు తిరుగుతూ వుంటే అరిచేను.

ఆయన వొక్క ఉదుటున లేచి, తన కొడుకుని కొట్టిన వాణ్ని పట్టుకుని కసి తీర్చుకుంటాడని నేననుకున్నాను. కాని ఆయన ఉలుక్కుండా పలుక్కుండా యెక్కడి వాడక్కడే టీ తాగుతూ కూర్చుండి పోయేడు. అసలు నేనన్న ముక్క విననట్టే నటించేడు.

''నాన్నా! వాళ్లు నన్ను చితక తన్నేరు'' అని నేను మొత్తుకున్నాను.

''తన్నులు తినకుండా వుండాలీ నీ వయసు పిల్లలతో ఆడుకో, పెద్ద పిల్లల జోలికి పోకు'' అని ఆయన నన్ను వదిలేశాడు.

నేను అక్కడ కాసేపు నుంచుని వెళ్లిపోయేను.

మెడలేని ఒంటె

మా నాన్న మందల్ని పచ్చిక బీళ్లనుంచి అప్పుడే తోలుకు వచ్చేడు. యెప్పటిలాగానే అమ్మ ఆయనకి కప్పులో టీ పట్టుకు వచ్చి యిచ్చింది. చురెక్ అప్పచ్చి కూడా పట్టుకొచ్చి యిచ్చింది. ఆయన టీ తాగేక మాకేసి చూశేడు. ఆయన ముఖం మామూలుకంటే యెక్కువ అలిసిపోయినట్టు, పీక్కుపోయినట్టు వుంది.

''బాబూ!'' అని మా అన్నయ్యని పిలిచేడు. ''కొమ్ముల్లేని ఆవు అక్కడే దుబ్బుల్లో వుండిపోయింది. అది వూబిలో పడింది. దాన్ని బయటికి లాగడానికి చాలా ప్రయత్నం చేశాను. నా వొక్కడివల్లా అవలేదు. నువ్వు రావాలి సాయానికి'' అన్నాడు.

వాళ్లు బయల్దేరి వెళ్లే సమయానికి వూరి పెద్ద వొకాయన మమ్మల్ని చూడ్డానికి వచ్చేడు. ఆయన గడ్డం నెరిసిన ముసలాయన.

ఆయనకి టీ యిచ్చి మర్యాద చెయ్యక తప్పలేదు నాన్నకి. వాళ్లు తివాసీమీద కూర్చున్నారు. ఆ తివాసీని ప్రత్యేక సందర్భాలకే వాడుతూ వుంటారు. ఆ ముసలాయన మర్యాదగా, సావకాశంగా మాటలు మొదలుపెట్టేడు.

''అంతా అల్లా దయ. యెవళ్లకీ రోగం రొష్టూ రాకూడదని ప్రార్థిద్దాం. అసూయ చూపులు, చెడ్డ నోరు, క్షుద్ర దేవతలు దయ్యాలు లేకుండా వుండేట్టు చెయ్యమని అల్లాని ప్రార్థిద్దాం. యీ మధ్య కాలంలో చాలా మందిని దెయ్యం పీడించింది.''

''యెవర్ని పీడించింది?'' అని అన్నయ్య అడిగేడు. ఓ పక్క ఆవుని కాపాడాలి. ఆ ముసలాయన, అందరూ గౌర వించే వ్యక్తే అయినా, పోచికోలు కబుర్లు చెప్తూ వుండే మనిషి అనీ అందరికీ తెలుసు.

ఆ ముసలాయన పెదవి కరుచుకున్నాడు, పడుచు కుర్రాడికి మర్యాదలు తెలీలేదని చిరాకు పడుతున్నాడని తెలుస్తూనే వుంది. ఆయన ముక్కు చీదుకుని, ఓ గుక్క టీ తాగి, తంబాకు నోట్లో పెట్టుకుని అప్పుడు మొదలు పెట్టేడు:

''పెద్దాయన చారి ఆగా కొడుకు దెయ్యం కొట్టం దగ్గర్నుంచి వెడుతున్నాట్ట. నిప్పులు తినే దెయ్యం బండి వుందట. అక్కడ అతనికి మెడలేని ఒంటె కనిపించిందట. ఆ కుర్రాడికి భయం వేసేసిందట యెవళ్లకేనా భయం వేస్తుంది కదా మరి! దాంతో జబ్బు పడ్డాడు.''

''నేను ఆ కొట్టం దగ్గర్నుంచి రోజూ పొద్దున్నా, రాత్రి బాగా పొద్దుపోయాకా వెడుతూ వుంటాను, వస్తూ వుంటాను. కాని మెడలేని ఒంటె అనేదెప్పుడూ కనిపించలేదే'' అన్నాడు మా నాన్న.

ఆయనకీ వోపిక పోతోంది, కాని మర్యాద పాటించాలి, యేం చేస్తాడు. యీ ముసలాయనేమో తన ధోరణిలో తను పోతూనే వున్నాడు.

''తంగ్రీకులీ ఆగా'' అని ముసలాయన గడ్డం నిమురుకుంటూ అన్నాడు. ''నీకలాంటి ఒంటె కనిపించక పోవ డంలో వింత యేమీ లేదు. దెయ్యాలు యెవళ్లకి పడితే వాళ్లకి కనిపించవు. నా చిన్నప్పుడు నాకు యెక్కువ సార్లు కనిపించేవి. ఓ సారి నాకు తల దువ్వుకుంటూ వున్న ఆడమనిషి రూపంలో దెయ్యం కనిపించింది. అమూదార్య నది పక్క పొదల్లో కనిపించింది. యింకో సారి నాకు తోడేలు దెయ్యం కనిపించింది...''

''యేమో అది అసలు తోడేలేనేమో, దెయ్యాలు భూతాలు వొత్తి కాకమ్మ కథలని మాకు బళ్లో చెప్పేరు'' అన్నాను నేను.

''ఒరేయ్ పెద్ద వాళ్లు మాట్లాడేటప్పుడు అడ్డం వెళ్ల కూడదు'' అని మా నాన్న నన్ను మందలించేడు.

''మీ నాన్న చెప్పింది నిజమేన్రా, అబ్బాయ్'' అంటూ ముసలాయన నాకు బుద్ధి చెప్పడం మొదలెట్టేడు. ''మట్టూ మర్యాదా తెలీని బడుద్దాయిలే పెద్ద వాళ్ల మాటలకి అడ్డం వెడతారు. నీకంత గుండె ధైర్యం వుంటే వో చీకటి రాత్రి పూట నువ్వు దెయ్యం కొట్టం దగ్గరికి వెళ్లి చూడు. కాని నాకు తెలుసు నీకా ధైర్యం లేదు. యింత బొట్టెడువి, నీకు ధైర్యం యెక్కడుంటుంది? వేడివేడి చురెక్ అప్పచ్చికంటే నువ్వేం చూశావ్ కనక?'' అన్నాడు ఆయన.


ఆయన నన్ను చిన్న పిల్లాడివని చెప్పి తీసి పారెయ్యాలనుకున్నాడు. నేను యెప్పుడూ యింట్లో ఆడవాళ్లుండే భాగంలో తల్లి కొంగుకి అంటుకుపోయి వుంటాననీ, చురెక్‌లని కాల్చడం, పొయ్యిలోనుంచి తియ్యడం ఆడవాళ్ల పని మాత్రమేననీ ఆయన సూచించడం ద్వారా అలా చెప్పాడు.

''దెయ్యం అలా వ్యాపించడానికి కారణం జనం మకిలి నదిని కెలకడమే'' అన్నాడు.

''అంటే కాలవ అనా?'' అంటూ మా అన్నయ్య కోపంగా అడిగేడు.

''నదుల్ని దేవుడు సృష్టించేడు'' అని ఆ పెద్దాయన ముఖం ముడుచుకుంటూ చెప్పేడు. ''అల్లా సృష్టించిన దాంటో వేలు పెట్టే హక్కు మనుషులకి లేదు'' అన్నాడు.

యీా పోచికోలు కబుర్లూ, కాకమ్మ కథలూ అయ్యాకనే ఆయన తను వచ్చిన అసలు పని బయట పెట్టేడు. వో అరడజను తన ఆవుల్ని మందలోకి తీసుకొమ్మని నాన్నని అడిగేడు. ఆ ముసలాయన బాగా డబ్బున్న వాడు. కొత్త పద్ధతులంటే ఆయనకి భయం.




తోతి మామ్మ కథలు

నాన్న, అన్నయ్య ఆవుని బయటికి తియ్యడానికి వెళ్లేక తోతి మామ్మ వచ్చింది. తివాసీమీద కూర్చుని ఆమె వో కదురునీ కండెనీ తీసుకుని వూలుతో దారం వొడకడం మొదలుపెట్టింది.

''ముందు కొంచెం టీ తీసుకోండి, యిప్పుడే వంట తయారవుతుంది'' అంది అమ్మ.

నాకు సరిగ్గా అప్పుడే అమ్మ వొండుతూ వున్న అడివి కోడి సూప్ వాసన తగిలింది. ఆ అడివి కోడిని నాన్న వేటాడి





తెచ్చేడు. అమ్మ పొయ్యి దగ్గరికి వెళ్లేక మేమంతా తోతి మామ్మ చుట్టూ చేరాం. మేం యెందుకు తన చుట్టూ మూగేమో ఆవిడకి తెలుసు. ఆమె తన కదుర్ని పక్కన పెట్టి, కాస్త టీ చప్పరించి కథ మొదలుపెట్టింది. వో కుర్రాడు దురాశాపరుడైన రాజుని చంపి తనే రాజు అవడానికి యెలా వో గుంటనక్క యుక్తిగా సాయం చేసిందో మొదట చెప్పింది. తర్వాత లుక్మాన్ గురించి చెప్పింది.

''లుక్మాన్‌కి తండ్రి వుండేవాడు. చాలా చాలా ముసలి తండ్రి'' అని తోతి మామ్మ మృదువుగా మొదలుపెట్టేది. మేం ఉగ్గబట్టుకు వినేవాళ్లం. ''ఆఖరికి యెంత ముసలివాడై పోయేడంటే కొడుకు నీరసించిపోయిన ఆ ముసలి తండ్రిని కొండ అవతలి వేపు తీసికెళ్లి అక్కడ వొదిలేసి రావాల్సి వచ్చింది. అలా వొదిలెయ్యడం పచ్చిక బీటి వాసుల పాత ఆచారం. అక్కడ ముసలతను చనిపోతాడు. వో రోజున లుక్మాన్ నిండుగా వున్న బస్తాని కొండల్లోకి తీసుకు వెళ్లడం ప్రతివాళ్ళూ చూశేరు. అతను తిరిగి వచ్చేటప్పుడు బస్తా ఖాళీగా వుంది. 'తండ్రిని తీసుకెళ్లిపోయేడు' అని జనం అనుకున్నారు. యిక ఆ విషయం గురించి పట్టించుకోలేదు. యేమంటే ఆ క్రూరమైన ఆచారం అందరికీ వర్తిస్తుంది. ముసలి లుక్మాన్‌కి జబ్బుల్ని నయం చేసే సామర్థ్యం వుండేది. కొడుకు లుక్మాన్‌కీ ఆ విద్య పట్టుబడిందని త్వరలోనే జనం గుర్తించేరు. రోగాల్ని నయం చేసే మూలికలూ, మందులూ అతనికి తెలుసు. ఆ పచ్చిక మైదానం అంతా లుక్మాన్ పేరు వైద్యుడుగా మోగిపోయింది.

ఓ సారి అతన్ని అడిగేరు:

'నువ్వింకా కుర్రాడివి కదా. యీ మూలికల గురించీ, మందుల గురించీ మాకుల గురించీ నీకు యెలా తెలిసింది?' అని అడిగేరు. 'మా నాన్న విషయం మర్చిపోయేరా యేమిటి? యే జబ్బునేనా గానీ నయం చెయ్యడం ఆయనకి తెలుసు. ఆయన్ని కొండ అవతలికి తీసికెళ్లి పారెయ్యలేదు. ఓ బస్తాడు పాత గొర్రెతోళ్లు తీసుకెళ్లి పారేశానంతే. మా నాన్న యీ వైద్యం మెలుకువలన్నీ నాకు చెప్పేరు' అన్నాడు కుర్ర లుక్మాన్.

''నీరసించి పోయిన ముసలి తండ్రినీ, లుక్మాన్‌నీ కలిపి బహిష్కరించాలా వద్దా అని తేల్చుకోవడానికి జనం ఆలోచించడం మొదలుపెట్టేరు. కాని జబ్బులు నయం చేసే వైద్యుడు లేకుండా పోతాడేమోనని వాళ్లకి బెదురైంది.

''దాంతో లుక్మాన్ ఆ తెగకి నాయకుడయేడు. జనం తమ ఆచారాలు చూసి సిగ్గు పడ్డారు. అప్పట్నుంచీ ముసలి వాళ్లని చనిపోయే దాకా మర్యాదగా చూడడం మొదలుపెట్టేరు.''

తోతి మామ్మ కథలంటే నాకు యెప్పుడూ యిష్టంగా వుండేది. కాని ఆ వేళ యింకా యింకా చెవులప్పగించి విన్నాను.

''మామ్మా, నువ్వెప్పుడన్నా దెయ్యాల్ని చూశేవా?'' అని అడిగేను.

''అల్లా కృప చూపించు గాక'' అని మామ్మ అంది.

''కాని, మామ్మా, నీకు మహిమ లేమన్నా తెలుసా?'' అని నేను మళ్లీ అడిగేను.

''నాకు తెలిసిందల్లా వొక్కటే'' అంది మామ్మ. ''మన తుర్కేమన్‌లకి వందో రెండు వందలో పేర్లు వుంటే, పాములకి వెయ్యి పేర్లున్నాయి. పాము అసలు పేరు యెవళ్లకీ తెలియ నివ్వదు. యే పాము పేరన్నా నువ్వు తెలుసుకో గలిగేవో అది తల వొంచి నీకు గులాం అయిపోతుంది'' అని చెప్పింది.

నేను యింకా యేవేవో అడిగే వాడినే. కాని అమ్మ పెద్ద దాబరా గిన్నెలో సూప్ పట్టుకుని వచ్చింది, అప్పుడే.

తోతి మామ్మ చెంచాతో కొంత సూప్ తాగి మెల్లిగా చురెక్ అప్పచ్చిని కొరికి నమలడం మొదలుపెట్టింది.

''కొంచెం మాంసం తినండి. అడివి కోడి. చాలా రుచిగా వుంటుంది'' అని అమ్మ అంది.

''చాలమ్మా!'' అంది మామ్మ. కాని మాంసం తాకలేదు.

అప్పుడు అమ్మ స్వయంగా మామ్మ కంచంలో కొంచెం మాంసం వడ్డించింది. మామ్మ తినడం మొదలుపెట్టింది. తోతి మామ్మ చాలా ముసలావిడ. యేనాటివో పాత ఆచారాల నన్నిట్నీ పాటించేది.

పాము, పెద్ద బల్లి, మా మంద

ప్రతి రోజూ నేనూ యాజ్లి కొంకి కర్రలు తీసుకుని గొర్రెలకి మేత కోసుకు రావడానికి వెళ్లేవాళ్లం. చక్కగా, రసం వూరుతూ వుండే గడ్డి కోసం వెతుకుతూ మేం వొక సారి చాలా దూరం, బాగా దూరంలో వుండే పుచ్చకాయల పొలాల దాకా వెళ్లేం.

యాజ్లి మేన మామ జాకూల్ ఆగా. దెయ్యం చక్రం వున్నది ఆయనకే. ఆయన పొలాల కాపలాదారు.

యెండ పేల్చేస్తూ వున్నా జాకూల్ ఆగా గుడిసె ముందు బయట కూర్చుని వున్నాడు. యెందుకనో కారణం తెలీదు.

''హుష్!'' అని సైగ చేశాడాయన, మేము మా మూటలు కింద పడేసి దగ్గరికి వెళ్లగానే. ''లోపల పాము వుంది. దేన్నో వొడిసి పడదామని చూస్తోన్నట్టుంది. మెదలకుండా కూర్చోండి, యేం జరుగుతుందో చూద్దాం.''

జాకూల్ ఆగా అన్న ముక్క నిజమే. మేం చూస్తూ వుండగానే వో పెద్ద బల్లి భయంకరంగా బుస కొడుతూ లోపలికి వెళ్లింది. పాము దాని తోకని తకామని తెంపేసి దూసుకు పోయింది. కాని బల్లి దాన్ని అంది పుచ్చుకుని లాగుతూ వుంది. మేం కిమ్మనకుండా వెనక్కాలే వెళ్లాం. బల్లి పళ్లతో పాము వీపుమీద కొరికి చంపేసింది. అప్పుడు అది మమ్మల్ని చూసింది. పారిపోదామని ప్రయత్నించింది. కాని మేం దాన్ని పట్టుకుని వో తాడు తీసుకుని దూడని గుంజకి కట్టినట్టు కట్టి పారేశాం. తర్వాత దానికి కొంచెం మాంసం పెట్టాం. అది దాన్ని ఆబగా మెక్కింది.

జాకూల్ ఆగా సమష్టి క్షేత్రం ఆఫీసుకి వెళ్లేడు. మేం బల్లిని చూస్తూ, మంచి కర్బుజాలు తింటూ గుడిసె నీడలో చేరాం. ఆ బల్లి యెలా తాడు వదిలించుకు పోతుందా అని చూస్తూ వున్నాం. యింతలోకే వున్నట్టుండి యింకో బల్లి అదే యిసిక తిన్నెల వెనకనుంచి వచ్చింది. తాడు కట్టిన బల్లిమీదకి వురికి దాన్ని డొక్కల్లో మోదింది. అప్పుడు పారిపోయింది.

మేం మా బల్లికి సాయం చేద్దామని పరిగెత్తి వెళ్లాం. దాని గాయంనుంచి రక్తం కారుతోంది. దాన్ని యింటికి తీసుకు వెళ్లాం. గాయానికి అయొడిన్ రాసి, దాన్ని వో పెట్టె కింద వుంచేం. మేమూ పెద్దవాళ్లూ కూడా దానికి రోజూ పది సార్లు మేత పెట్టేవాళ్లం. త్వరలోనే అది కోలుకొంది. అది మా పెంపుడు జంతువు అవుతుందని అనుకున్నాం. కాని పెట్టె యెత్తి చూస్తే యేముంది! అది కసిగా మాకేసి పళ్లు కొరికేటట్టు పెట్టి, గడ్డిలోకి మాయమైపోయింది.

* * *

యాజ్లికి, నాకూ మా తల్లిదండ్రులు అసలైన వ్యాపకం చూశేరు. మేం కూడా మా తండ్రుల్లాగా గొర్రెల కాపర్లం. మా దగ్గర తక్కువ పశుగణమే ననుకోండి — మేకలు, గొర్రెలు. అవేనా సంఖ్య తక్కువే — మొత్తం పదిహేడు. బడి అయిపోయేక మేం వాటిని మా నాన్న తోలుకు వెళ్లిన దారిలోనే తోలుకు వెళ్లేవాళ్లం. అచ్చం గొర్రెలకాపర్లలాగా మేం యెప్పుడూ తిండి కూడా తీసుకు వెళ్లేవాళ్లం, చురెక్‌లో పుచ్చకాయలో కర్బుజాలో యేదో వొకటి.

మాకు మా సరంజామా కూడా వుండేది. యాజ్లికి దిక్సూచి వుండేది, నా దగ్గర చిన్న కత్తి వుండేది. యీ కత్తి పిడిమీద వో పెట్ట బొమ్మ వుండేది. మా కర్రలు సరేననుకోండి.


మేం మా మందని ''అడివి''లోకి తోలుకు వెళ్లేవాళ్లం — నది వారనే వున్న పొదల్లోకి. ఆ పొదలకింద మంచి గడ్డి పెరిగేది.

నది మా నేస్తం. నదిని దాటడం మా చురుకైన గొర్రెలకీ మేకలకీ అసాధ్యం. కాని తప్పిపోయిన వాటి కోసం వెతకడం మాత్రం మా పనిగానే వుండేది. ఓ సారి వో పొట్టేలు లేకుండా మేం తిరిగివచ్చేం. దాన్ని చుర్‌మెనెక్ అనే పేరుతో పిలిచేవాళ్లం. దాపుల్లో యెక్కడా అది కనిపించలేదు. వో పక్క చీకటి పడుతోంది. దాని కోసం వెతుకుతూ ''అడివి''లోకి పోవాలంటే భయం వేసింది. మేం చీకట్లో మందను తోలుకు వస్తూ దగ్గర దగ్గరగా భుజం భుజం రాసుకుంటూ నడుస్తూ వున్నా కావాల్సికి గట్టిగా మాట్లాడుతూ వచ్చేం. ఆ రకంగా అడివి జంతువుల్ని బెదర గొట్టాలని చూశేం.

ఆ మర్నాడు నేను బడి యెగ్గొట్టి యింటి దగ్గరే వుండిపోయేను. గాడిదమీద స్వారీ చేస్తూ బయల్దేరి తప్పిపోయిన పొట్టేలు కోసం వెదకడం మొదలెట్టాను. చుర్‌మెనెక్ వెనక కాళ్లు దుబ్బుల్లో చిక్కుకు పోయేయి. ఆఖరికి దాన్ని కనిపెట్టేను. అది వికారంగా తల కిందికి పెట్టి పడి వుంది. గట్టిగా దానికి శ్వాస ఆడడం లేదు. ఆ చుట్టు పక్కల పొదల్లో నక్కల జాడలు దట్టంగా వున్నాయి. చుర్‌మెనెక్ భీకరంగా పోరాడి వుండాలి యీ చిక్కునుంచి బయట పడడానికి. పిరికి నక్కలు దానిమీదకి దూకడానికి భయపడి వుంటాయి. నేను చిక్కు పడ్డ దుబ్బులు

కోసేసి పొట్టేళ్ళని గడ్డి బీట్లోకి తోలేను. నేను అలా చెయ్యకూడదని నాకు తెలుసు. కాని అలాంటి కాళ రాత్రి గడిపిం తర్వాత దానికి ఆ మాత్రం బహుమతీ వుండాలని అనిపించింది.

కడుపు నిండా మేత మేశాక యాజ్లి నేనూ కట్టిన టుప్‌టుప్ పందిరికేసి చుర్‌మెనెక్ దూసుకుపోయి దాన్ని గట్టిగా ఢీకొంది. దాంతో అది కూలి చక్కాపోయింది.



అడివి పంది

మేం నేలమీద బాసిపట్టు వేసి కూర్చున్నాం. ముందర వో రుమాలు పరిచేం. కర్బుజాలు తింటున్నాం. దగ్గర్లోనే మా మంద గొర్రెలు బాగా మేత మేసి అరమోడ్పుగా వున్నాయి. సరిగ్గా అప్పుడే ఆకురాలు కాలపు తేలిక జల్లు ఆగింది. మా ప్రాంతాల్లో అలా జల్లు పడడం అరుదు. నేల మళ్లీ పసిరిక లీనుతోంది. గాలి వసంతరుతు వాసనలతో వుంది. యాజ్లి నేనూ తాయితీగా మాట్లాడుకుంటున్నాం. హడావుడి లేకుండా పెద్దవాళ్ల మాదిరిగా, మాటమాటా తూచి మాట్లాడుకుంటున్నాం. పెద్దవాళ్లకి మల్లే జీవిత సమస్యల గురించి మాట్లాడుకుంటున్నాం. పొదల్లో యెక్కడి నుంచో గుండు పేలిన చప్పుడు వినిపించింది.

''మీ నాన్నేమో'' అన్నాడు యాజ్లి.

''యేమో మరి.''

''మీ యింట్లో అలాంటి మంచి వేటగాడు వున్నాడు, మీ అదృష్టం.''

''నిజమే. మేం మాంసం కొనుక్కో అక్కర్లేదు. వో గొర్రెని కోసే దానికి బదులుగా దాన్ని యీనేందుకు పెంచుకోవచ్చు'' అని నేను అన్నాను.

''మీ నాన్న సరిగ్గా గురి చూసి పిట్ట కంటిమీద కొడతాడనీ, వొక దెబ్బకి రెండు మూడు అడివి కోళ్లని పడ గొడతాడని అంటారు. నిజమేనా?''

''నాకు తెలీదు. ఆయన వేట గురించి యెక్కువ మాట్లాడరు. కాని వొక్క దెబ్బకి రెండు అడివి కోళ్లని కొట్ట లేని వాడు వేటగాడే కాదని ఆయన వో సారి మీ నాన్నతో అంటూ వుంటే విన్నాను.''

''ఆయన తుపాకీలో యెన్ని తూటాలు పడతాయి?''

''నాన్నగారి తుపాకీ వొకే గొట్టంది. అంచేత వొక తూటాయే పడుతుంది. రెండు గొట్టాలది అవసరం అయితే తప్పకుండా కొంటాడు.''

వున్నట్టుండి యాజ్లి ఆఁ అని నోరు వెళ్లబెట్టేడు. పొదల్లోనుంచి పెద్దగా, చిటచిట లాడే ధ్వని సరిగ్గా మా పక్కనే వినిపించింది.

మేం ఠకామని లేచి నుంచున్నాం. మా మేకలూ గొర్రెలూ ఆగి వో క్షణం పస్తాయించి చూశేయి. తర్వాత మళ్లీ మాగన్ను పడిపోయేయి. కాని నా భయం భయంలాగే వుంది.

''తోడేలేమో.''

''హేయ్!'' అని యాజ్లి కర్ర ఆడిస్తూ పొదల్లోకి వెడుతూ అరిచేడు. మరుక్షణంలో వెనక్కి గెంతేడు. ''కయూమ్, అక్కడ యేదో బుర్రుమంటోంది'' అన్నాడు.

భయం తగ్గించుకుని నేను కర్ర అందుకుని యాజ్లి దగ్గరికి వెళ్లేను. సరిగ్గా ఆ క్షణంలో వో పెద్ద అడివి పంది పొదల్లోనుంచి యివతలికి విరుచుకుంటూ వచ్చింది. అది మా పక్కనుంచి దూసుకుంటూ పరిగెత్తి, వెల్లు దుబ్బులు చీల్చుకుంటూ పోయింది. తర్వాత యే చప్పుడూ లేకపోయింది. అప్పుడు మా నాన్న గొంతుక వినిపించింది.

''జెక్! జెక్!''

వేట కుక్క గెంతుకుంటూ మా దగ్గరికి వచ్చింది. రెల్లు పొదలోకి పోయింది.

''నాన్నా!'' అన్నాన్నేను.

''కయూమ్!'' పొదలు మరో సారి చిటపట చప్పుడు చేశాయి. నాన్న మా దగ్గరికి పరిగెత్తుకు వచ్చేడు. ''మీకేం అవలేదు కదా?'' అని అడిగేడు.

''బాగానే వున్నాం'' అని మేం ఆశ్చర్యపోయి జవాబు చెప్పేం.

''అడివి పంది యేదీ? అది గుండు దెబ్బతింది. అలాంటప్పుడది చాలా ప్రమాదం.''

రెల్లులోనుంచి జెక్ మొరుగు ప్రతిధ్వనిస్తోంది. నాన్న తుపాకీ భుజంమీద వేలాడేసుకుని రెల్లుకేసి వెళ్లేడు. మరో సారి తుపాకీ పేల్తుందని మేం చూస్తూ వున్నాం. కాని నాన్న అంతలోనే తిరిగివచ్చేడు. ఆయన భుజంమీద తుపాకీ యింకా అలానే వేలాడుతోంది.

''ఖతం అయింది. గట్టి దెబ్బ తగిలింది దానికి'' అని నాన్న మా తలలమీద తడుతూ అన్నాడు. ఆయన చెయ్యి కొంచెం వణికిందని నాకు తెలిసింది.

''యేం, వెళ్లి వాలోషిన్ ఆగాని పిలుచుకు రమ్మంటావా?'' అని నేను అడిగేను.

''వూ వెళ్లండి, నేను మీ మందని కాస్తూ వుంటాను.''

మేం వాలోషిన్ ఆగాని పిలుచుకు రావడానికి వూళ్లోకి పరిగెత్తేం. అడివి పంది పందే కదా. వూళ్లో యెవళ్లూ పంది మాంసం రుచి చూసి యెరగరు. నాన్న యెప్పుడో గాని అడివి పందుల వేటకి వెళ్లేవాడు కాదు. కాని వొక సారి ఆయన భారీ ఆడ పందిని కొట్టి కళేబరాన్ని వాలోషిన్ ఆగాకి యిచ్చేడు. అతను ఆ మాంసం తంపట వేసి వూళ్లో అమ్మేడు. ఆ వచ్చిందాంటో సగం డబ్బుని జేబురుమాల్లో మూటకట్టి తెచ్చి నాన్నకి యిచ్చేడు. నాన్న దాన్ని తీసుకోనన్నాడు. వాలోషిన్ ఆగా దాన్ని పొయ్యి తినెమీద పెట్టి వెళ్లిపోయేడు. వాలోషిన్ ఆగా అందులో యింకో కళేబరం కోసం కూడా సొమ్మని వుంచినా యెవళ్లూ దాన్ని ముట్టుకోలేదు.

పన్నులు వసూలు చేసేవాళ్లు మా యింటికి వచ్చే దాకా ఆ డబ్బు అలానే వుండిపోయింది. నాన్న ఆ మూట చూపించి యెంత కావాల్సి వస్తే అంతా తీసుకొమ్మన్నాడు. తను మాత్రం వొక్క సారి కూడా దాన్ని తాకలేదు.



బస్తీ ప్రయాణం

ఓ ఆదివారం నాడు మా నాన్న నన్ను సూర్యోదయానికి ముందే లేపాడు. ఆకుపచ్చ టీ తాగేక గాడిద యెక్కి బస్తీకి బయల్దేరాం.

శీతాకాలం. వేడిగా వుండే తుర్క్మేనియాలో ఉష్ణోగ్రత ఆశ్చర్యకరంగా పడిపోవచ్చు. గాలి విసురుతూ వుంటే మంచు సూదుల్లా గుచ్చుకుంటూ కురుస్తుంది.

మా నాన్న వెనకాల కూచున్నా నా చెవులూ చేతులూ చలికి నొప్పి పెడుతున్నాయి. చెవులకి టోపీ అంచులు కప్పేను. కాని నాకు గ్లవ్స్ లేకపోయేయి. ఓ చేత్తో పడిపోకుండా పట్టుకుని రెండో చేతిని ఛాతీమీద పెట్టుకున్నాను.

ఆఖరికి షోర్‌మైదాన్ ఉప్పుకయ్యల దగ్గరికి చేరాం.

''నాన్నా, నాకు బజార్లో గ్లవ్స్ కొనిపెట్టు'' అని అడిగేశాను.

''అలాగే. నీకు అంత చలిగా వుంటే ఆగి చలి మంట వేసుకుందాం'' అన్నాడాయన.

నాకు బస్తీ చూడాలని మహా ఆత్రుతగా వుంది. అందుకని

''అబ్బే, అసలు చలే లేదు'' అన్నాను.

నాలుగు దిక్కులా వెలుతురు పరుచుకుంటోంది. గాలిలో మంచు తరకలు సుళ్లు తిరుగుతున్నాయి.

''సగం దూరం వచ్చేం. నాకు మంచు జాడ చాలా సేపటి కితమే తెలిసింది. మంచు పెద్దగా పడితే బజారు మూసేస్తారు'' అన్నాడు నాన్న.

యెదురుకుండా కూచి కొండ కనిపిస్తోంది.

''అది అన్నాకులి తెపె కోట'' అని నాన్న వివరించేడు.

మళ్లీ యేం మాట్లాడకుండా యెదరకి వెళ్లేం.

పచ్చిక బీడు దాటి వెడుతూ వుండగా నేను వోపిక బట్టి మెదలకుండా వున్నాను. కాని కెర్కి అనే బస్తీ చేరే వేళకి నా బుర్రలో వొకటే ప్రశ్నలు పుట్టుకొచ్చేయి, చెట్టుమీద పిట్టలు లేచినట్టుగా.

బస్తీలో ప్రతి యింటికీ వో కొట్టు గది వుంటుంది, బస్తీ వాళ్లు కిటికీల పక్కన చేరి హల్వా, బన్ రొట్టె తింటూ వుంటారు అని నేను అనుకున్నాను.

''నాన్నా, బస్తీ వీధుల్లో గాడిదమీద వెళ్లనిస్తారా?'' అని అడిగేను.

''ఆఁ'' అని నాన్న అన్నాడు.

నిజమే. కెర్కి చేరాక చూస్తే రెండు చక్రాల బళ్లు, గాడిదలు వీధిలో కనిపించేయి. అక్కడి యిళ్లు మా వూళ్లో యిళ్ల మాదిరీ వొకో అంతస్తు యిళ్లే.

మేం పొడుగు చెవుల గాడిదమీద బస్తీ యీ మూలనుంచి ఆ మూలదాకా వెళ్లేం. అక్కడ మా నాన్న మిత్రుడు వేటగాడు జోరాబే వున్నాడు.

జోరాబే కొత్త యింటికి సిమెంట్ కాంక్రీట్ పోయిస్తూ తీరికలేకుండా వున్నాడు.

''హుమ్! దీనికీ మట్టి బెండడికీ పోలిక యేమిటి!'' అని నాన్న గడ్డ కట్టిన కాంక్రీట్‌ని కాలితో నొక్కుతూ

అన్నాడు. ''మన బతుకులు బాగు పడుతున్నాయి. యేమన్నా చెయ్యగల శక్తి మనకి వచ్చింది'' అన్నాడు.

తర్వాత మేం బజారుకి వెళ్లాం. నాన్న కొంచెం తుపాకీ మందునీ, సీసాన్నీ కొన్నాడు. నాకు వో జత గ్లవ్స్‌నీ, రబ్బరు బంతినీ, కొత్త పుస్తకాన్నీ కొన్నాడు. అప్పుడు కాసేపు యీ దుకాణం ఆ దుకాణం తిరిగి కొద్దిగా పంచదార బిళ్లలనీ అల్లం రొట్టెనీ కొనుక్కుని యింటికి బయల్దేరాం.

నేను చూసిన మొదటి బస్తీ కెర్కి.

యుద్ధం

ఆ తర్వాత జరిగిన సంఘటనలు నా స్మృతిలో ఆవులించుకునే అంధకార బిలంలాగా మసక మసగ్గా వున్నాయి. యేమంటే తర్వాత యుద్ధం వచ్చింది.

మొదటి రోజు నాకు యింకా స్పష్టంగా గుర్తు వుంది.

పొలానికి నీళ్లు పెడదామని పొద్దున్నే పంటకాలవ దగ్గరికి వెళ్లేను. పట్టు పురుగుల కోసం కాసిని మల్బరీ కొమ్మలు కోశేను. మా వూళ్లో పట్టు పురుగుల్ని పెంచేవాళ్లు.

నేను తలమీద మోపు పెట్టుకుని వస్తూ వుంటే దారిలో నాకు యాజ్లి తగిలేడు.

''కయూమ్! యుద్ధం!'' అని అతను అరిచేడు.

''మంచిదే, మన రెడ్ ఆర్మీ వాళ్లకి పతకాలు వస్తాయి'' అన్నాను.

యాజ్లి నేలమీద తన్నేడు.

''చవట! యిప్పుడు అందరికీ అన్నీ గడ్డుగా తయారవుతాయి. ఏడేళ్లవాళ్లనుంచి డెబ్బై ఏళ్ల వాళ్లదాకా అందర్నీ సైన్యంలోకి పిలుస్తారు.''

''యెవరన్నారు?''

''ముల్లా ఆగా. యింటికెళ్లు నీకే తెలుస్తుంది.''

యాజ్లి యెందుకంత కళవిళ పడ్డాడో నాకు తెలీలేదు. మేం ''యుద్ధం'' ఆట దాదాపు ప్రతిరోజూ ఆడేం. అన్ని ఆటల్లోకీ బాగా సరదాగా వుండే ఆట అదే.

నేను యింటికి చేరే వేళకి యాజ్లి వాళ్ల మామ, యింకా కొంతమంది జనం అక్కడ పోగయేరు. అందరూ యేడుస్తూనే వున్నారు.

నాన్నని చూడ్డానికి ముల్లా వచ్చేడు.

''జర్మన్లు చాలా దురాక్రమణదార్లు. యిప్పటికే పది దేశాలకి పైగా జయించేరు. వొక్క దేశం కూడా వాళ్లకి యెదురు నిలవ లేకపోయింది'' అని చెప్పేడు.

నాన్న గొంతుక పెంచకుండానే అన్నాడు:

''ముల్లా ఆగా, జర్మన్లు చాలా దేశాల్ని జయించి వుండచ్చు గాని మన దేశాన్ని జయించరు.''

''ఆ సంగతి యేం చెప్పగలంలే నాయనా'' అని చేతులు మెలి తిప్పుకుంటూ ముల్లా అన్నాడు. ''జర్మన్ సైన్యం పీటీలో వాళ్లు వోడించిన వాళ్లందర్నీ పెట్టారు. తుఫాన్ మేఘంలో నీటి బొట్లు యెన్ని వుంటాయో అంత మంది సైనికులు వాళ్ల దండులో వున్నారు'' అన్నాడు.

''అయినా మనకంటే యెక్కువ కాదు'' అన్నాడు నాన్న.

నాన్ననీ, మా కుటుంబాన్నీ దుమ్మెత్తి పోస్తూ ముల్లా వెళ్లిపోయేడు. కాని నా బాల్యాన్ని హరించింది ఆయన శాపనార్థాలు కావు, యుద్ధం.




బుజ్జి మేక



చిరిగిన బస్తా

వాళ్ల తాత రాఖిమ్ ఆగా చెట్టుమీద పండిన ఆప్రికాట్ పళ్లని కోస్తూ వుంటే అర్సలాన్ చూస్తూ వున్నాడు. రాఖిమ్ తాత యెత్తరిగా లావుగా వుంటాడు. పళ్లు బుల్లి బుల్లివి. అర్సలాన్ చీమల్ని కూడా చూస్తూ వున్నాడు. వో చీమ యెండిన పెద్ద గరిక పోచని వీపుమీద మోస్తూ వుంటే చూసి ఆశ్చర్యపోయేడు.

''తాతా! తాతా!'' అని అర్సలాన్ పిలిచేడు.

రాఖిమ్ తాత మనవడి దగ్గరికి వచ్చేడు.

''చూడు'' అని ఆ కుర్రాడు తాతకి వో చీమని చూపిస్తూ అన్నాడు. ''అంత పెద్ద గరికపోచని యెక్కడికి మోసుకు పోతోంది?'' అని అడిగేడు.

రాఖిమ్ ఆగా మనవడి తలమీద చేతిని పెట్టి చిన్నగా నవ్వేడు.

''ఓరి బుల్లి భడవా! భూమ్మీద బాగా కష్టపడి పని చేసేవి చీమలే అనే విషయాన్ని నువ్వు తెలుసుకోవాలి. ఆ గడ్డి పోచ దాని పుట్టకో లేకపోతే మేతకో ఉపయోగ పడుతుంది. శీతకట్టు వచ్చేక, నేలంతా మంచు కమ్మినప్పుడు చీమకి బెంగ వుండదు. లోపల దానికి వెచ్చగా వుంటుంది, తిండీ గిండీ హాయిగా వుంటాయి'' అన్నాడు.

''అయితే నేనూ కష్టపడి పని చేస్తా, మనకి శీతాకాలానికి బోలెడు వంట చెరకు వుంటుంది, తిండీ వుంటుంది'' అన్నాడు అర్సలాన్.

''భేష్‌రా నాయనా! మంచి వూహ'' అని రాఖిమ్ ఆగా మనవణ్ని పొగుడుతూ అన్నాడు. ''యిదిగో బాల్చీ, కింద పడ్డ ఆప్రికాట్‌లని యేరు'' అన్నాడు.

తాతా, మనవడూ కలిసి యేరడం మొదలుపెట్టేరు.

రాఖిమ్ ఆగా అర్సలాన్ బాల్చీ చూసి ఫరవాలేదన్నట్టు మెచ్చుకుంటూ అన్నాడు:

''బాగానే పోగు చేశావురోయ్! బాల్చీకీ బాల్చీడూ పోగు చేశావు. యివాళ్టికి చాల్లే, వెళ్లి చేతులు కడుక్కుని రా. మనం ఐగూల్ అత్తని చూద్దాం.''

''ఆమె యెక్కడ వుంటోంది?''

''వూళ్లో.''

''ఆ వూరు యెక్కడ వుంది?''

''అక్కడికి వెళ్లాక నువ్వే చూద్దువు గాని.''

''అక్కడికి యెలా వెడతాం?''

''మోటారు సైకిలుమీద.''

''యెర్రదా?''

''అవును.''

''యెవరు నడుపుతారు?''

''నేనే.''

''నేను పక్కన కూర్చుంటానా?''

''వూఁ.''

తాత మనవణ్ణి పక్క సీట్లో కూర్చో బెట్టాడు. ఆప్రికాట్ బాల్చీ కాళ్ల దగ్గర పెట్టుకున్నాడు. మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు. అర్సలాన్ బుర్రలో ప్రశ్నలు వూరిపోయేయి.

మెంగ్లి మామ్మ యింట్లోనుంచి వచ్చి వాళ్లకి వీడ్కోలు చెప్పింది. రాఖిమ్ ఆగా మోటారు ఆపు చేసి ఆమె మనవణ్ణి జాగ్రత్తగా తీసికెళ్లమని చెప్పిన మాట విన్నాడు. అర్సలాన్ తల్లీ తండ్రీ యిద్దరూ కాలేజీలో వున్నారు. మామ్మ మనవడితోనూ, మొగుడితోనూ కరాకండీగా వుంటుంది.

జవాబు లేని ప్రశ్నలు

పనివాళ్లు వన మూలికలు యేరే పొలాలు దాటుకుంటూ వెళ్లింది మోటారు సైకిలు.

వో ట్రాక్టరు పొలం దున్నుతోంది. కాని పత్తికీ, గోధుమకీ వాడేలాంటి నాగలి కాదు అది. అది ప్రత్యేకమైన నాగలి. ఒక ఆరు మాత్రమే వుంది. నేలలోకంటా దిగి దున్నుతోంది. వన మూలికని తవ్వుతోంది.

పనివాళ్లు వాటిని యేరుతున్నారు. శుభ్రం చేస్తున్నారు. పోగు పెడుతున్నారు.

''వేళ్లని మూలికల్ని దేనికి వాడతారు?'' అని మనవడు తాతని అడిగేడు.

''వాటిని మనిషి లాభం కోసం వాడతారు. వాటితో అనేక రకాల మందులు తయారు చేస్తారు. దాంతో బీరు కూడా చేస్తారు. తీపి బిళ్లలు చేస్తారు. నువ్వు దగ్గు వచ్చినప్పుడు అరకు తీసుకోలేదూ?''

''అవును. భలే రుచిగా వుంటుంది.''

''యీ మూలికలతో చెయ్యడం వల్లనే అది రుచిగా వుంటుంది.''

''మన యీ మూలికలే?''

''ఆఁ.''

''నాకు తెలీదే యీ సంగతి'' అని అర్సలాన్ ఆశ్చర్యంగా అన్నాడు.

మోటారు సైకిలు దట్టమైన గుబురులోకి తిరిగింది. సైకిలుమీద ప్రయాణం మళ్లీ సాఫీ రోడ్డు వచ్చేదాకా గతుకులతో కుదుపుతూనే వుంది.

''తాతా! తాతా!'' అని అర్సలాన్ అరిచేడు.

''యేమిరా?'' అంటూ తాత వేగం తగ్గించేడు.

''ఆ కొండమీదకి వెడదాం.''

రాఖిమ్ ఆగా దూరంలో నీలంగా కనిపించే కొండ శిఖరాలకేసి చూశేడు.

''వద్దురా, మనం యెక్కలేం అది చాలా యెత్తుగా వుంది. నిట్రగా వుంది.''

''ఆ కొండమీద నల్లని మచ్చలేమిటి?''

''అవి జునిపర్ అడవులు.''

''యెవరు నాటేరు?''

''ప్రకృతి మాత.''

''అయితే ప్రకృతి మాత అక్కడికి యెలా యెక్కింది?''

రాఖిమ్ ఆగా ఆశ్చర్యపోయి మనవడికేసి చూసి పకపకా నవ్వేడు. అప్పుడు మోటారు సైకిలు వేగం పెంచేడు. అది చాలా వేగంగా దూసుకుపోయింది. ఆ వేగానికి రోడ్డు వార పొదలు ఆకుపచ్చ మసకలా అయిపోయేయి.

మంచి నేస్తం

రాఖీమ్ ఆగా వూళ్లో యేకంగా రెండ్రోజులు వుండిపోయేడు. అర్సలాన్ ఆ రెండ్రోజులూ పశువులకొట్టం దగ్గరే గడిపేడు. పశువులన్నిట్నీ వేసవికాలం అవడంతో కొండల పచ్చిక బీళ్లమీదకీ, స్టెప్ పచ్చిక మైదానంమీదకీ తోలేరు. కాని యీనిన వో మేకనీ దాని పిల్లనీ దిగవిడిచేరు. మేక పిల్ల బూడిద రంగులో వుంది. దాని నుదుటిమీద తెల్ల నక్షత్రం వుంది.

దాన్ని చూసి అర్సలాన్ తిన్నగా దగ్గరికి వెళ్లేడు. వో పిడికెడు గడ్డి పీకి కొట్టం కమ్మీల గుండా లోపలికి పెట్టేడు.

''మే... మే.. మే'' అని పిలిచేడు.

యీ కుర్రాడంటే దానికీ వెంటనే యిష్టం పుట్టినట్టే వుంది. అది అటూ యిటూ చెంగున గెంతింది. గట్టిగా సుడి తిరిగింది. అర్సలాన్ వున్న చోటికి వచ్చి తక్కున ఆగింది. ముట్టె చాచి గడ్డి అందుకుని పరిగెత్తి వెళ్లిపోయింది.

మిగిలిన పిల్లలు అర్సలాన్‌ని ఆటలకి రమ్మని పిలిచేరు. కాని అర్సలాన్‌కి మేక పిల్లని వదలడం యిష్టం లేక పోయింది.

రాఖీమ్ ఆగా యింటికి తిరిగి ప్రయాణం కట్టేటప్పటికి అర్సలాన్ కొట్టం దగ్గర వున్నాడు. తన కొత్త నేస్తానికి చురెక్ ముక్కలు తుంపి పెడుతున్నాడు.

''బాబూ! వెళ్లే వేళ అయింది'' అని మనవణ్ణి పిలిచేడు.

''తాతా, మేక పిల్లని కూడా తీసుకుపోదామా. మోటార్ సైకిల్ గట్టిగానే వుంది, దాన్నీ మొయ్యగలదు'' అన్నాడు అర్సలాన్.

''గట్టిగా వున్న ముక్క నిజమే కాని అది యింకా బుజ్జి పిల్ల, తల్లి పాలు తాగుతోంది. అది కొంచెం పెద్దయాక తీసికెడదాం'' అని రాఖీమ్ ఆగా అన్నాడు.

''వూహుఁ! తాతా! నే వదల్ను నా నేస్తాన్ని. నువ్వొక్కడివీ వెళ్లిపో'' అని అర్సలాన్ మంకుగా అన్నాడు.

రాఖీమ్ ఆగా మనవడికేసి ఆశ్చర్యంగా చూశేడు.

''నే వొక్ఖణ్ణీ నువ్వు లేకుండా వెనక్కి వెడితే మీ మామ్మ నన్ను గడప తొక్క నివ్వదు'' అన్నాడు.

సరిగ్గా అప్పుడు ఐగూల్ అత్త అక్కడికి వచ్చింది.

''సరే అయితే అల్లుడోడా, నీకు మేక పిల్లనీ దానికో గంటనీ కట్టి యిస్తాలే, యీమారు వచ్చినప్పుడు మీ యింటికి తీసుకు వెడుదువులే'' అంది.

''ఐగూల్ అత్తా!'' అని చేతులు చాపుతూ అర్సలాన్ అరిచేడు. ''నీకు అర్థం కావడంలా. నా మంచి నేస్తాన్ని వదిలేసి నే వెళ్లలేను.''

''ఐగూల్! కుర్రాడన్నది నిజమే! పోనీ తల్లి మేకనీ పిల్ల మేకనీ మమ్మల్ని తీసికెళ్లనియ్యి. తర్వాత మళ్లీ పెద్ద మేకని వెనక్కి తీసుకు వస్తాంలే'' అన్నాడు రాఖీమ్ ఆగా.

''అవును తాతా! అది బాగుంటుంది'' అని అర్సలాన్ చప్పట్లు చరుస్తూ అరిచేడు. ''మా గురించి బెంగ పడకు


ఐగూల్ అత్తా. మోటార్ సైకిల్ గట్టిగా వుంది. వాటినీ, మమ్మల్నీ కూడా తీసుకు వెడుతుంది'' అన్నాడు.

''సరే మీ యిష్టం'' అంది ఐగూల్ అత్త చిన్నగా నవ్వుతూ. ''కాని పిల్ల తల్లి దగ్గర పాలు తాగేటంత కాలం తల్లి మేకకి పచ్చి గడ్డి పెడుతూ వుండండి, యెక్కువ పాలు పడతాయి. యేం మరి అలా చెయ్యగలరా?'' అంది.

''ఆఁ'' అన్నాడు అర్సలాన్. వొత్తి చెప్పడాని కన్నట్టు యెగిరి గెంతేడు కూడా. ''మాకు బోలెడు గడ్డి వుంది. నాకంటే యెత్తుగా వుండే గడ్డి. ఆ గడ్డిలో నే తప్పిపోతాను కూడా అంత యెత్తు గడ్డి'' అన్నాడు.

ఐగూల్ అత్త లోపలికి వెళ్లి చిన్న గంట తీసుకు వచ్చింది. దాన్ని ఎర్ర రిబ్బనుకి కట్టేరు. ఆ రిబ్బన్‌ని మేక పిల్ల మెడ చుట్టూ కట్టింది.

మేక పిల్ల ఆ జాగాలో చెంగు చెంగున గెంతుతూ వుంటే చిన్న గంట భలే మోగింది. రాతిమీదనుంచి రాతి మీదకి దూకుతూ పారే కొండ సెలయేరు గలగల మన్నట్టు మోగింది ఆ గంట.



ఎగిరే పాము

మేక పిల్ల కిందికి అందుతూ వున్న చెట్టు కొమ్మల ఆకులు కొరుకుతూ వుంది. తల్లి దగ్గర్లోనే పచ్చిక మేస్తోంది. తన పిల్లమీద వో కన్నేసి చూస్తూ వుంది. మరో కన్ను పిల్లాడిమీద వేసి వుంచింది.

తల్లి మేకకి తృప్తిగా వుంది. తన పిల్ల మేకా, ఆ పిల్లాడూ యిద్దరూ బుద్ధిగానే వున్నారు. ముఖ్యమైన పనుల్లో వున్నారు. మేక పిల్ల కొమ్మల చిగుళ్లు కొరకడం నేర్చుకుంటోంది, కుర్రాడు యేదో పిచిక గూళ్లు కడుతున్నాడు.

తను తల్లి మేకని, పిల్ల మేకని మేపుతున్నానని అర్సలాన్ అనుకున్నాడు. కాని నిజానికి అతను చీమలకి దారి యేర్పాటు చేస్తున్నాడు.

చీమలు ఖామూలుగా వెళ్లే దారి గడ్డిలో యెక్కడి నుంచో వస్తోంది. ఆ చోటు యేదో తెలీలేదు. ఆ దారి అలా తెలియకుండా మరో చోటుకి పోతోంది. చుట్టు తిరిగిపోతోంది. చీమలు యెక్కడినుంచి దూసుకు వస్తున్నాయో పోతున్నాయో అర్సలాన్‌కి అంతు చిక్కలేదు. వాటంగా వున్న చోటునుంచి వాటిని చూశేడు. చీమలు అనవసరంగా చుట్టు తిరిగి పోతున్నాయనీ, యెంతో బరువు మోస్తూ వున్నాయనీ అనిపించింది. అర్సలాన్ వొక చీమని యెత్తి తను

యేర్పాటు చేసిన నిటారు దారిమీద పెట్టాడు. కాని ఆ చీమ అర్సలాన్‌ని గురించి పట్టించుకోలేదు. అది తన మొదటి దారి పట్టుకునే దాకా తిరిగింది. రెండో చీమా అంతే చేసింది, మూడో చీమా అంతే చేసింది.

అప్పుడు అర్సలాన్ చీమల దారిలో మధ్యన వో కన్నం చేశాడు. దాంతో అవి చుట్టు తిరిగి పోవాల్సిందే. అప్పుడు నిటారు దారిమీదకి రావాల్సిందే. కాని అబ్బే! అలా చెయ్యందే! చీమలు కన్నంలోకి దిగి మళ్లీ యాతన పడి పైకి యెక్కి తమ దారిలోనే ఆ బరువులు మోసుకుంటూ వెళ్లాయి!



''హేయ్! మీరు!'' అని అర్సలాన్ చీమల్ని చూసి అన్నాడు.

కన్నానికి అడ్డంగా వో పుల్ల ముక్కని పెట్టాడు. ఆ వంతెన చూసి చీమలు సంతోష పడినట్టే కనిపించేయి. తమ పనిని మహా తీవ్రంగా సాగించేయి.

అర్సలాన్ చీమల్ని వాటి మానాన వదిలేసి పని చేసుకోవడానికి దిగేడు. శీతకట్టుకి మేత సిద్ధం చేసుకునే వేళ అయిందని మెంగ్లి మామ్మ అంది. మేకల్ని మేపడానికి తోలుకెళ్లి నప్పుడల్లా అర్సలాన్ చిన్న సంచీని కూడా తీసుకెళ్లేవాడు. కింద పడ్డ మల్‌బరీ ఆకుల్నీ, రెమ్మల్నీ యేరి అందులో వెయ్యడం మొదలెట్టేడు.

హఠాత్తుగా గడ్డిలోనుంచి వో పాము బుస్ మంది. అది రెక్కల్ని వొక్క సారి కొట్టుకుని మళ్లీ నేలమీద వాలింది.

అర్సలాన్ సంచీ కింద పడేశాడు. కాని యెక్కడి వాడక్కడే వుండిపోయేడు. యేమిటిది, తన భ్రమ? రెక్కల్ని కొట్టుకుంటూ పాము మళ్లీ నేలమీదనుంచి యెగిరి, కిందికి వాలింది.

అర్సలాన్ మెరుపులాగా దూసుకు పోయేడు.

''తాతా!'' అని యింటికి పోతూ అరిచేడు. ''అక్కడ! మల్‌బర్రీ చెట్టు పక్క'' అన్నాడు.

''యేమిటి? యేముందక్కడ? తోడేలా? నక్కా?'' అని తాత కర్ర కోసం వెతుక్కుంటూ అడిగేడు.

''వుహుఁ! కాదు! యెగిరే పాము!''

''హోరి, కుర్రకుంకా! పాములకి రెక్కలుండవురా.''

''కాని నేను చూస్తే! నా కళ్లతో నేను చూశాను. అది రెక్కలు కొట్టుకుంది.''

తాత కర్ర పక్కన పెట్టి ఆలోచనలో పడ్డాడు.

''లేదురా. అది యెగిరే పాము కాదు. యే పాముకేనా యెర అయిన పిట్ట యేదో అయివుండాలి. అలాంటిది నేనే చాలా సార్లు చూశాను.''

''అయ్యో! పాపం! పిట్ట!'' అన్నాడు అర్సలాన్.

''అవును, చాలా బాధగా వుంటుంది'' అని రాఖిమ్ ఆగా మనవడు అన్న మాటని వొప్పుకున్నాడు.

యిద్దరూ అక్కడే మాట్లాడకుండా వుండిపోయేరు. మరి ఆలస్యం అయిపోయింది, ఆ పిట్టని రక్షించడం కష్టం.

తాబేలు

అర్సలాన్ మేక పిల్లని పచ్చిక మెయ్యడానికి తోలుకు వెళ్లేవాడు. అలా తోలుకు వెళ్లడం అతనికి యిష్టంగానే వుండేది. వన మూలికల్ని యేరే పని వాళ్ల శిబిరంలో చాలా మంది కుర్ర గొర్రెల కాపర్లు వుండేవాళ్లు. ఆ పిల్లలకి మేక పిల్లలంటే, గొర్రెలంటే ఆవు దూడలంటే యిష్టంగా వుండేది. గుబురుల్లో బాగా పసిరికగా వుండే బీళ్ల మీదకి వాటిని తోలుకుని వెళ్లేవాళ్లు.

ఆ రోజున వాళ్లు అమూదార్య నది వొడ్డున వాటిని మేపుతున్నారు.

అర్సలాన్ మేక పిల్ల సరదాకి సపార్ వాళ్ల మేక పిల్లని కుమ్మి నది వొడ్డునే చెంగు చెంగున గెంతుతూ వెళ్లింది. నది వొడ్డు అన్ని చోట్లా వొక్కలాగే వుంటుందని నమ్మకోవడానికి లేదు. యేమంటే అమూదార్య వరదలకి పొంగిన ప్పుడు గట్టు కోసేస్తూ వుంటుంది. మేక పిల్లని వొడ్డు చివరకంటా వెళ్లకుండా తరుముదామని అర్సలాన్ పరిగెత్తేడు. ఆ పరిగెత్తడంలో వో రాతిమీద తొట్రుటు పడి కింద పడ్డాడు.

వాడు రాతికేసి చూసి ఆశ్చర్యంతో వెనక్కి తగ్గేడు. దానికి తల, కాళ్లు వున్నాయి.

''యేం భయం లేదులే!'' అని సపార్ అరిచేడు. ''అది తాబేలు. యేం చెయ్యదు. యింటికి తీసుకు వెళ్లి పెరట్లో పెట్టుకో'' అన్నాడు.

''కాసేపు మా మేక పిల్లను చూస్తూ వుండేం, సపార్, నేనింటికి వెళ్లి దీన్ని మా తాతకి చూపించి వస్తా'' అన్నాడు అర్సలాన్.

రాఖిమ్ ఆగా ఆకుపచ్చ టీ తాగుతూ ద్రాక్ష గుబురు నీడలో కూర్చున్నాడు.

''యేమిట్రోయ్, నిజమైన పతకం తెచ్చేవ్.''

''తాతా, యిది తాబేలు.''

''అది తాబేలు అని తెలుస్తూనే వుందిలే.''

''యిది ముసల్దా తాతా?''

''కాదు రా, కుర్రది. తాబేళ్లు వందేళ్లు బతుకుతాయి. యీ సారి నీకు తాబేలు గుడ్డు చూపిస్తాలే.''

''యేమిటీ? తాబేళ్లు కోళ్లలాంటివా?'' అని అర్సలాన్ అడిగేడు.

''కాదు, కాని అవి కూడా గుడ్లు పెడతాయి.''

''యెలా వుంటాయి అవి?''

''వాటిలో చాలా రకాలు వున్నాయి. కొన్ని కోడి పెట్ట గుడ్లలాంటివి. వో పిసరు చిన్నగా వుంటాయి. నీ అరి చేతిలో పట్టుకోవచ్చు. కొన్ని పట్టు పురుగు గూడులా వుంటాయి.''

''అబ్బ! తాతయ్యా! నాకు బుల్లి తాబేలు కావాలి'' అని అర్సలాన్ గారం పోయేడు.

''అది కష్టంరా నాయనా'' అన్నాడు రాఖిమ్ ఆగా. ''పొదగగానే తాబేలు పిల్లలు యిసికలో కప్పడిపోయి వసంత కాలందాకా వుండిపోతాయి. సెప్టెంబరులో పొదుగుతాయి. యిసిక కింద ఆకురాలు కాలం, శీతాకాలం వుంటాయి. వెచ్చటి వసంతం వచ్చేదాకా వుంటాయి'' అన్నాడు.



''నే వెళ్లి వెతికి బుల్లి తాబేలుని పట్టుకొస్తా'' అని అర్సలాన్ కోపంగా నేలమీద కాలితో తన్నుతూ అన్నాడు.

తాత తల వూపేడు లాభం లేదని.

''తాబేలు గుడ్డు వెతకడం అంత తేలిక కాదురా, నాయనా. ఆడతాబేలు వాటిని యిసికలో కప్పెట్టి చిత్రమైన కంచెతో మూసేస్తుంది. మనిషి గాని, జంతువు గాని ఆ కంచెని చీల్చుకుపోవడం కష్టం. అయినా దారి లేకపోలేదు. కాని దానికి తాబేలు నాలిక కింద పెట్టుకునే ప్రత్యేకమైన బద్ద కావాలి.''

''కాని గుడ్డుని యెలా కనిపెట్టడం? యేదీ నీ నాలిక చూపించు నీకూ బద్ద వుందా?'' అని అర్సలాన్ అడిగేడు.

రాఖిమ్ ఆగా పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వేడు. ''భలే వాడివిరా కుర్రకుంకా! నాకేం మహిమలున్న చెక్క బద్దలు లేవు. కాని నేను పెద్దవాణ్ణి. జనం నా బోటి వాళ్లని గౌరవంగా నమ్మకంగా చూస్తారు'' అన్నాడు.

''యెందుకు?''

''యెందుకంటే, యుగయుగాలుగా అలా జరుగుతోంది మరి. నాకు తెలీదు యెందుకో.''

''నాకు తెలుసు!'' అని అర్సలాన్ చప్పట్లు చరుస్తూ అరిచేడు. ''జనం పెద్దవాళ్లని యెందుకు గౌరవించి మన్నిస్తారో పెద్దవాళ్లు తెలివైన వాళ్లు కాబట్టి'' అన్నాడు.

''అదిరా! నీకు బుర్ర వుంది రోయ్'' అని రాఖిమ్ ఆగా మనవణ్ణి చూసి పొంగిపోయేడు.

వంట చెరకు

అర్సలాన్ ఆయాస పడుతూ, వగురుస్తూ గుమ్మంలో నుంచున్నాడు. ''తాతా, నేను మిగతా వాళ్లతో కలిసి కట్టెలు యేరుకురానా?'' అని అడిగేడు.

రాఖిమ్ ఆగా మనవణ్ణి యెగాదిగా చూశేడు.

''నువ్వు మాకు సాయం చేసే వాడివై పోయావు! నిన్ననే మీ మామ్మ చురెక్ కాల్చడానికి కట్టెలై పోయాయని అంటోంది. యేమీ మిగల్లేదట. నువ్వు మంచి వాడివిరా అర్సలాన్. యింటి పనికి సాయ పడుతున్నావు బాగుంది. వెళ్లి కట్టెలు యేరుకురా. జాగ్రత్తుస్మా! మిగిలిన వాళ్లకంటే వెనక బడేవు. కొంచెం రొట్టె కూడా తీసుకు వెళ్లు. బయటికి పనిమీద వెళ్లినప్పుడు కొంచెం చేపట్టున వుంచుకోవడం మంచిది.''

''వెళ్లివస్తా, తాతా'' అని అర్సలాన్ కొంచెం రొట్టె, వో తాడూ తీసుకుని మిగిలిన వాళ్లని అందుకునేందుకు పరిగెత్తి వెళ్లేడు. పక్కనే మేక పిల్ల కూడా పరిగెత్తింది.

వాళ్లు ముందట విల్లో గుబురు దగ్గరికి వెళ్లేరు. కాని అక్కడ పోగు చేసుకో దగినన్ని కట్టెలు లేకపోయేయి.

''నది దాటి లంకమీదకి వెడదాం'' అని అందర్లోకీ పెద్ద వాడైన యాగ్ముర్ అన్నాడు. అప్పుడే యాగ్ముర్‌కి యేడేళ్లు. యీ ఆకురాలు కాలంలో బళ్లో చేరతాడు.

నీళ్లు అంత లోతు లేవు. అర్సలాన్ చీలమండలదాకా వచ్చేయంతే.

''మే... మే... మే...'' అని మేక పిల్ల అరిచింది. దాని చిరు గంట విచారంగా మోగింది. నీళ్లు చూసి అది బెదిరి పోయింది.

''రా, బుజ్జి మేకా! భయం లేదు'' అని అర్సలాన్ లంకమీదకి గెంతుతూ పిలిచేడు.

''మె... మె... మె...'' అని మేక పిల్ల మళ్లీ అరిచింది.

''దాన్ని యెత్తుకు తీసుకు రావాలిరా. తనంతట తను దాటలేదు'' అన్నాడు యాగ్ముర్.

''లేదు, దాటి వస్తుంది. నే పిలుస్తా రెండు సార్లు, దాటి వస్తుంది'' అన్నాడు అర్సలాన్.

''అంటే దానికి అంతలా నేర్పావనా?'' అని యాగ్ముర్ నమ్మలేనట్టు అడిగి

''బుజ్జి మేకా రా'' అని పిలిచేడు.

మేక పిల్ల తల తిప్పను కూడా తిప్పలేదు.

''అయిందా?'' అని యాగ్ముర్ వో నవ్వు నవ్వి అన్నాడు.

''అది అర్సలాన్ చెప్పిన మాటనే వింటుంది రా'' అన్నాడు సపార్. ''వూఁ కానీరా అర్సలాన్ దాన్ని పిలు!'' అన్నాడు.

''బుజ్జి మేకా! బుజ్జి మేకా!'' అని అర్సలాన్ పిలిచేడు. అది నీళ్లల్లోకి దూకి రెండు అంగల్లో లంకమీదకి వచ్చింది.

''బాగుందిరా అబ్బాయ్! చిత్రంగా వుంది'' అని కుర్రాళ్లు అరిచేరు. ''అర్సలాన్! జంతువులకి శిక్షణ యిచ్చేవాడా!'' అన్నారు.

ఆ లంక తీరం వారే బాగా నలిగిన దారి వుంది. కుర్రాళ్లు గుబురులు దాటుకుంటూ, పొదలు దాటుకుంటూ వెళ్లేరు. కొంచెం సేపట్లోనే వాళ్లు వెల్లడిగా వున్న మైదానంమీదకి వచ్చేరు. వసంతరుతువులో వరద నీళ్లకి అక్కడ తుప్పలు, వేళ్లు, నానా రకాల గరికలు పోగు పడతాయి.

''ఒరేయ్, వినండిరా! తుమ్మ కంప మంట పలావ్ వంటకి బాగా పని కొస్తుంది'' అని యాగ్ముర్ సంతోషంగా అన్నాడు.

''కాని పొయ్యిలో పడుతుంది రా?'' అని అర్సలాన్ అనుమానంగా అడిగేడు.

''భేషుగ్గా.''

పిల్లలు మోపుల కొద్దీ తుమ్మ కంప యేరడం మొదలుపెట్టేరు. బుజ్జి మేక తన యజమాని పక్క పక్కనే గెంతుతూ వుంది. అది ఠకామని వొక్క సారి వెనక్కి తగ్గి తల వాల్చి బుసకొట్టడం మొదలుపెట్టింది.

''పాము రోయ్!'' అని అరుస్తూ పుల్లల మోపు కింద పడేసి అర్సలాన్ అరిచేడు.

''బురద పాము లేరా! మరేం భయం లేదు, పని కానీండి'' అని యాగ్‌ముర్ నవ్వుతూ అన్నాడు.

పిల్లలు మోపులు కట్టేసుకుని తిండి తినడం కోసం చుట్టూతా గుండ్రంగా చేరి కూర్చున్నారు. ప్రతివాళ్లూ రొట్టె ముక్కనో, చురెక్‌నో తెచ్చుకున్నారు. యేమీ తెచ్చుకోని వాళ్లకి తమ దాంట్లో కొంచెం తీసి పెట్టారు.

వున్నట్టుండి వో గాడిద దారిలో కనిపించింది.

''ఒరేయ్, దాన్ని పట్టుకుని మన మూటలు దానిమీద పడేద్దాం'' అన్నాడు యాగ్‌ముర్.

వాళ్ల వెంటనే గాడిదని చుట్టు ముట్టేసేరు, అసలు పారిపోయే ఉద్దేశం దానికి అప్పటికీ లేకపోయినా.

''యెవరి గాడిదరా యిది'' అని అర్సలాన్ అడిగేడు.

''యేదో తప్పి పోయిన గాడిద అయివుంటుంది. ముందట దీని వీపుమీద కొంచెం గడ్డి వేసి ఆపైన కంప వేద్దాం'' అన్నాడు యాగ్‌ముర్.

యెవళ్లో కొంచెం పొడుగాటి తాటిని తెచ్చారు. యెండు పుల్లల్ని పెద్ద మోపు కట్టి అందరూ సాయం పట్టి గాడిద వీపుమీద వేసి దాన్ని నది వేపు తోలుకెళ్లారు.

నదిని దాటే రేవు దగ్గరికెళ్లాక రేవు యెక్కడుందో అజ పట్టలేకపోయేరు. నీరు పాడిచింది. బురదగా, మట్టిగా వుంది.

''యిప్పుడు దీన్ని దాటడం యెలారా బాబూ!'' అని భయపడుతూ అర్సలాన్ అడిగేడు.

''యీదదాం పట్టండి! యెవర్రా నాతో వచ్చేవాళ్లు?'' అని యాగ్‌ముర్ ధైర్యంగా అడిగేడు.

కుర్రాళ్లు వొకళ్లకేసి వొకళ్లు చూసుకున్నారు, వొడ్డుకి లోపలికంటా చాలా దూరం వచ్చేరు. యిప్పుడు ఆ యేరు ముప్పై మీటర్లు వెడల్పు వుంటుంది.

''నువ్వు యీది వెళ్లు'' అని సపార్ యాగ్‌ముర్‌తో అన్నాడు. ''నువ్వెళ్లి పెద్దాళ్లని తీసుకొచ్చే దాకా మేం యిక్కడ వుంటాం'' అన్నాడు.

''నే వొక్కణ్ణే యీది వెళ్లాలంటే భయంగా వుంది రా. వడి యెక్కువగా వుంది'' అని యాగ్‌ముర్ తేలి పోయేడు.

''అయితే యిప్పుడేం చేద్దాం రా?'' అని అర్సలాన్ బుజ్జి మేకని వాటేసుకుని అన్నాడు.

అందరూ పొద్దు యెంతైందోనని ఆకాశంకేసి చూశేరు. సూర్యుడు పడమటికి వాలుతున్నాడు. మరొక్క మాట కూడా అనుకోకుండా వాళ్లు గొంతుకలు పడిపోయేటట్టు అరవడం మొదలుపెట్టారు. యెవళ్లేనా తమ గోడు వినక పోతారా అనుకున్నారు.

కాని జవాబు రాలేదు.

''యిక యీ రాత్రి లంకలో గడపాల్సినట్టే వుంది రా'' అని సపార్ గొణిగేడు.

''మళ్లీ అరిచి చూద్దాం. ఒరేయ్, అందరూ వొక్క సారే అరవండిరా'' అని యాగ్‌ముర్ అన్నాడు.

పిల్లలు అందరూ కలిసి, విడివిడిగానూ, తండ్రుల్ని, అన్నల్ని, అమ్మల్ని పిలుస్తూ అరిచేరు...

ఆఖరికి లంక లోపలినుంచి వొకాయన పారతో వచ్చేడు. అతను బేరామ్ ఆగా.

''యిక్కడేం చేస్తున్నార్రా!'' అని అతను పిల్లల్ని అడిగేడు.

''కట్టెల కోసం వచ్చేం'' అని యాగ్‌ముర్ అందరి తరఫునా అన్నాడు.

''మీకు సరిపడా కట్టెలు అవతలి వేపున లేవట్రా?'' అని బేరామ్ ఆగా కోపంగా అరిచేడు. అతను ఒకొక్కళ్ల తర్వాత ఒకొక్కళ్లని రేవు దాటించేడు. భుజాలమీద వాళ్లనీ, వాళ్ల మోపుల్నీ మహాకాయుడిలాగా యెక్కించుకుని తీసుకెళ్లేడు. అర్సలాన్ ఒంతు వచ్చేటప్పటికి వాణ్ణి, వాడి మోపుని, మేక పిల్లనీ కూడా మోసుకు వెళ్లేడు.



తర్వాత బేరామ్ ఆగా గాడిద వీపుమీదనుంచి కంపని దింపి దాన్ని రేవు ఆవలికి చేరేసేడు. మళ్లీ గాడిదని లంక లోపలికంటా తోలుకుపోయేడు.

నక్క వేట

ఆ మర్నాడు అర్సలాన్ బుజ్జి మేకని తీసుకుని యాగ్‌ముర్ దగ్గరికి వెళ్లేడు. బయటనుంచే పిలిచేడు.

''యాగ్‌ముర్! యిటు రా!'' అన్నాడు.

యాగ్‌ముర్ యింట్లోనుంచి యివతలికి వచ్చేడు.

''చూశావా?'' అని తన ఛాతీకేసి చూపించేడు. వాడి మెడలో పెద్ద బైనాక్యులర్స్ వేలాడుతున్నాయి.

''మా తాత యిచ్చేడు, జంతువుల్ని బాగా చూడవచ్చుని. వస్తావా?''

''యెక్కడికి?''

''నది దగ్గరికి పోదాం, అక్కడ యెవళ్లూ వుండరు.''

''అమ్మా! నేను కట్టెల కోసం వెడుతున్నా'' అని యాగ్‌ముర్ యింట్లోకి చూస్తూ అరిచేడు.

యాగ్‌ముర్, అర్సలాన్ బుజ్జి మేకని తీసుకుని విల్లో పొదల వేపు వెళ్లేరు. అక్కడికి వెళ్లేక వాళ్లు యెవళ్లూ తమని చూడని చోటు చూసుకుని పొదల్లో అక్కడికి చేరేరు. బుజ్జి మేక మేత మెయ్యడానికి పోయింది.

బైనాక్యులర్స్‌లోనుంచి మొదట యాగ్‌ముర్ చూశేడు. కొన్ని బాతులు కనిపించేయి. తర్వాత అర్సలాన్ వంతు. కాని వాడికి యేమీ కనిపించలేదు.

మళ్లీ యాగ్‌ముర్ బైనాక్యులర్స్‌ని తీసుకున్నాడు.

''యిదిగో చూడు! అక్కడ అడివి బాతు వుంది'' అన్నాడు.

అర్సలాన్ బైనాక్యులర్స్‌ని కళ్లదాకా పెట్టుకుని

''అది బాతూ కాదు, గీతూ కాదు! నక్క. దాని దగ్గర బంతి వుంది. బంతి వున్న నక్క అమ్మ బాబోయ్'' అని ఆశ్చర్యంతో అరిచేడు.

''నక్క యెక్కడ కనిపించిందిరా?'' అని యాగ్‌ముర్ బైనాక్యులర్స్‌ని అందుకోబోయేడు. కాని అర్సలాన్ వదల్లేదు.

''వో క్షణం వుండు. నక్క బంతిని దొర్లిస్తోంది.''

యాగ్‌ముర్ బైనాక్యులర్స్‌ని అర్సలాన్ చేతినుంచి లాక్కున్నాడు.

''ఆఁ, నిజమే రోయ్! నక్కే. అది ముళ్లపందిని దొర్లిస్తోంది. చూడు, దాన్ని నదిలోకి గెంటేసింది'' అన్నాడు.

అర్సలాన్ మళ్లీ బైనాక్యులర్స్‌ని లాక్కున్నాడు.

''యెక్కడ? నాకేం కనిపించడం లేదు. అడివి బాతు కనిపిస్తోంది.''

''యెర్ర పొద వేపు చూడరా.''

''ఆఁ! కనిపించింది. అది ముళ్లపందే. నది వొడ్డుకి యీదుకు వస్తోంది. అయ్యో!'' అని అర్సలాన్ బైనాక్యులర్స్‌ని కింద పెట్టి భోరుమని యేడ్చాడు.

''యేమైందిరా?'' అంటూ యాగ్‌ముర్ బైనాక్యులర్స్‌ని కళ్ల దగ్గర పెట్టుకున్నాడు. ''ఆఁ! చూడా దొంగ భడవ! ముళ్లపందిని మింగేస్తోంది'' అన్నాడు.

''మనం దాన్ని రక్షిద్దాం! యింకా మించి పోకుండా'' అన్నాడు అర్సలాన్ ఠకామని లేచి నుంచుంటూ.

''అబ్బే, ఆలస్యం అయిపోయింది. మనం అక్కడికి వెళ్లేటప్పటికి ముళ్లు తప్ప యేమీ మిగలవు.''

''వెధవ బైనాక్యులర్స్'' అని అర్సలాన్ కోపంగా తిట్టిపోశాడు.

''బైనాక్యులర్స్ తప్పేముందిరా. నక్కలు యెలా వేటాడతాయో చూశాం అంతే'' అన్నాడు.

''పద యింటికి పోదాం. తుపాకీలో తూటాలు పెట్టమని తాతతో చెప్తా. ఆ నక్క పని పట్టించాలి.''

''ముళ్లపంది అంటే జాలి, నక్కని చంపినా బాధే!'' అన్నాడు యాగ్‌ముర్.

అర్సలాన్ వో క్షణం ఆలోచించి ''అవును, నక్కని చంపినా బాధే మరి'' అని నిట్టూర్చి అన్నాడు.

దండన పడిన దొంగ

అర్సలాన్ వంట బోదెలో కాళ్లు వూపుతూ మట్టిముద్దతో బొమ్మలు చేస్తూ కూర్చున్నాడు. యెండ తగల కుండా పెద్ద మల్‌బరీ చెట్టు నీడ పడుతోంది. బుజ్జి మేక దగ్గర్లో మేత మేస్తోంది. ముందు కాళ్లు రెండు చెట్టు కాండంమీదకి చోటు పెట్టి అందుబాటులో వున్న కొమ్మల చిగుళ్లు కొరుకుతోంది.

చెట్టుమీద వాలిన పిచికలు వున్నట్టుండి పిచ్చిగా కిచకిచ లాడ్డం మొదలుపెట్టాయి. వన మూలికల పొదల్లో తిరుగుతూ వున్న కోడిపిల్లలు కొక్కొకొ అంటూ కూతలు మొదలుపెట్టాయి.

అర్సలాన్ యేమిటి చెప్మా అని తల అటు తిప్పేడు. భీకరంగా కనిపించే వో మాదిరి సైజు పక్షి లావాటి కొమ్మమీద వాలింది. దాని ముక్కు కొక్కెంలాగా వంపు తిరిగి వుంది.

తర్వాత అంతా నిశ్శబ్దం. పిచికలు కొయ్య బారిపోయేయి. కోడిపిల్లలు వన మూలికల గుబుర్లకింద వొదిగి వొదిగి చేరాయి.

''హేయ్!'' అంటూ అర్సలాన్ పిలవా పెట్టాకుండా వచ్చిన పక్షికేసి వో మట్టి బొమ్మని విసిరేడు.

అది రెక్కలు కొట్టుకుని యెగిరిపోయింది.

మళ్లీ వెంటనే అన్నిటికీ జీవం వొచ్చింది. పిచికలు మళ్లీ కిచకిచమన్నాయి. కోడిపిల్లలు తిరగడం మొదలెట్టేయి.

అర్సలాన్ పరిగెత్తి తాత దగ్గరికి వెళ్లి జరిగిన సంగతి చెప్పేడు.

''నాకు యేం కనిపించిందో నువ్వు వూహించలేవు పందెం! యెంత భయంగా వుండే పక్షి అనుకున్నావ్! దాని ముక్కు! కోడిపిల్లలన్నీ దాంకున్నాయి. పిచిక కిచకిచలాడితే వొట్టు!'' అన్నాడు.

''డేగ యేదన్నా వచ్చిందేమో రా'' అని రాఖిమ్ ఆగా తీర్మానంగా అన్నాడు. ''చిన్న పిట్టలు కొయ్య బారిపోయి బతికి బట్టకట్టేయి. డేగ ఆకాశంలోనుంచి నేలమీద పాకే చీమని చూడగలదంటారు. కాని కదలకుండా నుంచున్న ఒంటెని కూడా చూడలేదట. డేగ బహుశా నిశ్చలంగా వున్న వస్తువుని చూడలేదు. ఆ కోడిపిల్లల్లో యే

వొక్కటన్నా పారిపోవడానికి ప్రయత్నించి వుంటే డేగ వెంటనే దానిమీదకి యెగిరి వుండేదే'' అని చెప్పాడు.

రాఖిమ్ ఆగా వెంటనే బైనాక్యులర్స్‌ని యెత్తేడు. వాటిని ఆయన యెప్పుడూ కూడా వుంచుకునేవాడు. యెత్తి ఆకాశంలోకి చూశేడు.

''నే చెప్పానుగా! యిటు రా!'' అంటూ తాత మనవణ్ణి దగ్గరికి పిలిచేడు. వాడికి బైనాక్యులర్స్ అందించేడు. ''అదో ఆ తెల్ల విల్లోకేసి చూడు. కొంచెం పైకి చూడు. యేం ఆ పక్షేనా?''

''ఆఁ.''

''దాన్ని మరి శాస్త్రంలో యేమని పిలుస్తారో నాకు తెలీదు. కాని పాత కాలం వాళ్ళు 'ప్రవక్త అశ్వం' అని పిలుస్తారు'' అన్నాడు.

''తాతా! చూడు!'' అని అర్సలాన్ అరిచేడు. బైనాక్యులర్స్‌ని తాతకి తిరిగి యిచ్చేడు. ''ఆ 'ప్రవక్త అశ్వా'న్ని యేదో తరుముతున్నాయి'' అన్నాడు.

''అవి నీలం కాకులు. యిది వాటి పిల్లల్ని దేన్నేనా కాజేసిందేమో. యిప్పుడవి దొంగకి బుద్ధి చెప్తాయి'' అన్నాడు.

తర్వాత అర్సలాన్ బైనాక్యులర్స్‌ని కళ్ల దగ్గర పెట్టుకుని సరిచేసుకున్నాడు.

''అవి దాన్ని రెక్కలతో మోదుతున్నాయి. తాతా, అది దేన్నో జారవిడిచింది.''

''పిల్లని జారవిడిచి వుంటుంది. యిక వేరే దారి కనిపించి వుండదు దానికి. కాకి రెక్కలు మహా గట్టివి. నేను చిన్న పిల్లాడిగా వున్నప్పుడో సారి కాకి గూడు అందుకుందామని చెట్టు యెక్కాను. అవి బాగా వాయించేయి నన్ను. అందుకనే లోకులు వాటిని 'ప్రవక్త కొరడా'లు అంటారు.''

''సరదాగా వుంది'' అన్నాడు అర్సలాన్. ''తాతా, మనం వెళ్లి యెప్పుడు బైనాక్యులర్స్‌తో జంతువుల్ని చూద్దాం? నేను కొంచెం పెద్దయాక వెడదాం, వెడదాం అంటావు. నేను పెద్ద వాణ్ణయాను కదా'' అన్నాడు.

రాఖిమ్ ఆగా అర్సలాన్‌కేసి చూసి అవునన్నట్టు తల వూపేడు.

''నిజమే. నువ్వు పెద్ద వాడివే. మీ మామ్మకి పొయ్యిలోకి కట్టెలు తెచ్చి పెడుతున్నావు. నీకిష్టమైతే రేపే వెడదాం.''

''పుచ్చకాయల తోటకా?'' అని కళ్ళు మెరుస్తూ వుంటే అర్సలాన్ అడిగేడు.

''అవును. మందలని చూసే వేళయింది. వెళ్లడానికి యేర్పాట్లు చేస్తాను మామ్మతో చెప్ప కాసిని చురెకెలు చెయ్యమని.''

''బుజ్జి మేకని కూడా తీసుకురానా?''

''అలాగే'' అని రాఖిమ్ ఆగా అన్నాడు.

పాత ఏరు

రాఖిమ్ ఆగా, అర్సలాన్, బుజ్జి మేకతో నది వారనే దారిమీద వెళ్లేరు. విల్లో గుబురుల దగ్గరికి ఆ దారి తీసికెళ్లింది. వాళ్లు గుబురుల్లోనుంచి బయటికి వచ్చేటప్పటికి నదికి బాగా దూరంలో తేలారు. కాని వాళ్ల యెదురుగ్గా పారదర్శ కంగా వున్న నీలి నీళ్ల ఉపరితలం తళుకు తళుకు మంటూ కనిపించింది.

అది పాత ఏరు.

యిది వో ప్రత్యేకమైన జలమార్గం. దీంట్లోకి నీళ్లు నదినుంచి వచ్చి చుట్టు తిరిగి మళ్లీ నదిలో కలుస్తాయి. యీ జలమార్గంలో వడి వుందో లేదో కనిపించదు. అమూదార్య బురద నీరు కలకదేరి, జలలో వూరిన నీళ్లంత స్వచ్ఛంగా వుంటుంది.

యిటీవలి కాలంలో అమూదార్య వెనక్కి వెనక్కి తగ్గింది. నదికీ, యీ జలమార్గానికీ మధ్య పెద్ద లంక యేర్ప డింది. వూరినుంచి వన మూలికల్ని యేరుకోవడానికి వచ్చేవాళ్లు తమ దూళ్లని మేతకి యీ లంకమీదకి తోలుకువస్తారు. పుచ్చకాయల్ని ఆ సారవంతమైన వొండ్రు నేలలో పండించుకుంటారు.

రాఖిమ్ ఆగా, అర్సలాన్ బుజ్జి మేకతో ఆ వొడ్డున నుంచున్నారు. అక్కడ అంతా పొదలు పెరిగిపోయాయి.

ఓ బోటు అవతలి వేపునుంచి వస్తోంది.

అది మోటారు బోటు, దడదడ చప్పుడు చేస్తోంది. కొంచెం సేపట్లోనే రాఖిమ్ ఆగాకి సలాం చేస్తూ ఆ బోటు తోలే కుర్రాడు బుజ్జి మేకతో సహా తాతనీ మనవణ్ణీ యెక్కించుకున్నాడు. బోటు పుచ్చకాయల పొలాలకేసి దూసుకు పోయింది.

''మాకు వో క్రొర పడిందక్కడ'' అంటూ రెల్లు పెరిగిపోయిన నీటికయ్యకేసి చూపిస్తూ ఆ కుర్రాడు అరిచేడు.

''ఆ మోటారు ఆపుచెయ్యి! వినిపించడం లేదు'' అని రాఖిమ్ ఆగా మళ్లీ అరిచేడు.

ఆ కుర్రాడు మోటారు ఆపేడు. బోటు వెంటనే నీళ్ల లోపలికంటా పోయింది. జలమార్గం ప్రశాంతంగా వుంది.

''ఆ నీటికయ్యలో మాకు వో క్రొర దొరికింది అంటున్నా. పన్నెండు కిలోల బరువు.''

''ఫరవా లేదు'' అని రాఖిమ్ ఆగా మెచ్చుకున్నాడు. ''నువ్వు వల వేశేవా?'' అని అడిగేడు.

''వుహు, గాలం వేశాను. రెల్లుకి అడ్డం కట్టేను. ఆ క్రొరల గుడ్లు దారానికి కట్టిన పూసల్లా వొక రెల్లు కాడ నుంచి యింకో రెల్లు కాడకి అంటుకున్నాయి. క్రొరలు దగ్గర్లో పహరా వున్నాయి. మేం చిన్న చేపని పట్టి కొక్కేనికి తగిలించి రెల్లులోకి వదిలేం. అది తపామని పడి నీళ్లల్లో కలకలం కలిగించింది. క్రొర తృటిలో వచ్చింది. తన గుడ్లని అది మింగేస్తుందని భయ పడింది. యీ చిన్న చేపని పట్టింది. దాని పని అయిపోయింది. అది మా బోటుని యీడ్చే సింది. దాదాపు తెంపేసుకుని పోయేదే'' అన్నాడు ఆ కుర్రాడు.

''వూఁ, యిక్కడ దింపెయ్యి మమ్మల్ని. యీ కాస్త దూరం నడిచి వెడతాం'' అన్నాడు రాఖిమ్ ఆగా.

లంకమీద రెల్లు గుబుర్లు యెత్తుగా పెరిగాయి. వాటి తెల్లని శిఖరాలు దిమ్మర్ల గుడారాల్లా వున్నాయి దూరానికి. వాటి మధ్యలో ఫిగ్ చెట్ల యెర్రటి చివళ్లు చాచుకు వస్తూ కనిపించేయి.

''అమ్మ బాబోయ్!'' అని అర్సలాన్ భయంతో అరిచేడు. మళ్లీ అంతట్లోనే వాడి భయం ఆశ్చర్యంగా, సంతోషంగా మారింది.

నేలమీదనుంచి వున్నట్టుండి నవరత్నాలు ఉబికి పైకి ఎగజిమ్ముతూ వచ్చినట్టు అడివి కోళ్లు మందగా యెగరడం మొదలుపెట్టేయి.

''జో... కూర్... జో... కూర్'' అంటూ విదారకంగా గోలరేగింది, అయినా ఆ కూతలు బాగానే వున్నాయి.

''తాతా! నాకెంత సంతోషంగా వుందో యిక్కడికి వచ్చినందుకు'' అన్నాడు అర్సలాన్.

రాఖిమ్ ఆగా చిన్నగా నవ్వేడు. మనవడి భుజంమీద చెయ్యి వేశాడు. అర్సలాన్ బుజ్జి మేక మెడమీద చెయ్యి వేశాడు.

తాతా మనవడూ మేక పిల్లని తోలుకుంటూ నడిచేరు. లంకలో వున్న వింతలు చూస్తూ నడిచేరు.

''యీ రెల్లు చూశావా?'' అని రాఖిమ్ ఆగా మనవడితో అన్నాడు. ''దీంతో చక్కని చాపలు తయారు చేసుకోవచ్చు. యేమిటో యీ రోజుల్లో యెవళ్లూ చాపలే అల్లడం లేదు'' అన్నాడు.

దారిలో గునగున పరిగెత్తుకుంటూ వో కుందేలు వెళ్లింది.

''తాతా! యిక్కడేనా కిందటేడాది నువ్వు కుందేళ్లని కాపాడింది?''

''అదో అక్కడ తెల్లటి విల్లో వున్న యేటవాలు చూశేవా? కిందటేడాది యిక్కడ వరద నీరు ముంచెత్తింది. లంకంతా మునిగిపోయింది. కుందేళ్లు అన్నీ వొకదానికొకటి అంటి పెట్టుకుపోయేయి. నీరు లేస్తూనే వుంది. మేం కుందేళ్లనన్నింటినీ సంచీల్లోకి యెత్తి అవతలి వేపు చేరేశాం. సంచీలు విప్పగానే అవన్నీ మెరుపుల్లా దూసుకుపోయేయి.''

దారిలో వో పాత మల్‌బర్రీ చెట్టు పడి వెళ్లడానికి లేకుండా అడ్డం అయింది.

''రా కూర్చుని యేటి గలగల విందాం'' అన్నాడు రాఖిమ్ ఆగా.

అర్సలాన్ కూచున్నాడు.

బుజ్జి మేక దగ్గర్లో వున్న పొదల్లో మేత మెయ్యడానికి వెళ్లింది. నీళ్లు వొడ్డుతో మాట్లాడుతూ వున్నట్టుగా మెల్లిగా గలగల మంటూ పారుతున్నాయి.





పైకి ఆకుపచ్చ లోపల ఎరుపు

పుచ్చకాయల తోట శివారులో విల్లో చెట్లు వున్నాయి. తోటలో ఆ విల్లో చెట్ల మధ్య నాలుగు స్తంభాలు పాతేరు. దాంతో ఆ చెట్లు పొదరిల్లులా వున్నాయి. యెండిపోయిన రెల్లు దుబ్బులు నాలుగు కొమ్మలకీ కట్టి రెండు వేపులా గోడల్లా అమిరేయి. కప్పు చాప కిందికి చాందినీ వేలాడ కట్టినట్టు వుంది.

''హమ్మయ్య! యిక్కడికి చేరాం'' అని రాఖిమ్ ఆగా పొదరింట్లో తోలు తివాసీమీద చేరి అన్నాడు. ''దాహంగా వుందిరా, వో పుచ్చకాయ పట్రా'' అన్నాడు.

బుజ్జి మేక తన యజమాని వెనక్కాలే వెళ్లేందుకు విల్లో గుబురు వెనకనుంచి యివతలికి వచ్చింది. కాని అర్సలాన్ వద్దని చేత్తో దానికి సౌంజ్ఞ చేశాడు.

''అక్కడే వుండు. నేను దూరం వెళ్లడం లేదు లే'' అన్నాడు.

మేక పిల్ల అలానే వుండిపోయింది. కాని అర్సలాన్ తిరిగి వస్తూ వుండడం చూశాకనే నేలమీద పడుకుంది.

''దీన్ని చూడు తాతా! యెంత పెద్దదో! మొయ్యలేకపోయేను.''

అర్సలాన్ పుచ్చకాయని నేలమీద పారేసి పొదరింట్లోకి దూరేడు.

''చూడు తాతా!'' అని అర్సలాన్ యెండిపోయిన కాండం వొకటి చూపిస్తూ అన్నాడు. ''యేదన్నా నేల పురుగు కొరికిందేమో'' అన్నాడు.

''యిక్కడ చాలా నేల పురుగులు వున్నాయి'' అని తాత అన్నాడు. ''కాని సమస్య రెండు రకాలుగా వుంటుంది. అవి కాండాల్ని దొలిచేసి కన్నాలు చేసి నష్టమూ కలిగిస్తాయి, కాని వాటివల్ల లాభమూ వుంది'' అన్నాడు.

''వాటివల్ల లాభం యేం వుంటుంది తాతా?'' అని అర్సలాన్ ఆశ్చర్యంగా అడిగేడు.

రాఖిమ్ ఆగా చాకు తీసి, వోరగా మనవడికేసి చూశాడు.

''యీ చిక్కుని విప్పగలవేమో చూద్దాం. 'పైకి ఆకుపచ్చ, లోపల ఎరుపు''' అన్నాడు.

''పుచ్చకాయ'' అని అర్సలాన్ ఠక్కని చెప్పేడు. యింతలోకే వాడి కళ్లు భయంతో పెద్దవి అయేయి. ''కాని లోపల తెల్లగా వుంటేనో మరి?'' అన్నాడు.

''అబ్బే, అలా జరగదు'' అని రాఖిమ్ ఆగా పుచ్చకాయని రెండుగా చీలుస్తూ అన్నాడు. ''చూడు, మంటలాగా యెఱ్ఱగా వుంది. వేడిగా వుండడంతే, తియ్యగా వుంటుంది. యింద మొదటి ముక్క నీకు, తిను'' అన్నాడు.

యెఱ్ఱగా వున్న ముక్కని కొంచెం కొరికేడు అర్సలాన్. సంతోషంతో వాడి కళ్లు ముడతలు పడ్డాయి. తన బుజ్జి మేక గుర్తువచ్చి

''తాతా, మనం వో ముక్కని బుజ్జి మేకకి పెట్టద్దూ. దానికీ దాహం వేస్తుందేమో'' అన్నాడు.

మేక పిల్లకి దాని వాటా పుచ్చకాయ ముక్క వచ్చింది. బాగుందన్నట్టు దాని గంట గణగణ మోగింది.

''తాతా నేల పురుగుల వల్ల లాభం యేమిటో చెప్పలేదు నువ్వు'' అన్నాడు అర్సలాన్.

''యిదీ: ఒకోసారి చూస్తే నీకు కాండాలన్నీ బాగా పెరుగుతూ వున్నట్టు కనిపిస్తుంది. యింతలోకే వున్నట్టుండి

వాటిలో కొన్ని వాడిపోతున్నట్టు కనిపిస్తాయి. కొన్ని కత్తెరతో కత్తిరించినట్టు కనిపిస్తాయి. అది క్షారం. మన నేల శాపం. భూగర్భంలో వున్న నీరు క్షారాన్ని పైకి తెస్తుంది, చెట్లు చచ్చిపోవడం మొదలుపెడతాయి. యిక రెండో శాపం యెండ. ఆ విషయమయే నేల పురుగులు సాయం చేస్తాయి. నేలలో అవి కంతలు చేస్తాయి. దానివల్ల గాలి నేలలోకి చొచ్చుకుపోయి, సారవంతం చేస్తుంది. అలాంటి నేలలో చెట్లకి గాలి పీల్చడం తేలిక. నేల పురుగులు నిజమైన ఇంజనీర్లే సొరంగాలు తవ్వడంలో. అవి నిటారుగా తొలుస్తాయి. యేదన్నా వేరు అడ్డం వస్తే దాన్ని కోసేస్తాయి, వొకవేళ చెట్టయితే కన్నం చేస్తాయి. నేల పురుగులు మరీ యెక్కువ అయితే కోయిల వచ్చి రైతుకి సాయం చేస్తుంది. కోయిలకి యీ నేల పురుగు రుచికరంగా వుంటుంది. మిగతా పిట్టలు యీ నేల పురుగుని పట్టుకోలేవు. కాని కోయిల వాటిని పట్టుకుంటుంది, నేలలో కంటా చూడగలిగినట్టుగా. సొరంగం అందుకోవడానికి రెండు మూడు కంతలు చేస్తుంది. ముక్కుతో పొడిచి, పొడిచిన ప్రతి సారీ పురుగుని పట్టుకుంటుంది'' అన్నాడు.

అర్సలాన్ పుచ్చకాయ ముక్క తినేసి మంట వేసుకోవడానికి యెండు పుల్లల కోసం పరిగెత్తి వెళ్లేడు. తాత సన్నటి మూతి వున్న కూజా తీసుకుని నీళ్ల కోసం వెళ్లేడు.

తృప్తిలేని భోజన ప్రియులు

''నీళ్లు కాగే లోపల పొలంలోకి వెడదాం పద'' అని రాఖిమ్ ఆగా అన్నాడు. ''కర్బుజాలు పండేయి. వో సారి వాటిని చూసి వెడదాం. ముఖ్యంగా జొన్న యెలా వుందో చూద్దాం'' అన్నాడు.

జొన్న పుచ్చకాయల తోట చుట్టూతా కంచెలాగా వుంది. పూత పట్టిన కాండాలు నేలకి మూడు మీటర్ల యెత్తు పెరిగాయి. అది సజీవమైన కంచె. యెవళ్లూ చొరబారి రావడానికి లేని రక్షణ. జొన్న గింజలు పసుప్పచ్చగా చిన్నగా వుంటాయి.

రాఖిమ్ ఆగా మధువు లీనే జొన్న పెంచేవాడు. గొట్టంలాంటి దాని కాండం లోపల తియ్యటి, పంచదారలాంటి రసం వూరేది. ఒకప్పుడు యీ రకం జొన్న పిల్లలకి చాలా యిష్టంగా వుండేది. కాని పంచదార, బిళ్లలు కొంచెం బాగా దొరుకుతూ వుండడంతో యీ రకం జొన్నని మరిచిపోయేరు, విత్తనాలకి కూడా మిగల్లేదు.

రాఖిమ్ ఆగా మరపున పడిన యీ జొన్నని మళ్లీ పెంచాలనుకున్నాడు. ఆఖరికి వో పాత రైతు తోటలో వో

మొక్కని పట్టేడు. మూడేళ్ల కాలంలో యీ రకం జొన్నని మళ్లీ సాధించేడు. యిప్పుడు యీ విత్తనాల్ని సమష్టి క్షేత్రానికి ఇవ్వాలని వూహ చేశాడు.

రాఖిమ్ ఆగా మొక్కల్ని తణిఖీ చేశాడు.

''కోత వేళ అయింది. ధాన్యం పండింది. పక్షులు పాడు చేసేస్తాయి కూడాను'' అన్నాడు.

''తాతా! చూడు!'' అని అర్సలాన్ వో కర్బుజా తొక్కని నేలమీదనుంచి తీసి అన్నాడు. ''యెవరో కర్బుజాల్ని తిన్నట్టే వుంది'' అన్నాడు.

''అవి బాగా పండేయనడానికి దాఖలా అదే'' అని రాఖిమ్ ఆగా పగలబడి నవ్వుతూ అన్నాడు.


''కాని యెవళ్లు తిన్నారు? యిదిగో యింకో తొక్క. బహుశా అడివి పంది తిందేమో'' అన్నాడు.

''అడివి పంది గనక అయినట్టయితే అది మొత్తం తోటని మడదొక్కి వుండేది. కాని కర్బుజాలని తిన్నది నక్క. నక్కలు భలే తిండి ప్రియులు. బాగా పండిన కర్బుజాల వాసన పట్టుకుని వాటిని తింటాయి. గింజ గింజ యేరి తింటాయి ఆ తినడంలోనూ!'' అన్నాడు.

''ఆఁ! నక్కలేనన్న మాట! మొదట అది ముళ్ల పందిని తింది. యిప్పుడేమో మన కర్బుజాలు తింటోంది. తాతా, దానికి వల పన్నుదాం'' అన్నాడు అర్సలాన్.

''నక్కలు జిత్తులమారులు. అవి వలలో పడవు. కొన్ని శుద్ధ అమాయిక జంతువులు వలలో చిక్కుకుని నాశనం అవుతాయి. దిష్టి బొమ్మ పెడదాం. నక్క దాన్ని చూసి మనిషనుకుని రాదు'' అన్నాడు.

వాళ్లు అలానే చేశారు. కొంచెం టీ తాగేరు. తర్వాత రెల్లుతో దిష్టి బొమ్మని చేసి నక్కల దండుని తరిమెయ్యడానికి నిలబెట్టారు.



మూడు కాలి వేళ్లు వున్న ఆడతోడేలు

సూర్యుడు అస్తమిస్తూ వుండే వేళకి తాతా, మనవడూ పడుకోవడానికి వొరిగేరు. బుజ్జి మేక ఆ విల్లో మొక్క కింద సర్దుకుంది.

ఆ రోజున జరిగిన అంతట్నీ గుర్తు చేసుకుంటూ పడుకున్నాడు అర్సలాన్. తన జీవితంలో అది చాలా మంచి రోజని అనిపించింది. ఆవేళ తనూ, తాతా నిజమైన పరిశోధకులుగా పని చేశారు.

వున్నట్టుండి నక్క కూత మార్మోగింది. బుజ్జి మేక గంట గణగణ మంది, బెదురుతో.

''బుజ్జి మేకా! బుజ్జి మేకా!'' అని అర్సలాన్ పిలిచేడు.

బుజ్జి మేక చెంగున పాదరింటిలోకి దూరి వాడి పక్కన వాలింది. అర్సలాన్ బుజ్జి మేక నుదురు గీరేడు. దాన్ని తన వేపు తిప్పుకున్నాడు. వున్నట్టుండి వాడి కళ్లు పెద్దవయేయి.

''తాతా! నక్కలు మనల్ని వేటాడవు కదా?''

''అబ్బె! లేదు రా! అవి పిరికివి!''

''తోడేళ్లు వస్తే?''

''వేసవికాలంలో తోడేళ్లు మనుషులమీదకి రావు.''

''మూడు కాలి వేళ్లు వున్న ఆడతోడేలు గురించి చెప్పావు గుర్తుందా? మళ్లీ చెప్పవూ?''

''పొద్దుపోయింది. రేపు పెందరాళే నిన్ను లేపుతా.''

''వూఁ... తాతా!'' అని అర్సలాన్ గారం కుడిచేడు. ''వొక్క కథ చెప్పు. యిక అడగను'' అన్నాడు.

''సర్లే అయితే, చాలా కాలం కిందట జరిగింది యిది'' అని తాత చెప్పేడు.

''యెంత కాలం కితం?''

''చెప్తా. మనం యిక్కడ స్థిరపడడానికి ముందు. అప్పట్లో బళ్లుగాని, ట్రాక్టర్లుగాని, కార్లుగాని లేవు.''

''సైకిళ్లో?''

''అవీ లేవు. అప్పుడు నేను చిన్నా పెద్దా అందరూ హాజరయే ప్రత్యేకమైన బళ్లో చదువుకునే వాణ్ణి. ఆ రోజుల్లో మన వూళ్లో వొక్కళ్లకి కూడా చదువనూ రాయనూ రాదు. బడి పక్క వూళ్లో వుండేది. రానూ పోనూ చాలా దూరం. ఓ రోజున యింటికి అడ్డదారిన వస్తూ వున్నాం. మాకు వింత మూడు కాలి వేళ్ల అడుగు జాడలు కనిపించేయి. తోడేలు జాడలేనా కావాలి, పెద్ద కుక్కవేనా కావాలి. మన వూళ్లో మూడు కాలి వేళ్ల కుక్కలు లేవు. తర్వాత కొంత కాలానికి అడివి కోళ్ల వేటకి వెళ్లిన పిల్లలు కొంత మందికి రెల్లులో తోడేళ్ల ఆవాసం కనిపించింది.

''అక్కడ మూడు పిల్లలున్నాయి'' అని అర్సలాన్ అందించేడు.

''అవును. అవి మూడూ యెదిగిన పిల్లలే. వాటిని పట్టుకోవడానికి పిల్లలకి భయం కలిగింది. వూళ్లోకి పరిగెత్తు కుంటూ తిరిగివచ్చేరు. వూళ్లో వాళ్లు విషయం యేమిటీ అని చర్చ చేసి హడావుడిగా తుపాకులు నింపే వేళకి ఆ తోడేలూ, మూడు పిల్లలూ మాయమైపోయేయి. ఆ మర్నాడు చూస్తే వో మేక కనిపించలేదు. ఆ మర్నాడు వో పొట్టేలు పోయింది. ఆ తర్వాత మరికొన్ని పోయేయి.''

''తాతా! మూడు కాలి వేళ్లు వున్న ఆడతోడేలు బాగా బలిసిన పది పొట్టేళ్లని లాగేసింది'' అని అర్సలాన్ మళ్లీ అందించేడు, కథకుణ్ణి సరిదిద్దుతూ.

''అవును, నిజమే రా! అలానే జరిగింది. వాళ్లు పగలూ రాత్రీ ఆడతోడేలి కోసం వెతికారు. కాని లాభం లేక పోయింది. తర్వాత గొర్రెలకాపరులు వచ్చి వూళ్లో వాళ్లకి విషయం వివరించి చెప్పారు. వాళ్లు ఆడతోడేల్ని బెదర గొట్టకుండా వుండాల్సింది అని. అది వూరి దగ్గర వున్నా అది యిళ్లల్లో వుండే జంతువుల జోలికి యెప్పుడూ పోలేదు. స్టెప్ బీళ్లల్లో వేటాడేది. కాని ఆడతోడేలు తెలివైంది. దానికి పశువుల కొట్టాల దార్లన్నీ తెలుసు. తన

పిల్లలు పెద్దవయాక వాటిని స్తెప్ బీళ్లలోకి తీసుకెళ్లి అప్పుడు యిళ్ల దగ్గర వుండే పశువుల్ని కూడా వేటాడ్డం మొదలెట్టింది. బాగా వేటాడేది.''

''అయినా దాన్ని యెప్పుడూ పట్టుకోలేకపోయేరు'' అని అర్సలాన్ తాతగారి కథకి ముక్తాయింపు చెప్పేడు.

''అవును, దాన్ని యెప్పుడూ పట్టుకోలేకపోయేరు. యిక నిద్రపో.''

అర్సలాన్ సౌకర్యంగా వుండేట్టు చేసుకోవడానికి యిటూ అటూ తెగదొర్లేడు. తర్వాత కదలకుండా పడుకున్నాడు. కాని నిద్రపట్టలేదు. బయట యేవో వింత చిటపటలు వినిపించేయి. అవి మొదట వో చోటనుంచీ తర్వాత యింకో చోట నుంచీ వినిపించేయి, గునగున పరిగెట్టి పోతూ వున్నట్టు. అర్సలాన్ మోచేతిమీద ఆనుకుని చీకట్లోకి చూశేడు. యెక్కడా మంట కనిపించలేదు. నక్కలు యిక్కడికి వస్తున్నాయేమో, లేకపోతే యింకా పాడు కుయుక్తి తోడేళ్లు వస్తున్నాయేమో.

''తాతా! ఆ చప్పుడు విన్నావా?''

''ఆఁ, కర్బుజాలు బీటలు తీస్తున్నాయి. అవి పండిపోయి అలా అవుతాయి.''

అర్సలాన్ చిన్నగా నవ్వుతూ వెనక్కి వాలి పడుకున్నాడు. కొంచెం సేపట్లోనే నిద్రపోయేడు.

ముళ్ల పంది

''అర్సలాన్, లే!''

అర్సలాన్ కళ్లు తెరిచేడు. యెండ బాగా కాస్తోంది. బుజ్జి మేక మువ్వల చప్పుడు వినిపించింది. మేక పిల్ల పొద్దుట్నుంచీ మేత మేస్తూనే వుంది.

''రకరకాల అడివి జంతువుల్ని చూస్తానన్నావు కదరా మరి. వో కర్బుజా తిని కొంచెం టీ తాగి బయల్దేరదాం. నీకు ఆ జంతువుల్ని చూపిస్తాను. నువ్వు నిద్రపోతూ వున్నప్పుడు నేను వెళ్లి చూసి వచ్చేను...''

''పద పద, అది పారిపోకుండా వెడదాం'' అన్నాడు అర్సలాన్.

''అదెక్కడికీ పోదు. ముళ్ల పంది కలుగు చూశేను.''

ముళ్ల పంది కలుగు ప్రత్యేకమైంది. దాంట్లో మూడు అరలు వుంటాయి. ఆడ, మగ ముళ్ల పందులు మొదటి అరలో వుంటాయి. కుర్రవి మధ్య దాంట్లో వుంటాయి. మూడో దాంటో నరుకులు వుంటాయి.

యిదివరకే తవ్విన కలుగులో మూడు అరలూ కనిపించేయి. కొట్టు గదిలో దుంపలూ, గడ్డలూ చక్కగా అమర్చి వున్నాయి.

''యివి మనుషుల్లాగానే వుంటున్నాయే!'' అని అర్సలాన్ ఆశ్చర్యంగా అన్నాడు.

''ఒకప్పుడు ముళ్ల పంది మనిషే. మెంగ్లి మామ్మ నీకా కథ చెప్పలేదా? చాలా విచారంగా వుంటుందా కథ'' అన్నాడు తాత.

''వుహుఁ.''

''అయితే విను. ఒకప్పుడు, అంటే చాలా పూర్వం వో మనిషి పొరుగు వాడి దగ్గర రెండు మూటల దూది అప్పు తెచ్చుకున్నాడు. దాన్ని తిరిగి యివ్వాల్సి వచ్చే వేళకి వాడికి దురాశ పుట్టింది. వో మూటని అసలు వుండాల్సిన దాని కంటే తక్కువగా కట్టేడు. అవతలివాడు యీ మోసం వెంటనే గ్రహించేడు. కోపం వచ్చి కదురుని దూదిలో గుచ్చి దాన్ని శపిస్తూ విసిరేడు యీ కదురు బాణంలాగా నీ శరీరాన్ని గుచ్చుకోగాక అని.

''అది గుచ్చుకోగానే వాడి శరీరం అంతా ముళ్లలాంటి బాణాలు కమ్మేయి. అలాంటి స్థితిలో నలుగురి ముందూ కనిపించడానికి సిగ్గయి వాడు యెక్కడికో పారిపోయేడు. యివాల్టికీ తన పరువు తక్కువ పనికి సిగ్గు పడి రాత్రిళ్ల ప్పుడే కలుగులోంచి యివతలికి వస్తాడు, అందరూ నిద్రపోయేక.''

''తాతా! చూడు! ముళ్ల పంది సూది! అచ్చం కదురులాగానే వుంది. దీన్ని తీసుకోనా?''

''అలాగే తీసుకో. గుర్తుగా వుంటుంది. నీకు యెప్పుడేనా దురాశ పుడితే యీ కథ గుర్తు వస్తుంది'' అన్నాడు తాత.

పోరు

రాఖిమ్ ఆగా, అర్సలాన్ బుజ్జి మేకని తీసుకుని లంక మధ్యలోకి వెళ్లేరు. అంతకు ముందు టేడు వసంత రుతువులో కుందేళ్లని కాపాడిన ఆ చోటుకి వెళ్లేరు.

రాఖిమ్ ఆగా హఠాత్తుగా అర్సలాన్ చెయ్యి పట్టుకుని మెల్లిగా చెప్పేడు:

''కిందికి వాలు.''

యిద్దరూ మెల్లిగా నేలమీదకి వాలేరు. తాత బైనాక్యులర్స్‌ని పట్టుకుని చూశేడు. వాటిని అర్సలాన్‌కి యిచ్చేడు.

''తుప్పలు పెరిగిన ఆ గుట్ట చూడు'' అన్నాడు తాత.

అర్సలాన్ పట్టిపట్టి చూసి ఆః అని నోరు తెరిచేడు.

''బాడ్జర్!''

వెంటనే వాడికి కనిపించింది అది వొక్కటే లేదు, దానిమీదకి వో నక్క యెగరడానికి సిద్ధంగా వుంది. బాడ్జర్ బొద్దుగా వున్న చిన్న జంతువు.




నక్క బాడ్జర్‌ని పళ్లతో గట్టిగా కొరకబోయింది. కాని ఆ చిన్న జంతువు బంతిలాగా గెంతుతూ నక్క కోరల నుంచి తప్పించుకుంది. అది నక్కనుంచి తప్పించుకు పోవడమే గాక దానిమీద దాడి చేసింది. వెనక కాళ్లమీద లేచి నక్క ముట్టెని తన ముందు పంజాలతో పట్టుకుంది.

"తాతా! గబగబా వెళ్లి బాడ్జర్‌ని రక్షిద్దాం" అని అర్సలాన్ అరిచేడు.

"మన సాయం అక్కర్లేకుండానే అది నెగ్గేస్తుంది" అని తాత బైనాక్యులర్స్‌లోనుంచి చూస్తూ అన్నాడు. "బాడ్జర్‌ని కమ్మగా భోం చేద్దామని నక్క అనుకుంటుంది. కాని దానికి అంత బలం లేదు. గట్టిగా కాళ్లమీద నిలబడ లేదు" అన్నాడు.

నిజంగానే నక్క పక్కకి వొరిగి పోయింది. బాడ్జర్ దాన్ని వొక్క దెబ్బ కొట్టింది ముందు కాళ్లతో. తర్వాత గున గున వెళ్లిపోయింది. రాముడో దేముడో అని నక్క యేడుస్తూ పొదలలోకి పోయింది.

"యెన్ని చిత్రాలు కనిపించేయి" అని అర్సలాన్ బుజ్జి మేకకి చెప్పేడు. "యెన్నో లెక్క వుందా? బాడ్జర్‌తో నక్క పోరు చూశాం మనం. ముళ్ల పంది బొరియ చూశాం. అడివి కోళ్లని చూశాం, కర్బుజాలు పక్వానికి రావడం విన్నాం కూడా" అన్నాడు.



అద్భుతం

వాళ్లు ద్వీపం మధ్యలో కంటా నడిచి వెళ్లారు.

"నువ్వు అద్భుతాల గురించి మాట్లాడుతున్నావు. కాని నేను వో సారి అసలైన అద్భుతాన్ని చూశాను" అన్నాడు రాఖిమ్ ఆగా.

"యెలాంటి అద్భుతం?" అని మెరిసే కళ్లతో అర్సలాన్ అడిగేడు.

"అది జరిగి చాలా కాలం అవలేదులే. కాని అప్పటికి నువ్వింకా పుట్టలేదు. ఆవేళ ఆకాశం తేటగానే వుంది కాని వున్నట్టుండి తుఫాన్ మేఘాలు ముసురుకు వచ్చేయి. మొదట కుండపోతగా వాన కురిసింది. తర్వాత వడగళ్లు మొదలయేయి. ఆ వడగళ్లతోబాటుగా కప్పలు, చేపలు ఆకాశంలోనుంచి వూడి పడ్డాయి" అన్నాడు.

"తిన్నగా ఆకాశంలోనుంచే?" అని అర్సలాన్ నమ్మలేనట్టు అడిగాడు.

"ఆఁ! తర్వాత స్థానిక కేంద్రంనుంచి వో లెక్చరరు వచ్చి అలాంటి అద్భుతం యెందుకు జరిగిందో వివరించేడు.

పెద్ద పెను గాలి సుడిలా వచ్చి సరస్సులో వున్న నీళ్లనీ చిన్నా చితకా ప్రాణుల్నీ పైకి లేపేస్తుందిట. ఆ సుడి గాలి వాటిని చాలా దూరం లాక్కుపోతుంది. అప్పుడు దాని బలం తగ్గి ఆ ప్రాణులన్నీ వానతోబాటు నేలమీదకి పడతాయి. అద్భుతం కదూ?'' అన్నాడు తాత.

''ఆఁ! అబ్బ, అలాంటి వాన నేనూ చూస్తే బాగుణ్ను'' అన్నాడు అర్సలాన్.

''నా వయసుదాకా నువ్వూ వుంటే నీకూ కనిపిస్తాయి అలాంటి అద్భుతాలు'' అని రాఖిమ్ ఆగా అన్నాడు.

కాలే యిసిక పక్షులు

తాతా మనవడు వో మిట్టమీదకి యెక్కి వో పొడుగాటి చెట్టుకింద నీడలో కూర్చున్నారు.

ఆ యెత్తు మీదనుంచి వాళ్లకి అమూదార్య నది, ద్వీపాన్ని చుట్టిన పాత ఏరు వంపు కనిపించాయి. వాళ్లకి గొర్రెల మందలూ కనిపించేయి. ఏటి తీరం వారనే ద్వీపం ఆకుపచ్చగా వుంది. కాని అది పూర్తి ఏరు కాదు. దక్షిణం వేపు యేటవాలుమీద పసుప్పచ్చ యిసిక వుంది.

పొద్దు సరిగ్గా నడి నెత్తిన వుంది. ఆకురాలు కాలం అయినా ఉక్కగా వుంది.

రాఖిమ్ ఆగా సంచీలోనుంచి తిండి తీశేడు.

అర్సలాన్ తన రొట్టెని తుంపి సగం ముక్కని బుజ్జి మేకకి పెట్టేడు.

''యింటికి వెళ్లాలని బెంగగా వుందేమిటి రా?'' అని తాత అడిగేడు.

''కొంచెం'' అని అర్సలాన్ అన్నాడు.

''రేపు యింటికి వెడదాం లే. కొంచెం చల్లబడ్డాకనే వెళ్లి మన గొర్రెలు యెలా వున్నాయో చూసి వస్తాను. రేప్పొద్దున్న కాసిని జొన్న గింజలు యేరుకుందాం. బోట్లో యింటికి వెళ్లిపోదాం'' అన్నాడు.

రాఖిమ్ ఆగా, అర్సలాన్ భోజనం చేస్తూ వుండగా మేక పిల్ల మేత మేస్తూ వుంది. మెల్లిగా మిట్టమీదనుంచి కిందికి దిగుతోంది.

అది హఠాత్తుగా పక్కకి గెంతి ''మే... మే'' అని అరవడం మొదలుపెట్టింది. అర్సలాన్, రాఖిమ్ ఆగాలు వున్న చోటుకి పరిగెత్తుకుంటూ వచ్చింది.

''నక్కా?'' అని అర్సలాన్ భయంగా అడిగేడు.

''కుందేలు'' అని తాత నవ్వుతూ అన్నాడు. ''బుజ్జి మేక కుందేలని బెదిరించింది. కనిపించిందా?'' అని తాత అడిగేడు.

కుందేలు బెదురుగా యిసికమీదకి దూసుకుపోయింది. మైదానంమీద అడ్డం పడి గెంతుకుంటూ పోయింది.

''బుల్లి కుందేల్ని పట్టుకుందామా?'' అని తాత అడిగేడు.

''వూఁ.''

''అయితే పరిగెత్తి పట్టుకో.''

''నేను పట్టుకోగలనేమిటి?'' అని అర్సలాన్ కోపంగా అన్నాడు.

''యెందుకు పట్టుకోలేవు? అది పిల్ల కదా. అది భయపడి యిసికమీదకి పరిగెత్తి వచ్చింది. కాని యిసిక వేడిగా వుంది. దాని కాళ్లు కాల్తున్నాయి. యెక్కువ పరిగెత్తలేదు'' అన్నాడు.

అర్సలాన్ కుందేలు వెనక పరిగెత్తి దాన్ని పట్టేడు. అది తనని వెంబడిస్తూ వున్న వాణ్ణి చూసింది. కొంత దూరం గెంతింది. కాని యిసిక కాలుతోంది. యిక యేం చెయ్యలేక అది నేలమీద వాలింది.

అర్సలాన్ తను తొడుక్కున్న చొక్కాతో దాన్ని కప్పి యేటవాలు చోట్లోకి తీసికెళ్లేడు.

''దాన్ని హాయిగా వెళ్లిపోనిద్దాం. నాకు బుజ్జి మేక వుందిగా'' అని కుందేల్ని వదిలేశాడు.

''అవును అదే మంచిది. దాన్ని పోనీ'' అని తాత వొప్పుకున్నాడు.

ధైర్య పరీక్ష

రాఖిమ్ ఆగా అర్సలాన్ యింటికి తిరిగి వెళ్లేవేళకి మెంగ్లి మామ్మ యిల్లు కడిగి శుభ్రం చేసే పనిలో వుంది. ఆ పని యింకా పూర్తవలేదు. తివాసీలు, రగ్గులు పెరట్లో వున్నాయి. పెద్ద అద్దం వొకటి యింటి గోడకి చేరవేసి వుంది.

''మే... మే... మే'' అని బుజ్జి మేక కోపంగా అరిచింది. అది అద్దం దగ్గరికి వచ్చి చూసింది... మెడలో మువ్వలు కట్టిన మేక పిల్ల.

రెండు మేక పిల్లలు వొకే చోట వుంటే గొడవ వస్తుంది.

యీ బుజ్జి మేక తనకిగా సాధువే అయినా అద్దంనుంచి వెనక్కి వెళ్లి, తల వూపి, మాంచి వేగంగా శత్రువుమీదకి లంఘించింది. అద్దంలో కనిపించే బుజ్జి మేక కూడా శత్రువుమీదకి యెగురుకుంటూ వచ్చింది.

'ఠాప్'మని అద్దం ముక్కలైపోయింది.

''మే... మే... మే'' అని బుజ్జి మేక అరుపు లంకించుకుంది.

మామ్మ చీపురు తీసుకుని బుజ్జి మేకకి బుద్ధి చెపుదామని వచ్చింది. కాని రాఖిమ్ ఆగా ఆవిడకి అడ్డం వెళ్లేడు.

''దాన్నెందుకు కొడతావు? అది ధైర్యం వున్న మేక పిల్ల. శత్రువు ముందు తోక ముడవలేదు'' అన్నాడు.

అర్సలాన్ బుజ్జి మేకని కాగలించుకున్నాడు.

''మామ్మా! యిదింకా చిన్నది. దీనికి యింకా యేమీ తెలీదు'' అన్నాడు.

మెంగ్లి మామ్మ కొంచెం సేపు ఆలోచించి ఆఖరికి అంది:

''పోనీలే, అద్దం పాతది, కళాయిపోయింది. కొత్తది కొంటే బాగుండేది, ముసలాయనా. కొత్త అద్దంలో చూసుకుంటే మళ్లీ పడుచు వాళ్లం అవుతామేమో.''



అద్భుత కథలు

శీతాకాలం వచ్చింది. భూమి, ఆకాశం, నది బూడిద రంగుగా మారిపోయేయి.

అర్సలాన్ తెల్లవారకుండానే లేచాడు.

దూరంలో గాలి రొజ చప్పుడు వినిపిస్తోంది. యెక్కడినుంచో భూమండలం ఆ చివరనుంచి వస్తూన్నట్టు వుంది.

''తాతా, అది గాలి కదూ? త్వరలో మంచు కురుస్తుందేమో, వూఁ?'' అన్నాడు అర్సలాన్.

''కాదు రా, గాలి కాదు. తోడేళ్లు. వో సారి వెళ్లి గొర్రెలు యెలా వున్నాయో చూసి వస్తే బాగుంటుంది'' అన్నాడు తాత.

తాత కోటు బూట్లు తొడుక్కుని రైఫిల్ తీసుకున్నాడు.

''బుజ్జి మేకని కూడా చూడు'' అని అర్సలాన్ తాతకి చెప్పేడు. అతనికి చీకట్లో బయటికి వెళ్లడానికి భయం వేసింది.

''నువ్వు నిద్రపోరా బాబూ! తెల్లవారడానికి చాలా పొద్దు వుంది'' అన్నాడు రాఖిమ్ ఆగా.

''శీతకట్టు మొదలైందంతే. అబ్బ, వసంతరుతువు వస్తే యెంత బాగుంటుంది!'' అనుకున్నాడు అర్సలాన్.





మంచు లేకుండా చాలా రోజులు గడిచేటప్పటికి శీతాకాలం సరదాయే లేకపోయింది. కాని శీతాకాలంలో కూడా మంచి రోజులు వున్నాయి. చిన్న పిల్లలు మెంగ్లి మామ్మకి సాయం చేసిన రోజులు అవి. యిరుగుపొరుగు వూళ్ల ఆడవాళ్లు ఉన్ని బాగు చేసి వడకడానికి సిద్ధం చేసిన రోజులు. ఆ రోజుల్లో యిక ఆ కథలకీ కబుర్లకీ తెంపు వుండేది కాదు.

అర్సలాన్ యెప్పుడూ బుజ్జి మేకని కూడా తీసుకు వచ్చేవాడు. ఆ మేక పిల్ల గుమ్మం దగ్గర ముడుచుకుని తలని ముందు కాళ్లమీద ఆనుకుని వెచ్చగా కునుకు తీస్తూ వినేది.

ఆవేళ ఆడవాళ్లు మళ్లీ రాఖిమ్ ఆగా యింట్లో పోగయేరు. పిల్లలు ఉన్ని బాగు చేసేవారు. మెంగ్లి మామ్మ వడకడానికి కదురు తయారు చేసింది. దారం పురి యెక్కేది. అంతలోనే కథ మొదలయ్యేది.

''పాత రోజుల్లోనర్రా, పిల్లలూ, శత్రువులు యెప్పుడూ మన వూళ్లమీద దాడి చేసేవాళ్లు. ఆ రోజులు మనకి గడ్డుగా వుండేవి. కాని వూరి పిల్లగాళ్లల్లో వొకడు ధైర్యవంతుడు. వాడు బలవంతుడయేడు. వాణ్ని వాడి ధైర్యానికి గాను అందరూ బాతిర్ అనేవాళ్లు. శత్రువులు మన వూరి జోలికి రాకుండా వో మాదిరి దూరంలో వుండేవాళ్లు. కాని మన వూరి వాళ్లకి శాంతి యెక్కువ కాలం నిలవలేకపోయింది. స్తెప్ మైదానాలమీదనుంచి దుష్ట శక్తి వచ్చింది. బాతిర్ కత్తి తీసుకుని కొండ యెక్కేడు. అక్కణ్ణుంచి చూశేడు, నది ఆవల స్తెప్ మైదానంమీద శత్రు సైనికులు గుర్రాలమీద వున్నారు. చూపు ఆనినంత మేర వున్నారు.

''దాంతో బాతిర్ వో పాత విల్లో చెట్టు దగ్గరికి వెళ్లి 'నన్ను దాచిపెట్టు, నా మంచి చెట్టూ' అన్నాడు. ఆ చెట్టు విచ్చుకుని బాతిర్‌ని దాచిపెట్టింది. యీ లోపున శత్రువులు బాతిర్‌ని కొండమీద చూశారు. దూకుడుగా ముట్టడిస్తూ కొండ యెక్కేరు. కాని కొండ యెక్కేటప్పటికి బాతిర్ కనిపించలేదు.

''చూడండి, ఖర్మ! సరిగ్గా అప్పుడు బాతిర్ తొడుక్కున్న యెర్రటి అంగీ అంచులు చెట్టులోపల్నుంచి యివతలకి మెరుస్తూ వుండడం వో కాకి చూసింది. ముక్కుతో వాటిని పొడవడం మొదలుపెట్టింది. కాని ఆ అంగీ కుచ్చెళ్లు వూడి రాకపోవడంతో 'కావు కావు'మని అరవడం మొదలుపెట్టింది. కాకి కూతలు విని శత్రువులు అటు చూశేరు. యెర్రటి అంగీ అంచులు కనిపించేయి. బాతిర్ చెట్లో దాంకున్నాడని వెంటనే గ్రహించేరు. గొడ్డళ్లతో, కత్తులతో విల్లో చెట్టుని నరకడం మొదలుపెట్టేరు. కాని వాళ్ల గొడ్డళ్లు, కత్తులు మొద్దు బారిపోయేయి తప్ప లాభం లేక పోయింది. అప్పుడు చెట్టు చుట్టూతా యెండు కొమ్మలు పేర్చి బ్రహ్మాండమైన మంట అంటించేరు. అలా అంటిం చేసి యిక బాతిర్ చచ్చేడు అని నవ్వుకుంటూ వెళ్లిపోయేరు. నిజంగానే బాతిర్ కడతేరిపోయి వుండేవాడు. ఓ స్వాలో పిట్ట పుణ్యమా అని బతికేడు. అది ముక్కుతో నీళ్లు పట్టుకు వచ్చి, యీ మంటమీద పోసింది. శత్రువులు కూడా స్వాలో పిట్టని చూశేరు. కాని దాని గూడు ఆ చెట్టుమీద వుండడంవల్ల అది అక్కడ తచ్చాడుతోందేమోనని వాళ్లు అనుకున్నారు. వాళ్లు అక్కడినుంచి వెళ్లిపోయేరు. స్వాలో పిట్ట నీళ్లు తెచ్చి మంటమీద పోస్తూనే వుంది. ఆఖరికి మంట ఆరిపోయింది. గాయమూ, గంటూ యేమీ లేకుండా బాతిర్ చెట్టులోనుంచి యివతలికి వచ్చేడు.

''అప్పట్నుంచి జనాలకి కాకి అంటే మంట. దాని ద్రోహానికి గాను రెండు సార్లు దండించినట్టు వాళ్లు చెప్తారు. మొదటిగా, అది మిగిలిన పక్షులకంటే ముందుగానే తన గుడ్లని పొదిగేస్తుంది. దానివల్ల ఆ పిల్లలు తరచుగా చలికి బిగిసి చచ్చిపోతాయి. రెండవది అది ముక్కుతో గుడ్లని పెడుతుంది.''

యీ సన్నివేశం దగ్గర మెంగ్లి మామ్మ ఆగి నవ్వేది.

''అది నిజం కాదనుకోండి. కాని కాకి యెప్పుడూ దొంగే. అది మిగతా పక్షుల గూళ్లనుంచి గుడ్లు కాజేస్తుంది. జనం యీ విషయం గమనించేరు. అందుకని అనుకూలంగా వుండే వ్యాఖ్య చేసుకున్నారు.''

''కాని స్వాలో పక్షి యేమిటి?'' అని అర్సలాన్ అడిగేడు.

''స్వాలో అంటే తుర్క్మేన్‌లకి యిష్టమే. స్వాలో వసంతరుతువులో తిరిగి వచ్చినప్పుడు అందరూ సంబర పడతారు. పొక్కిళ్లు కూడా, యెంత అల్లరి పిల్లాడు కూడా దాని గూడు పాడు చెయ్యడు.''

అర్సలాన్ మీద తాత జాలి

''అర్సలాన్, నిద్రపోయేవా?'' అని మామ్మ మనవణ్ణి లేపుతూ అంది. ''లేచి బుజ్జి మేకని మందలోకి తోలుకు వెళ్లు, అప్పుడు మంచం యెక్కి నీ యిష్టం వొచ్చినట్టు పడుకో'' అంది.

అర్సలాన్ కోటు తొడుక్కుని బుజ్జి మేకని మందలోకి మువ్వపట్టీని పట్టుకుని తోలుకు వెళ్లేడు.

వాన కురుస్తోంది. బయట చీకటిగా వుంది. చలి గాలి వాడి ముఖంమీద వానని విసిరి కొడుతోంది. వాన నీరు కాలరుమీదనుంచి జారుతోంది. చలివల్లా, భయంవల్లా వొణుకుతూ అర్సలాన్ మంద వున్న కొట్టం వెడల్పాటి యినప గేటుని వో తోపు తోసి బుజ్జి మేకని చూసి

''లోపలికి వెళ్లు!'' అని అరిచేడు.

తర్వాత యింటికి పరిగెత్తి వెళ్లిపోయేడు.

కాని ఆ గేట్లు తెరుచుకోలేదు. అర్సలాన్ తొయ్యగానే అవి వెనక్కి బిగిసాయి, అంతే. బుజ్జి మేక ఆ రాత్రి బయటే గడపాల్సి వచ్చింది. రాత్రి తోడేళ్లు వచ్చేయి.

ఆ మర్నాడు పొద్దున్న యెంత ఘోరం జరిగిందో చూసి రాఖిమ్ ఆగా భోరుమన్నాడు. బుజ్జి మేక లేదు అని యెలా మనవడికి చెప్పడం? అక్కడ నుంచుని వుండగానే అర్సలాన్ పరిగెత్తుకుంటూ వచ్చి అడిగేడు:

''తాతా! బుజ్జి మేక యేది?''

''నీ బుజ్జి మేక యెక్కడికో వెళ్లిపోయింది'' అని రాఖిమ్ ఆగా నిట్టూర్చి చెప్పేడు. ''నిన్న సాయంత్రం నువ్వు


గేటు తోశేవుగాని తెరవలేదు. బుజ్జి మేక రాత్రంతా బయటనే వుండిపోయింది. యివాళ పొద్దున్నే జింకలు స్తెప్ మైదానంమీదనుంచి వచ్చేయి. వాటికి బుజ్జి మేక అంటే యిష్టం అయింది. అవి తమతోబాటు బుజ్జి మేకని విశాలమైన మైదానంమీదకి తీసుకుపోయేయి'' అని చెప్పేడు.


నమ్మలేనట్టూ, అయ్యో యెంత దారుణం అన్నట్టూ అర్సలాన్ కళ్ళు వెడల్పు అయేయి. వాడి కళ్లల్లో నీళ్ళు తిరగడం మొదలుపెట్టేయి.

''కాని మళ్లీ తిరిగి యెప్పుడు వస్తుంది తాతా?''

''నువ్వంటే దానికి మరీ చిరాకు కలగకపోతే వస్తుంది. యేదో వొక రోజున'' అని రాఖిమ్ ఆగా అబద్ధం ఆడేడు. తర్వాత పొయ్యి రాజెయ్యడానికి వెళ్లేడు.

అర్సలాన్ అక్కణ్ణే నుంచుని స్తెప్ మైదానంకేసి చూస్తూ వుండిపోయేడు. దూరంలో యెక్కడేనా గబగబా గెంతుతూ పోయే జింకలు, వాటి మధ్యలో తన బుజ్జి మేక కనిపిస్తాయేమోనని ఆశగా చూస్తూ వుండిపోయేడు.


ఎడారి
కథలు



“రెండు పోప్లార్ చెట్ల” నుయ్యి

కారకూమ్ యెడారి యిసిక తిప్పలమీద కులీ మామయ్యతో కలిసి వెడుతున్నాను. మామయ్య గొర్రెలకాపరి.

గొర్రెలకాపర్లు వొకో సారి మందల్ని తోలుకుని నెలల తరబడి వెడతారు. కాని యీ రోజుల్లో కారుల్లో వెడుతున్నారు, రెండేసి వారాల షిఫ్టుల్లో పని చేస్తున్నారు. అలాంటి షిఫ్టుకి మేం వెడుతున్నాం. మేం చాలా దూరం ప్రయాణం చెయ్యాల్సి వుంది. ‘‘రెండు పోప్లార్ చెట్ల’’ నుయ్యి దగ్గరికి వెళ్లాలి. యెడారిలో వున్న నూతులకి పేర్లు వున్నాయి, మనుషులకిలాగానే. యీ నూతి పక్కన రెండు పోప్లార్ చెట్లు పెరుగుతున్నాయి. ఎడారిలో వున్నవి ఆ రెండే కాబట్టి గొర్రెలకాపర్లందరికీ యిది తెలుసు. చారి ఆగా తాత మా కోసం గొర్రెలకాపర్ల శిబిరం దగ్గర యెదురు చూస్తూ వున్నాడు. ఆయన జీవితమంతా యీ యిసిక తిప్పలమీద మందలతో తిరుగుతూనే వున్నాడు. వసంతకాలం తొలి రోజుల్లోనే ఆయన ‘‘రెండు పోప్లార్ చెట్ల’’ నుయ్యి దగ్గరికి వెడతాడు. శీతాకాలం బాగా ముదిరేక గాని తిరిగి రాడు. తుర్క్మేనియాలో శీతకట్టు దీర్ఘంగా వుండదు.

తెలివైన ముసలి కుక్క అక్బాయ్, ముసలి ఒంటె బాయిర్ కూడా మా కోసం చూస్తూ వున్నాయి. చారి ఆగా ముసలాయన, అక్బాయ్, బాయిర్‌లూ ముసలివే.

ఎడారిలో వసంతం

కారకూమ్ యెడారి అంటే యిసిక తప్ప యేం వుండదనీ, నిర్జీవంగా వుంటుందనీ, వేడిగా వుంటుందనీ అనుకుంటున్నారేమో. కాని అన్ని వేళలా అలా వుండదు.

వసంత రుతువులో ప్రతి పొద, ప్రతి తుప్ప వికసిస్తాయి. యిసిక తిప్పల యేటవాలు వంపుల్లో యెర్రటి పాపీ పువ్వులు పూస్తాయి. యిక యెటు చూసినా ఆకుపచ్చగా వుంటుంది.

మేం వో పాడుబడిన నూతి దగ్గర విశ్రాంతి తీసుకుందామని ఆగేం. అక్కడ మాకు వో తాచు పాము కనిపించింది. అది పడగ విప్పింది. నాలికలు ఆడిస్తోంది. మేం దాని దగ్గరికి వెళ్లలేదు. పాములకి చట్టం రక్షణ వుంది. వాటి విషం మందులకి పని కొస్తుంది.

మాకు జింకల మంద కూడా కనిపించింది. అవి యెంత వేగంగా పరిగెడతాయి!

ధగధగ మెరిసే తురాయి వున్న పెద్ద రోలర్ పక్షి ఆకాశంలో యెగురుతూ, సుళ్లు తిరుగుతూ మా ''జీప్'' వెనకాల చక్కర్లు కొట్టడం మేం చాలా సేపు చూశేం.

మేం శిబిరం దగ్గరికి వెళ్లేటప్పటికి సాయంత్రం అయింది. సూర్య బింబం పెద్దగా, విస్తరించుకున్నట్టుగా వుంది, దూరంలో వున్న మిట్టలు తాకుతోంది. గొర్రెలకాపర్లు బొచ్చు కంబళీమీద కూర్చుని ''కౌరమా'' తింటున్నారు. ''కౌరమా'' అంటే వేయించిన మేక మాంసం. అది తింటూ టీ తాగుతున్నారు.

కులీ మామయ్యని ఆదరంగా పలకరించడానికి చారి ఆగా లేచి నుంచున్నాడు. నా భుజంమీద ఆదరంగా చెయ్యి వేశాడు.

గొర్రెలు వొకదానికి వొకటి తాసుకుని నుంచున్నాయి. యీ వచ్చిన వాళ్లెవరు చెప్మా అని చూడ్డానికి తలలు పైకి యెత్తాయి. చారి ఆగా సహాయకుడు ఒంటెని సిద్ధం చేశాడు. అది ఆహారాన్నీ, నీళ్లనీ, యితర పదార్థాలనీ స్టెప్ బీళ్లమీద వున్న శిబిరానికి మోస్తుంది. మందలు రాత్రి వేళ అక్కడ చేరతాయి. అక్కడ మేత మేసి, పడుకుంటాయి. పగటి పూట బాగా వేడిగా వుంటుంది.

కులీ మామయ్య పెద్ద బూట్లు గబగబా తొడుక్కున్నాడు. కాళ్లకి ముళ్లు గుచ్చుకోకుండా, పాములు కరవకుండా, తేళ్లు కుట్టకుండా బూట్లు కాపుదల అన్న మాట. పొరపాటున చీకట్లో వాటిమీద అడుగు వెయ్యచ్చు కదా.

''కూర్చుని కాసేపు విశ్రాంతి తీసుకో నాయనా'' అని చారి ఆగా కులీ మామయ్యతో అన్నాడు. ''ప్రయాణం చేసి అలిసిపోయి వుంటావు'' అన్నాడు.

''బాగానే విశ్రాంతి తీసుకున్నాను, చారి ఆగా. స్టెప్ బీళ్లల్లోకి వెళ్లాలి, వుండ బట్టలేకుండా వున్నాను'' అన్నాడు.

''నేనూ రావద్దా?'' అని నేను అడిగాను.

''నువ్వు రేపు నాతో వద్దువుగాని'' అని చారి ఆగా మాట యిచ్చేడు. ''యివాళ కొంచెం టీ తాగి నక్షత్రాలకేసి చూద్దాం'' అన్నాడు.

''నాకు కథ చెప్తావా?''

''అలాగే.''

చారి ఆగా కథ

సూర్యాస్తమయం అయింది. యెడారి అంతా చీకటి అలుముకుంది.

గుడారం వెనకనుంచి మా నేస్తం బాయిర్ ఒంటె వచ్చింది. నన్ను గుర్తు పట్టి నా దగ్గరికి చేరింది. నేను దాని మెడనీ, డొక్కల్నీ నిమిరేను. ఒంటె నిట్టూర్చి మోకాళ్లమీద వాలింది. అది కూడా చారి ఆగా కథ వినడానికి వచ్చింది.

చారి ఆగా మెల్లిగా చెప్పేడు. తన మాటల ధ్వనిని తనే వింటున్నట్టుగా చెప్పేడు. వో కథ పూర్తయిన వెంటనే యింకో కథ చెప్పేడు.

ముసలి అక్బాయ్ కుక్క చీకట్లోనుంచి చడీ చప్పుడూ లేకుండా వచ్చి చారి ఆగా పక్కన చేరింది. వింటూ కునుకు తీసింది. అది చాలా ముసల్ది.

''ఒకప్పుడు చాలా కాలం కితం వో పెద్ద భూస్వామి వుండేవాడు. అతనికి బోలెడు గొర్రెలు, గుర్రాలు వుండేవి. అసలు యెన్ని వున్నాయో అతనికి లెక్కే తెలీదు. కాని లోకంలో యెప్పటి మాదిరీ మనిషి ఐశ్వర్యవంతుడయే కొద్దీ, పిసినారి అయినట్టుగా అతనూ అయేడు. యీ భూస్వామి యెవళ్లేనా గొర్రెల్ని గుర్రాల్ని పోగొడితే ఆ కాపర్ల పట్ల చాలా క్రూరంగా వుండేవాడు.'' చారి ఆగా గొంతుక సెలయేటి గలగలలాగా సాఫీగా మధురంగా వుంది. ''బీదవాళ్లకే కష్టాలు తరుముకుంటూ వస్తాయి. ఓ సారి వో గొర్రెలకాపరి వూరికి వెడుతూ కొడుకుని కాపలా వుంచేడు. వొక్క రోజు లోనే ఆ కుర్రాడు రెండు గుర్రాల్ని పోగొట్టేడు.

''వాడు భూస్వామి దగ్గరికి పరిగెత్తి వెళ్లి, కాళ్లమీద పడి యేడ్చేడు:

'''ఇకి అప్తు యోక్' అని. అంటే 'రెండు గుర్రాలు పోయేయి.'

'''వెళ్లి వెతుకు!' అని అతను అరిచేడు. 'లేకపోతే నీ తాట వొలుస్తాను, చచ్చేదాకా మరిచిపోవు' అన్నాడు.

''భూస్వామి దగ్గర లావాటి కొరడా వుంది. దానికి యినప కొక్కేలు అల్లి వున్నాయి. తోడేలు కోరలకంటే భయంకరంగా వుంటాయి అవి.

''ఆ కుర్రాడు స్టెప్ బీడుమీదకి పరిగెత్తివెళ్లేడు. వెతికీ వెతికీ తెగ వెతికేడు. కాని గుర్రాలు దొరకలేదు. అప్పుడు పెద్ద మిట్టమీదకి యెక్కి ప్రార్థించేడు:

'''అయ్యో, నాకు రెక్కలే గనక వుంటే నేను గుర్రాల్ని వెతికి పట్టుకుని యింటికి తిరిగి వచ్చేవాణ్ణి, అమ్మ దగ్గరికీ నాన్న దగ్గరికీ.''

''అతను మంచి వేళలోనే ప్రార్థన చేసినట్టుంది. యేమంటే హఠాత్తుగా రెక్కలు మొలిచాయి. అతను మిట్టలన్నీ గాలించేడు, పర్వతాలన్నీ వెతికేడు. అతనివి డేగ రెక్కలు. మిగిలిన వేట పక్షులు అతని దారినుంచి తొలగిపోయేయి. అయినా అతనికి గుర్రాలు కనిపించలేదు.

'''ఇకి అప్తు యోక్! ఇకి అప్తు యోక్!' అని వొకటే రోదన.

''ఆ రకంగా వాడికి 'ఇకి అప్తు యోక్' అని పేరు వచ్చింది. అంటే కోకిల అని అర్థం.

''కోకిల గూడు కట్టుకోదు. తన గుడ్లని తను పొదగదు. అందుకు దానికి వ్యవధి లేదు. యేమంటే అది యెప్పుడూ గుర్రాల కోసం వెతుకుతూనే వుంటుంది. కోకిల వేరే పక్షుల గూళ్లల్లో గుడ్లు పెడుతుంది. దాని పిల్లలు రెక్కలు



రాగానే పెంపుడు తల్లి తండ్రుల దగ్గరనుంచి యెగిరి పోతాయి గుర్రాల్ని వెతుకుతూ. అవి వెతికీ, వెతికీ తెగ వెతుకుతాయి, కాని ఆ గుర్రాలు దొరకవు.''

మేం టీ కాచుకోవడం కోసం వేసిన మంట దాదాపు ఆరిపోయింది. ఓ చిన్న నిప్పు కణిక మాత్రం మండుతోంది. అది కూడా కొంచెం కొంచెం తగ్గి మసకబారి పోయింది. ఓ క్షణం తర్వాత అది రాజుకుని యెర్రబడి మళ్లీ మండింది.

''చారి ఆగా, యింకా పక్షుల గురించిన కథలు నీకు తెలుసా?''

చారి ఆగా కప్పులో మరింత టీ పోశాడు. యెంత నాజూగ్గా పోశాడంటే అదేదో కలలో చూసున్నట్టుగా అనిపించింది నాకు.

''ప్రతి పిట్ట గురించీ, అడివి జంతువు గురించీ యేదో వొక జానపద కథ వుందిరా, బుజ్జీ! తురాయి పిట్ట గురించి చెప్తా. నువ్వు దాన్ని చూసే వుంటావు. దాని యీకలు బాగా మెరుస్తూ వుంటాయి. రంగు రంగుల యీకలు. దానికి పింఛం కూడా వుంది.''

''ఆ, చారి ఆగా.''

''ఆ కథ యేమిటంటే'' అని చారి ఆగా మొదలుపెట్టేడు. ''ఒకప్పుడు వో ఆడమనిషి వుండేది. ఆమెకి యిద్దరు పిల్లలు. వో పిల్ల ఆమె కన్న కూతురు, రెండో పిల్ల సవతి కూతురు. కన్న కూతురుని బాగా చూడడంవల్ల బాగా యెదిగింది. సవతి కూతురు చాకిరీ చేసి పొద్దున్నుంచి సాయంత్రం దాకా రెక్కలు ముక్కలు చేసుకునేది. సవతి తల్లి ఆమెకి యెంతో పని చెప్పేది. దాంతో పాపం ఆమెకి తల దువ్వుకునే తీరుబాటు కూడా వుండేది కాదు.

''వో సారి సవత్తల్లి పాలు కాచమని పని చెప్పింది. ఆమె పొయ్యి రాజేసి, పాలు గిన్నెలో పోసి పొయ్యిమీద పెట్టింది. అవి కాగాలి కదా. యీ లోపున జడ వేసుకుందామని కూర్చుంది. తుర్క్‌మెన్ ఆడవాళ్లకి జుట్టు బారుగా వొత్తుగా వుంటుంది, వసంతరుతువులో మంచు కరిగి పారే కొత్త సెలయేటిలా.

''ఆమె జుట్టులో దువ్వెన పెడితే, దిగదే అది! సరిగ్గా అదే సమయంలో పాలు పొంగేయి. పొర్లిపోయేయి.

''సవతి తల్లి గుడారంలోనుంచి యివతలికి పరిగెత్తి వచ్చింది. సవతి కూతుర్ని పట్టుకుని బరబరా స్టెప్‌మీదకి యీడ్చుకుపోయింది.

'''నీ యిష్టం వచ్చిన చోటకి తగలడు, పనికి మాలిన ముండకానా! పాల మీగడ మాత్రం తేవాలి. అది లేకుండా మాత్రం రాకు!' అంది.

''ఆ పిల్ల యేడుస్తూ వెళ్లిపోయింది. వెళ్లీ, వెళ్లీ యెంతో దూరం వెళ్లింది. వున్నట్టుండి ఆమెకి రెక్కలు వచ్చేయి. ఆమె తురాయి పక్షిగా మారిపోయింది. ఆమె చేతులు రెక్కలు అయేయి. రంగు రంగుల బట్టలు యీకలు అయేయి. తలమీద దువ్వెన అలానే వుండిపోయింది. ఆమె నేల నాలుగు చెరగులా అప్పట్నుంచీ యెగురుతూనే వుంది. యెగురూతూ అరుస్తూ వుంటుంది:

'''హూప్, హూప్! యెక్కడ నువ్వు! పాల మీగడా!'

''శ్రద్ధ పట్టి చూస్తే తురాయి పక్షి తలమీద దువ్వెన యింకా కనిపిస్తుంది. అయినా యిప్పటికీ తల దువ్వుకునే తీరిక దానికి లేదు.''

ఉదయం

తర్వాత చారి ఆగా నాకు మెర్గేన్ల గురించిన కథ చెప్పేడు. వేటగాళ్లకి మా వాళ్లు పెట్టిన పేరు మెర్గేన్లు. వొక వితంతువు కొడుకు మహమూద్ గురించీ చెప్పేడు. మహమూద్ పాతాళ లోకంలోకి వెళ్లి దుష్ట దెయ్యం దగ్గరికి వెళ్లేడు. దెయ్యాన్ని చంపేసి, అందమైన పెరి యువతిని కాపాడి సు(ముగ్ పక్షిమీద యెగిరి వెళ్లిపోయేడు... కాని యెక్కడికి యెగిరి వెడతాడు? హఠాత్తుగా నాకు తెలిసింది, యెగురుతూ ఆకుపచ్చ పక్షి రెక్కలమీద వున్నది మహమూద్ కాదు, నేనే! నేనే యెగురుతూ వున్నాను. వో పక్క తెల్లవారుతోంది. కళ్లు తెరిచి చూస్తే యెండ నడి నెత్తి మీద వుంది.

గొర్రెలు రాత్రంతా బీటిమీద మేసి నీళ్ల కోసం తిరిగివచ్చేయి.

గొర్రెలకి బుర్రల్లేవని యెవడన్నాడో గాని వాళ్లు అన్నది తప్పు. అవి బుర్ర వున్న జంతువులే. మా మందలో వెయ్యి గొర్రెలు వుంటాయి. కాని పట్టుకి రెండు మూడు వందల గొర్రెలే నీళ్లు తాగగలవు. మొదటి మంద తాగే దాకా మిగిలినవి పక్కకి తొలిగి నుంచుంటాయి. తర్వాత వాటి వంతు పూర్తయేదాకా అలా పక్కన నుంచుంటాయి. కలిసి అన్నీ యేక మొత్తంగా అక్కడికి వెళ్లాయి, యేక మొత్తంగానే కలిసి విశ్రాంతికి వెళ్లాలి.

కుక్క అక్బాయ్ పరిగెత్తుకుంటూ నా దగ్గరికి వచ్చింది. నా భుజంమీద వో పంజాని పెట్టింది. చారి ఆగా నన్ను పిలుస్తున్నాడని అది చెప్పడం అన్నమాట.

గుహ

చారి ఆగా నేనూ కులీ ఆగా కోసం చూస్తూ కూర్చున్నాం. ఆవేళ మామూలు కంటే ఆలస్యం అయింది. ఆఖరికి మందలు తోలుకుని కులీ ఆగా రావడం కనిపించింది. కులీ మామయ్య నడక తీరుని బట్టి ముందు రోజు రాత్రి యేదో జరిగి వుంటుందని చారి ఆగా అన్నాడు.

ఆయన వూహించింది నిజమే. ఆ రాత్రి వో గొర్రె ''కుర్దాక్''ని వో తోడేలు కొరికేసింది. కురువ గొర్రెల లావాటి బొచ్చు తోకలని కుర్దాక్ అంటారు.

''వెళ్లి తోడేలు గుహ చూడాలి'' అన్నాడు చారి ఆగా.

''కాని యెక్కడుంది అది?'' అని నేను అడిగేను. ''తోడేలు గొర్రె తోకని యెలా కొరికింది? గొర్రెకేమీ ఫరవా లేదు కదా?'' అని అడిగేను.

''గొర్రె బతుకుంది. గుహని చూసే అవకాశం వస్తుంది రేపు నీకు. 'వొక సారి చూడ్డం వంద మాటల పెట్టు' అని స్తెప్ బీళ్ల సామెత వుంది కదా'' అన్నాడు చారి ఆగా.

మర్నాడు ఉదయం స్తెప్ బీట్లోకి వెళ్లాం. చాలా దూరం వెళ్లాలో యేమిటో అనుకున్నాను నేను. రెండు కిలోమీటర్లు నడిచేటప్పటికి చారి ఆగా నాకేసి తిరిగి ''నేలమీద బోర్లా పడుకో, కదలకు'' అన్నాడు. ఆయన నా పక్కన బోర్లా

పడుకున్నాడు. బైనాక్యులర్స్ తీసి కొంచెం ముందుకు వాలి నన్ను డేకమని సైగ చేశాడు. ''అవి యువతలికి వస్తున్నాయి'' అని మెల్లిగా చెవిలో చెప్పేడు. రెండు బాగా యేపుగా పెరిగిన తోడేళ్ళు నాకు కనిపించేయి. వాటి పిల్లలూ కనిపించేయి. ఆడతోడేలు మగతోడేలుని పొడిచి, ముందరి పంజాలతో గీరింది. కాని మగతోడేలు యేమీ చిరాకు పడలేదు. యేమిట న్నట్టు నేను చారి ఆగాకేసి చూశేను. ''మగతోడేలు చాలా తక్కువ ఆహారం తెచ్చింది. ఆడతోడేలు పిల్లల్ని వదిలి వెళ్ల లేదు. మొత్తం నాలుగింటినీ మగతోడేలే పోషించాలి. ఆకలిగా వున్న తోడేళ్లకి గొర్రె తోకలు యే మూలకి చాలతాయి?''

''తోడేళ్ల కుటుంబం జోలికి పోవడం లేదేం?'' అని అడిగాను.

''తోడేళ్లవల్ల కూడా లాభం వుందని గ్రహించేరు. యీ తోడేళ్ల కుటుంబం వల్ల మనకి బాధలేదు. తోడేళ్ళు మామూలుగా యిరుగుపొరుగుని యిబ్బంది పెట్టవు. యీ మగతోడేలు దిక్కు తోచక మన మందమీద దాడి చేసిందంతే. ఆ పిల్లలు పెద్దవయే దాకా ఆగు, అప్పుడు వాటి వెంట బడదాం. కాని వాటిని ప్రాణంతోనే పట్టుకోవాలి. వాటిని మచ్చిక చేసుకోవచ్చు.''

''తోడేళ్ళు మన గొర్రెల్ని కాపలా కాయడం!'' అని నేను ఆశ్చర్యపోయేను. ''యెంత తెలివైన తాత మా తాత! తోడేళ్ళు ఆకలికి మాడవు, మా గొర్రెలూ భద్రంగా వుంటాయి'' అనుకున్నాను.

పుచ్చకాయలు

చారి ఆగా పుచ్చకాయల పాదు పెట్టేడు. యెడారిలో పండే పుచ్చకాయలు మహా తియ్యగా వుంటాయి.

''యెడారిలోకి వెళ్లి గొర్రెలకాపర్లకి యీ యేడారి సాయం చేద్దురుగాని'' అని చారి ఆగా పని చేస్తూ రెట్టించేడు.

ఆయన పుచ్చకాయల విత్తనాలని యేదో ముళ్లకొమ్మకి అంటుకట్టి, పాత యిసిక పర్ర యేటవాలులో మరో చిన్న మడి చేశాడు.

యెడారిలో యితర మొక్కలు పెరిగే చోట పుచ్చకాయల పాదుల్ని పెట్టడం దండుగ. అక్కడ నీడ బాగానే వుంటుంది కాని ఆ చెట్లకింద పుచ్చపాదులు బతకవు. గట్టిగా వుండే యెడారి చెట్లు నేలలో వుండే ప్రతి నీటి బొట్టునీ పీల్చేస్తాయి.

''మీరు మొదట చెయ్యవలసింది జాగాని యెంచుకోవడం'' అని చారి ఆగా సూచనలిచ్చేడు. ''రెండవ విషయం

తాబేళ్ల బెడద, చెవుల పిల్లుల బెడద లేకుండా చూడడం, యెండ కూడా తగలకూడదు. మొక్కలకి సరైన నీడ లేకపోతే వేడి యినక వాటిని వేళ్లల్లో కత్తెరలాగా కత్తిరించి వేస్తుంది. కొమ్మల్ని తీసుకుని వో కంచె వెయ్యాలి, తాబేళ్లు రాకుండా. సరే చెవుల పిల్లుల సంగతి గుంటనక్కలు చూసుకుంటాయనుకో. గుంటనక్కలకి కూడా పుచ్చకాయలు యిష్టమే. వాటికి గింజలే కాదు రసంకారే కండా యిష్టమే. చెవుల పిల్లులకి గింజలు యిష్టం, అందుకని విత్తనా లని వాసన పట్టి తవ్వేస్తుంది, యినక లేచిపోయింది. కాని వెంటనే వచ్చేస్తుంది గుంటనక్క. దాని మెడ పుచ్చుకుని గదమాయిస్తుంది. 'శుంఠా! విత్తనాలని తవ్వకు. పుచ్చకాయలు పండేక బాగా తినచ్చు. నీకు గింజల్ని వదిలిపెడతాలే. యేది మంచిదో, చెడ్డదో తెలుసుకోకపోతే నిన్ను ముందు నేను భోజనం చేస్తాను' అంటుంది.''

ఆవేళ చారి ఆగా మంచి ఉల్లాసంగా వున్నాడు.

''తాతా, గొర్రెల్ని మేపడానికి యెప్పుడు తీసుకెడతావు?'' అని అడిగేను.

''యివాళే వెడదాం, తయారవు. స్టైప్ బీళ్లల్లో బాగా వుంటుంది యివాళ. యివాళ పౌర్ణమి.''

సాయంత్రం అయే వేళకి తన కాళ్లు లాగుతున్నాయని చారి ఆగా అనడం మొదలుపెట్టేడు. నా ఉత్సాహం నీళ్లు కారిపోయింది.

కాని చారి ఆగా అన్న మాట నిలబెట్టుకున్నాడు.

''నువ్వెళ్లి కులీ మామకి సాయం చెయ్యి'' అన్నాడు.



మందతో

కులీ మామ నాన్న కూడా గొర్రెలకాపరే. ఆయన తండ్రీ, తాతా కూడా గొర్రెలకాపర్లే.

కులీ ఆగా కొంకి క్రమీద ఆనుకుని యెడారి మధ్యలో నిలబడ్డాడు. ఆయన వొంటరి విగ్రహం భారీగా మహా కాయుడిలాగా వుంది. ఆయనకి యెదురుగ్గా కొండల పైన వాలిపోతున్న సూర్య బింబం వుంది.

మేం గొర్రెల మంద వెనక్కాలే యీడ్చుకుంటూ నడిచాం. మాతోబాటు సాకర్, బాస్సర్ అనే కుక్కలు వున్నాయి. సూర్యుడు కొండల వెనక దిగిపోయేడు. కాని యినక యింకా ఆవిర్లు చిమ్ముతూనే వుంది.

కులీ ఆగా నిలబడి, మందకి ముందు వెడుతూ వున్న మేక మువ్వలు గణగణ మనడం విన్నాడు. మేక పోతు కుడి

వేపు తిరిగింది, మంచి మేత దక్కుతుందని గమనించింది. దాని వెనక్కాలే గొర్రెలు మేత కోసం వెళ్ళాయి. కులీ ఆగా కొన్ని అడుగులు వేసి అప్పుడు ఆగిపోయేడు. కొంకి కర్రమీద ఆనుకుని, అస్తమయ సూర్యునికేసి చూస్తూ వుండి పోయేడు. అరుణ కిరణాలు కడసారిగా వెలిగి విశ్రాంతిలో మణిగిపోయేయి. దినకరునికి విశ్రాంతి. కాని మాకు పని అప్పుడే మొదలవుతోంది.

''రేపు కలుసుకునే దాకా సెలవ్'' అని సూర్యుడ్ని చూసి కులీ ఆగా అన్నాడు. మేం నడిచి వెడుతూ వున్న ఆ రెండు గంటల్లోనూ ఆయన అన్న ముక్కలు ఆ రెండే. మైదానంమీద చీకట్లు పరుచుకున్నాయి. చీకట్లతోబాటు యేదో వింత భయాలు వచ్చేయి. పిసరు అలికిడికి నేను బెదిరిపోయేను. కొంప తీసి తోడేళ్ళు మందమీదకి వస్తున్నాయేమో.

కాని కొంచెం సేపట్లోనే కొండలమీద చంద్రోదయం అయింది. కులీ మామ గాడిదని మందలోనుంచి తీసుకు వెళ్లి దాని మెళ్లో వో గంట కట్టేడు. గాడిద మనుషుల కోసం, కుక్కల కోసం నీళ్లనీ, తిండినీ మోసుకు వచ్చింది. అది గనక రాత్రి తన దారిన తిరుగుతూ పోతే మాకు పస్తే.

ఆఖరికి యిసిక చల్లారింది. చల్లని తెమ్మెర కమ్మింది. వెన్నెలలో యిసిక పర్రలు తళతళ మెరుస్తున్నాయి, పాల నురగతో తడిపినట్టున్నాయి. యెడారిమీద యెంతో తేజోవంతంగా వుండి, కాళ్ల కింద యిసిక రేణువులు మంచు తరకల్లాగా మెరుస్తున్నాయి.

మంద గొర్రెలు చీకూ చింతాలేక మేస్తున్నాయి.

కుక్కలు కులీ ఆగా కాళ్ల దగ్గర పడుకున్నాయి. తలల్ని ముందు పంజాలమీద వాల్చుకున్నాయి. అవి కళ్లు మూసుకున్నాయి గాని వాటి చెవులు విరామం లేకుండా అల్లల్లాడుతూనే వున్నాయి. పిసరు అలికిడి అయితే, గాలికి ఆకులు కదిలినట్టు కదులుతున్నాయి. కుక్కలు అంత ప్రశాంతంగా వుండడానికి కారణం ఆ రాత్రి ప్రకాశమానంగా శోభించడం. అలాంటప్పుడు యే తోడేలూ మందమీదకి వురికే ధైర్యం చెయ్యదు.

అర్ధరాత్రి వేళకి గొర్రెలు మేత ముగించాయి. ఒక దానికొకటి తాసుకుని పడుకున్నాయి.

కులీ మామ గాడిదని మందలోనుంచి నడిపించుకు వచ్చి తిండి సరుకులు దించేడు. తర్వాత కొన్ని యెండు కొమ్మలు యేరి మంట రాజేశాడు.

ఓ రాగి పాత్రలో కాసిని నీళ్లు పోసి కాచడానికి మంటమీద పెట్టాడు. కాసిని నీళ్లని కుక్కల కోసం రబ్బరు పాత్రలో పోశేడు. సాకర్ నుంచుని తన వాటా నీళ్లు తాగింది, బస్సార్ బద్ధకంగా పడుకునే చప్పరించింది.

మంట చిన్నదే అయినా వేడి బాగానే వుంది.

నీళ్లు కళపెళమన్నాయి. కులీ మామ చిక్కని టీ కలిపేడు. దాంతో నా నిద్రమత్తు వదిలింది.

మంటకి పదడుగుల దూరంలో వో గుట్టమీద కూర్చుని టీ తాగాం. మంట దగ్గర యెక్కువ సేపు కూర్చోవడం ప్రమాదకరం. పాకే ప్రాణులన్నీ అక్కడికి చేరతాయి. విషపూరితమైన తేళ్ళు, విషంకక్కే యెడారి సాలిపురుగులు అక్కడ చేరతాయి.

కడపటి యెండు పుల్లలు కూడా జ్వాలా జిహ్వలు చాచి చల్లారిపోయేయి, చుట్టూతా ప్రతీదీ మణిగింది. వెన్నెల కూడా మసకబార నారంభించింది. నక్షత్రాలు మిలమిల మెరిసేయి. కుక్కలు గస్తీ ప్రారంభించేయి. మంద జోగుతోంది.

కులీ మామ గొర్రెలకాపర్లకి గట్టిదిండు అయిన కొంకి కర్రని తలకింద పెట్టుకు పడుకుని మరో సారి ఆకాశం

కేసి చూశేడు. నేనూ ఆకాశంకేసి చూస్తున్నాను. ధృవ నక్షత్రం కనిపించింది. సప్తర్షి మండలం జారుతూ మిలమిల మెరిసింది. ప్రభాత సమయానికి సప్తర్షి మండలం ధృవ నక్షత్రాన్ని దాటిపోతుంది. వృషభరాశి నక్షత్రాలు అప్పుడు యిసిక పర్రలమీద కనిపిస్తాయి.

గొర్రెలకాపరులకు ఆకాశం, నక్షత్రాలు ఖగోళశాస్త్రజ్ఞుల అంత బాగానూ తెలుసు.

ఓ సారి చారి ఆగా నాకు యిలా చెప్పాడు:



"చూడు, బాబూ! నువ్వు యెడారిని నీ వాసం చేసుకోవాలనుకుంటే అద్దంలో నీ ముఖం చూసుకోగలిగినంత బాగా దాన్ని గురించి తెలుసుకుని వుండాలి. ఆకాశం గురించి నీ వేళ్లని చూసుకున్నంత బాగా యెరిగి వుండాలి. ఆకాశం గురించి తెలుసుకోలేకపోతే యెడారి గురించి తెలియదు."

గొర్రెలు కదిలి, లేచి, మళ్లీ మేత మొదలుపెట్టాయి. మెల్లిగా నూతి వేపు మళ్లుతూ మేశాయి. కులీ మామా, నేనూ లేచి వాటి వెనక్కాలే వెళ్లేం.

ఆకాశం తేజోవంతమవుతోంది. గాలిలో కమ్మని యిసిక ధూళి తావీ, గరిక తావీ వ్యాపించేయి.

పొద్దున్నే చారి ఆగా మమ్మల్ని నెగడు పక్క కూర్చుని పలకరిస్తాడు, చక్కని ఆకుపచ్చ టీ యిస్తాడు.

"యేమిరా, కుర్ర గొర్రెలకాపరీ!" అని నన్ను పలకరిస్తాడు.

ఒంటె శత్రువులు

పులికోచ కుడితే యమ బాధగా వుంటుంది, తేలు కుడితే ప్రాణాంతకంగా వుండచ్చు. మనిషికి యింత ప్రమాద కరంగా వుండే యీ కీటకాలు ఒంటెని యేమీ చెయ్యలేవు. అయినా ఒంటెకి కలుగులు చేసే జంతువులు పెద్ద గండమే. యీ బొరియ జంతువులు మనకేం అనిపించవు కాని ఒంటెకి అవి తమాషా కాదు. వాటి విశాలమైన సొరంగ గృహాలమీద అడుగేసి ఒంటె తొట్రుపడచ్చు, కాలు విరగ్గొట్టుకోవచ్చు.



పెద్ద బల్లి

పెద్ద బల్లిని యెడారి మొసలి అంటారు. భయంకరంగా దవడలు ఆడిస్తుంది. కాని దాని దగ్గరికి వెడితే పారిపోతుంది. రోహిణీకార్తె వేసవి రోజుల్లో యీ రాక్షస బల్లులు తాబేలు గూళ్లల్లోకి సొరంగాలు తవ్వుకుంటూ పోయి చల్లని వాతావరణానికి సేద దీరతాయి.

కొన్ని బల్లులు మీటరు, మీటరున్నర పొడుగు పెరుగుతాయి. దేనికేనా కోపం వచ్చిందో భయంకరంగా బుసకొడు తుంది. కత్తి కూడా దాన్ని యేమీ చెయ్యలేదంటారు.

పెద్ద బల్లులు పందికొక్కుల్ని తింటాయి. కాని దానికి యిష్టమైన తిండి పక్షుల గుడ్లు.

జిక్ – జికి

జిక్ – జికి చాలా వింతగా వుండే పక్షి. చెట్లమీదా, నేలమీదా గూళ్లు కట్టుకోకుండా పల్లాల్లో పాడుబడ్డ నూతుల్లో లేదా అలాంటి పల్లాల్లో కట్టుకుంటాయి యీ పక్షులు. ఆకాశం పడిపోతుందేమోనని వాటికి భయమట. జాగ్రత్తగా గూట్లో కూర్చున్నా జిక్ – జికి ముందు కాళ్లు పైకి యెత్తి నిద్రపోతుంది. వొకవేళ ఆకాశం నిజంగా కూలిపోతే అలా యెత్తి పట్టుకోవచ్చని దాని వూహ.

మైనా

యెడారిలో వుండే జంతువులన్నిటి గురించీ చెప్పుకోవడం కష్టం. ఉదాహరణకి యిసిక పిల్లి, యిసిక బొవురు పిల్లిలాంటివి వున్నాయి.

యెన్నో రకాల పక్షులు యెడారిమీదకి వలస వస్తాయి. కాని యేటికేడాదీ యెడారిమీదే కాపరం వుండేవీ వున్నాయి. మేగ్ పై, యెడారి పిచిక, గుడ్లగూబ, యెడారి కాకి లాంటివి... కాని ఇండియన్ మైనా పిట్ట అందరికీ యిష్టమే.

మైనా కోకిల పిట్ట జాతిది. చక్కగా పాడుతుంది, నేర్పితే మాట్లాడుతుంది కూడా.

వో టీ దుకాణం యజమాని ఇబ్రాగిమ్ అని వుండే వాడట. అతని దగ్గర వో మైనా వుండేదట. యెవళ్లైనా వస్తే ''ఇబ్రాగిమ్, యెవళ్లో వచ్చారు'' అని పిలిచి చెప్తుందట. ఆ వచ్చిన వాళ్లు వెళ్లిపోయేటప్పుడు ''ఇబ్రాగిమ్, డబ్బులు తీసుకో'' అని చెప్పేదిట.

పాములు

యెడారిలో చాలా పాములున్నాయి. కాని అన్నీ విషపూరితం అయినవి కావు. యెడారి చిలువ, సిల్వర్ యారో రెండూ నిరపాయకరమైనవి.

ప్రమాదకరమైనవి తాచు పాము, రకరకాల కట్ల పాములూనూ. భయంకరమైనవైనా అవసరం అయిన యీ



రకాల పాముల కోసం యెడారి గాలించేవాళ్లు లేకపోలేదు. పాముల సంఖ్య తగ్గిపోతోందని యిటీవల పాములు పట్టే వాళ్లు అంటున్నారు. యిది జాగ్రత్త పడాల్సిన విషయమే. యేమంటే పాముల విషం అనేక వ్యాధులకి విరుగుడు.

కారకూమ్ యెడారిలో వుండే మరో రకం పాము గంటల పాము. రాత్రిళ్లప్పుడు వింత, హెచ్చు స్థాయి గంటల చప్పుడు వినిపిస్తుంది. వెంటనే యెడారిలో వుండే జీవులన్నీ సావధానం అయిపోతాయి. గంటల పాము వేటకి బయల్దేరింది!

గుండ్రటి తల బల్లి

తుర్క్మేనియాలో దీన్ని సారికెల్ నెజె అంటారు. అంటే ''ద్వేషపూరిత వదరుబోతు'' అని. దీనికి పసుపు—జేగురు రంగు కలిసిన చర్మం వుంటుంది. యిది యిసికలో, వొక రకం కొమ్మల్లో వుంటుంది. దీన్ని వదరుబోతు అని అనడం యెందుకంటే తెల్లవారిం దగ్గర్నుంచి చీకటి పడేదాకా సూర్యుణ్ణి తిట్టిపోస్తూ కూర్చుని యేమీ చెయ్యదు.

సారికెల్ నెజె చప్పుడు చెయ్యకుండా తిట్టిపోస్తూ వుంటుంది. యిసక దీన్ని కమ్మేస్తుంది. కాని దీని కోపం దీన్ని బయట పడేస్తుంది. దీని మెడలో చిన్న సంచీ వేలాడుతూ వుంటుంది. వేణ్ణీళ్లు పోసినట్టుగా గుడగుడ మంటూనే వుంటుంది.

సూర్యుడు అస్తమించేక దీనికి సంబరం వస్తుంది. తన శాపనార్థాలవల్లే సూర్యుడు పోయేడని సంబరం.

కాని మర్నాడు సూర్యుడు ఉదయించగానే యిది మళ్లీ తిట్లు లంకించుకుంటుంది. దీని కోపంవల్ల శత్రువులకి వెల్లడి అయిపోతుంది, అయినా వదలదు.

సూర్యుడు పడమటన దిగగానే సారికెల్ నెజె అదే ఆఖరి మాటు అనుకుంటుంది. కాని తెల్లవారితే మళ్లీ యిదే కథే.

సూర్యాస్తమయం

మకిలి పట్టిన యిత్తడి తప్పెటలాగా పెద్ద సూర్యగోళం అనంతమైన యిసిక మైదానం పైన వూగుతోంది. పగలంతా నిర్దాక్షిణ్యంగా పేల్చేసింది. ఆకాశంమీద తెల్లని బూడిద రంగు మసక పగలంతా కమ్ముకునే వుంది. కాని సూర్యాస్తమయం అయే వేళకి వొక హఠాత్పరివర్తన వచ్చేస్తుంది. ఆకాశం నీలంగా అవుతుంది. పగటి పూట సెగ తగ్గి చల్లదనం వస్తుంది.

సూర్యాస్తమయం అవబోయే వేళలో చిన్న యిసిక రేణువులు మిలమిల మెరుస్తాయి. కాకలెత్తుతూ వున్న యిసిక గుట్టలు చల్లబారతాయి. రాత్రివేళకి చల్లని గాలి కారకూమ్ మిట్టలమీద వీస్తుంది. యిసిక తిప్పలు మళ్లీ జాగృతం అవుతాయి. గరికలు, కొమ్మలు గుసగుస లాడుకుంటాయి.

కాని అలా జరిగేది రాత్రి, తేజోవంతమైన పెద్ద దక్షిణ నక్షత్రాలు యెడారి యిసిక తిప్పలపైన యెక్కి వచ్చినప్పుడు. కాని యిప్పుడు...

ఓ క్షణకాలం పాటు ప్రతీదీ ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుంటుంది. సూర్యాస్తమయ అద్భుతాన్ని వూపిరి ఉగ్గబట్టుకుని దర్శిస్తాం.

సూర్యుడు సుదూర యిసిక మిట్టలని అందుకుంటాడు. పడమటి దిక్కున వాలిపోయే ముందు కడపటి అరుణ వీక్షణ కారకూమ్ యిసిక గుట్టలమీద సారిస్తాడు. సూర్యాస్తమయం కాగానే చీకటి కమ్ముకుంటుంది. సూర్యోదయం పగలుకి వైతాళిక అవుతుంది.




అద్భుత కథలు



షిర్దాక్, యార్తిగులక్

మోసం, వంచన కావించేరో
దొంగని గుట్టుగ కాపాడేరో
వచ్చును త్వరలో తలుపును తట్టును
యార్తిగులక్ మీ భరతం పట్టును.

యిలా పాడుకుంటూ వచ్చేది యెవరో కాదు, యార్తిగులక్ తనే! ఆవేళ అతను మంచి హుషారుగా వున్నాడు, అంటే యెవడో దొంగ వెధవకి బుద్ధి చెప్పేడన్న మాట.

యార్తిగులక్ హుషారుగా కచ్చా రోడ్డుమీద అంగలు వేస్తూ నడిచేడు. అతని పాట భరద్వాజ పక్షి కూతలాగా ఖంగుమని మోగింది.

హఠాత్తుగా అతను పాట ఆపు చేసేశాడు. రోడ్డు పక్క చిన్న మిట్టమీద వో చిన్న మనిషి కూర్చున్నాడు. యార్తిగులక్ కంటే వో బెత్తెడు యెత్తు తక్కువ వుంటాడు.

''నమస్కారం'' అని యార్తిగులక్ ఆశ్చర్యంగా ఆ చిన్న మనిషికేసి చూస్తూ పలకరించేడు.

''నమస్కారం'' అన్నాడా మనిషి.

''చూడు మిత్రమా, నన్ను యార్తిగులక్ అంటారు. మరి నువ్వెవరో?'' అన్నాడు.

''నన్ను షిర్దాక్ అంటారు.''

''గుడ్డ కుట్టిన టోపీ మనిషివి నువ్వే నన్న మాట?''

''ఆఁ.''

''యెక్కడికేమిటి ప్రయాణం?''

''మేక నొక దాన్ని అమ్ముదామని.''

''యేదీ, మేక యెక్కడ?''

''వొకతను నా దగ్గరికి వచ్చి 'నీ మేక నిచ్చి మేక పిల్లను తీసుకుంటావా నీకు ప్రయాణం సులభంగా వుంటుంది' అని అడిగేడు. నేను అలాగేనన్నాను.''



''అప్పుడు నువ్వు మేక పిల్లని యిచ్చి కోడిపుంజుని తీసుకున్నాననీ, కోడిపుంజుని యిచ్చి గుడ్డుని తీసుకున్నాననీ, దాన్నిచ్చి సూదిని తీసుకున్నాననీ అంటావు.... నాకు తెలుసు ఆ కథ.''

''నేను కోడిపుంజుని యిచ్చి గుడ్డుని తీసుకోలేదు'' అని షిర్దాక్ కోపంగా అన్నాడు. ''దాన్నిచ్చి కుందేల్ని తీసుకున్నాను. దాన్నిచ్చి యీ అందమైన టోపీని తీసుకున్నాను. దీన్ని అందరూ షిర్దాక్ అని పిలుస్తారు.''

''అయితే నే అనుకున్నది రైటే. మేకని యిచ్చి టోపీ తీసుకున్నావు. కాని యీ బేరంలో నీకు పేరు కొత్తది వచ్చింది.''

''నిజమే యార్తిగులక్. షిర్దాక్ అనే పేరు గిర్దెనెక్ కంటే బాగుంటుంది కదా.''

యిక్కడ కొంచెం వివరించాలి. గిర్దెనెక్ అంటే తుర్కమేనియన్ భాషలో 'పొట్టి' అని అర్థం.

''నీ పేరు మార్చుకున్నాక పొడుగు యెదిగినట్టు గుర్తించావా?'' అని యార్తిగులక్ అడిగేడు.

''నిజమే. అయినా రుజువు చేసుకుందాం. కొలుచుకుందాం పట్టు.''

యిద్దరూ వెనక్కి తిరిగి వీపులు ఆనుకున్నారు. షిర్దాక్‌కి తను పొట్టిగా వున్నట్టు అనిపించింది. మునివేళ్లమీద లేచేడు. యార్తిగులక్‌తో సరిసమానంగా వచ్చేడు.

''చూశావా!''

''ఆ, చూశేనంతా.''

యిద్దరూ పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వి విశ్రాంతి తీసుకుందామని కూర్చున్నారు.

''యార్తిగులక్, నీకు ప్రయాణాలంటే మహాసరదా అని విన్నాను'' అని షిర్దాక్ మాట కదలేశాడు. ''చెప్పు, మనలాటి పొట్టివాళ్లం ఆట బొమ్మలతో ఆడుకోగల చోటు వుందేమో నీకు తెలుసా? యిక్కడ అవన్నీ చాలా పెద్దవిగా వున్నాయి. అసలు కాళ్లు అందే సైకిలు నాకు దొరకలేదు.''

''కార్లో వెళ్లడం మెరుగు. అంతకంటే విమానంలో వెళ్లడం మెరుగు. చాలా వేగంగా వెడుతుంది'' అన్నాడు యార్తిగులక్.

''కాని సైకిలు అయితే యెవళ్లనీ యిబ్బంది పెట్టడం వుండదు'' అన్నాడు షిర్దాక్.



షిర్దాక్, దుర్దిలి

చిన్న పిల్లాడు యేడుస్తున్నాడు. పెద్ద పిల్లలు వాడి బాణం విరగ్గొట్టేరు.

''గొప్ప వీరుడివిరా! యేదో చిన్న వస్తువు పోయినంత మాత్రాన భోరుభోరున యేడుస్తావూ? నెత్తిమీద నీళ్ల కుండ!'' అని షిర్దాక్ కోపంగా అన్నాడు.

ఆ కుర్రాడు చొక్కా చేత్తో కన్నీళ్లు తుడుచుకుని చుట్టూతా చూశేడు.

''నేనిక్కడ వున్నాను'' అని షిర్దాక్ మునివేళ్లమీద లేస్తూ అన్నాడు.

''అబ్బ! యెంత అద్భుతమైన జీవి! అచ్చం మనిషికిలాగానే! యెలాంటి టోపీ!'' అని కుర్రాడు సంతోషంతో అరిచేడు. తన బాణం విరిగిపోయిన సంగతి మరిచేపోయేడు.

''నేను జీవిని కాదు. నేను షిర్దాక్‌ని.''

''షిర్దాకా?''

''అవును. నీ పేరేమిటి?''

''నన్ను దుర్ద్రిలి అంటారు'' అన్నాడు.

ఆ కుర్రాడి కళ్లు మెరిశాయి. అలాంటి ఆట వస్తువుని అతను అంతకు ముందెన్నడూ చూడలేదు. అది మాట్లాడుతోంది, కదుల్తోంది, వాదిస్తోంది కూడా! ''నిన్ను పైకి యెత్తనా?''

''కానీ'' అని షిర్దాక్ కుర్రవాడు చాచిన అరిచేతిమీదకి యెక్కుతూ అన్నాడు.

దుర్ద్రిలి ఆ చిన్న మనిషిని తన ముఖందాకా యెత్తిపట్టుకున్నాడు బాగా చూడవచ్చని. షిర్దాక్ యెగిరి గెంతుతూ పాట పాడేడు.

అక్కడ వున్నాడొక షిర్దాక్
అక్కడ వున్నాడొక దుర్దాక్
యిద్దరు స్నేహితులయ్యేరు
ఆనందంగా జీవించేరు.

''మనం స్నేహితులంగా వుండచ్చు'' అని దుర్ద్రిలి ప్రతిపాదించేడు. కొన్ని క్షణాలు ఆలోచించి ''నువ్వు నిజంగా నిజమైతేనేలే'' అన్నాడు.

''అయ్యో, నేనెందుకు నిజమైన మనిషిని కాదు'' అని షిర్దాక్ వొక కాలి తర్వాత మరో కాలు యెత్తి గెంతుతూ అన్నాడు.

''అయ్యో పడతావు!'' అని దుర్ద్రిలి హెచ్చరించేడు భయంతో.

''నాకు యేం కాదు'' అని షిర్దాక్ గోలగా గొప్పలు పోయేడు. ''నేనో చెట్టు పైనుంచి పడ్డాను, వో సారి గాడిద మీదనుంచి కూడా పడ్డాను'' అన్నాడు.

దుర్ద్రిలి షిర్దాక్‌ని జాగ్రత్తగా నేలమీదకి దించేడు. వున్నట్టుండి దుర్ద్రిలికి విచారం ముంచుకు వచ్చింది.

''యేం పెదాలు విరుస్తున్నావ్?'' అని దుర్ద్రిలి బిత్తరపోయి అడిగేడు.

''మనం నిజంగానే మిత్రులమా?''

''యెందుక్కాదు?''

''అయితే మా యింటికి వచ్చి నాతో వుంటావా?''

''మీ యింటి దగ్గర యేం వుంది?''

''ఆడుకుందాం. నీక్కావాలంటే వో పుస్తకం కూడా చదివి వినిపిస్తా... నాకు చదవడం వచ్చును.''

''సరే అయితే. వెళ్లి పుస్తకం చదువుదాం, అది సరదాగా వుంటే'' అని షిర్దాక్ వొప్పుకున్నాడు.

అది అద్భుత కథల పుస్తకం. దాన్ని గుడ్డిదాపుగా తెరిచేడు. అక్కడ గాడిద చెవుల రాజుగారి కథ వుంది. దుర్ద్రిలి దాన్ని చదివేడు. రాజుగారి మంగలికి ఆ పరమ రహస్యం తెలుసు. తను యెవళ్లకీ యీ రహస్యం చెప్పలేనే అనేది అతన్ని బుర్రలో దొలి చేసింది. యీ ముక్క అతను యెక్కడన్నా పాక్కితే తల తీయించేస్తానని రాజు బెదిరించేడు. అంచేత పాపం ఆ మంగలి పాడు పడిన ఖాళీ నూతి దగ్గరికి వెళ్లి యీ రహస్యం వెళ్ల గక్కేడు. కాలం గడిచింది. అక్కడ

వెదురు పెరిగింది. ఓ గొర్రెలకాపరి అటు వచ్చేడు. వెదురు కోసి వో బూరా తయారుచేశాడు. ఆ బూరా రాజుగారివి గాడిద చెవులు అన్న రహస్యాన్ని కక్కేసింది, గొర్రెలకాపరికీ, సర్వలోకానికీ అది బట్టబయలైపోయింది.

''మంచి బాగా బోధించే కథే. దుర్ద్దిలి నువ్వు రహస్యం దాచగలవా?'' అన్నాడు షిర్దాక్.

''ఆఁ, దాచగలను.''

''బాగుంది. కాని గుర్తుంచుకో, దర్ద్దిలి. మన స్నేహం గురించి నువ్వు యెవళ్లకన్నా చెప్పావో నేను మాయమై పోతాను.''

''యెలా?''

''యిలా'' అంటూ రెప్పపాటులో ఆ చిన్న మనిషి మాయమైపోయేడు.

''షిర్దాక్, షిర్దాక్'' అని దుర్ద్దిలి వొక్క పెట్టున అరిచాడు.

''యిక్కడ వున్నా, అంత గట్టిగా అరవకు'' అన్నాడు షిర్దాక్. షిర్దాక్ అదే చోట్లో చెవులు మూసుకుని నుంచున్నాడు.

''మళ్లీ మాయమైపోకేం'' అని దుర్ద్దిలి బతిమాలేడు. ''నేను బెల్లం కొట్టిన రాయిలా వుంటాను. నువ్వు కావాలంటే నీకు బాగా యిష్టమైన కథని చదివి వినిపిస్తాను. అది కారల్‌సన్ గురించి. దీనికి ముగింపు లేదు, కాని చదివి వినిపిస్తాను'' అన్నాడు.

''ముగింపు లేకపోవడమేమిటి?''

''మా తమ్ముడు చింపేశాడు. వాడింకా కుర్రాడు. కాని అది చాలా ఆసక్తిగా వుంటుంది, ముగింపు పోయినా ఫరవా లేదులే.''

''కాని కథ యెలా అంతం అవుతుందో తెలుసుకోవాలని వుండదా?''

''ఆఁ!''

''సరే, ప్రస్తుతానికి సెలవు. నీకో కొత్త పుస్తకం చూసి పెడతాలే'' అన్నాడు షిర్దాక్.

మాట తప్పని మనిషి

షిర్దాక్ వెళ్లిపోగానే దుర్ద్రిలి యింట్లోనుంచి దూసుకుంటూ బయటికి వెళ్లేడు. చిత్రం! అతనికి వో చిన్న అద్భుత వ్యక్తితో పరిచయం అయింది. నిజంగా అది అద్భుతమే. కాని షిర్దాక్ గురించి యితరులకి చెబితే వాళ్లు నమ్మరు. దుర్ద్రిలి సైకిలు యెక్కి గుర్రాలశాలకి తన తండ్రి పనిచేస్తూ వున్న చోటకి వెళ్లేడు. దుర్ద్రిలి, అతని నాన్నా మంచి స్నేహంగా వుంటారు.

''నాన్నా!'' అని దుర్ద్రిలి గుర్రాలశాల సమీపిస్తూనే అరిచాడు. ''నాకో స్నేహితుడు దొరికాడు. అతను మనతో వుంటాడు'' అని చెప్పాడు.

తండ్రి యే మాత్రం ఆశ్చర్యపోకుండా

''యెవరా కొత్త మిత్రుడు?'' అని అడిగేడు.

''నాన్నా నువ్వు నమ్మవు. అతను యెంత చిన్నగా వున్నాడో. యెలా చెప్పనబ్బా! ముగింపు పోయిన పుస్తకం గుర్తుంది కదా? యేం, ఆ పుస్తకంలోని పిల్లాడికి కారల్‌సన్ అనే మిత్రుడున్నాడు. అతను యింటి కప్పుమీద వుంటాడు, రెక్కమీద యెగిరి అతని దగ్గరికి వెడతాడు.''

''అంటే నీకో కారల్‌సన్ మిత్రుడు వున్నాడంటావు?'' అని తండ్రి అడిగేడు.

''కారల్‌సన్ కాదు షిర్దాక్. యెంత చిన్నగా వుంటాడంటే నీ అరచేతిలో పడతాడు. రా, నీకు చూపిస్తా. మా స్నేహం గురించి మరో పురుక్కి తెలియనివ్వ కూడదని వొట్టు పెట్టించుకున్నాడు. కాని నేను యెవళ్లకీ చెప్పలేదు నీకు తప్ప... రా, గబగబా.''

''సరే, పద'' అని తండ్రి వొప్పుకున్నాడు.

తండ్రి దుర్ద్రిలి సైకిల్‌ని మోటార్ సైకిల్ పక్కన వుండే సీట్లో పెట్టేడు. వాళ్లు యింటికి బయల్దేరారు.

''షిర్దాక్'' అని గదిలోకి వెడుతూనే దుర్ద్రిలి అరిచేడు. ''యెక్కడ?'' అన్నాడు.

కాని ఆ చిన్న మనిషి గదిలో లేడు.

''యింకా రాలేదేమో. యేదో పుస్తకం కోసం వెళ్లేడు.''

''దుర్ద్రిలి! నీ వూహా శక్తి అద్భుతం!'' అని తండ్రి ముఖం చిట్లించుకుంటూ అన్నాడు. ''యెందుకు పని పాట్లు చెడగొడతావు? యివాళ నిన్ను నమ్మేను. కాని మళ్లీ సారి నువ్వు యేనుగుని తెచ్చినా నమ్మను. నే వచ్చి చూడను'' అన్నాడు.

''కాని నాన్నా, అతనిక్కడ వున్నాడు'' అని దుర్ద్రిలి అరిచేడు. వున్నట్టుండి బల్లమీద వున్న పుస్తకాన్ని చూశేడు. ''నాన్నా, చూడు'' అన్నాడు.

అది కుర్రవాడు, కారల్‌సన్ కథ వున్న పుస్తకం. సరి కొత్తగా వుంది. ముగింపు వుంది.

''అతను వచ్చేడు!'' అని చప్పట్లు చరుస్తూ దుర్ద్రిలి అరిచేడు. ''అతను అన్నమాట నిలబెట్టుకున్నాడు.''

అతని తండ్రి పుస్తకం తీసుకుని పేజీలు తిరగేశాడు.

''అద్భుతం! నీ స్నేహితుడి పేరేమిటి?''

‘‘షిర్దాక్.’’

వున్నట్టుండి దుర్దిలి తల వాలిపోయింది, కన్నీళ్లు కారడం మొదలుపెట్టాయి.

‘‘యేమైంది?’’ అని తండ్రి ఆశ్చర్యంగా అడిగేడు.

‘‘షిర్దాక్ అన్న మాట నిలబెట్టుకున్నాడు. కాని నేను నిలబెట్టుకోలేదు. నేను రహస్యం చెప్పేశాను. యిప్పుడు తను తిరిగి రాడు.’’

‘‘సరే అయిందేదో అయింది. ఒక సారి మాట యిస్తే నిలబెట్టుకోవాలి. వజ్రంలాగా వుండాలి మాట’’ అని నాన్న దుర్దిలిని కాగలించుకుంటూ అన్నాడు.

దుర్దిలి పుస్తకాన్ని గుండెలకి హత్తుకుని మౌనంగా తల వూపేడు. నోరు మెదిపితే కళ్లమ్మట నీళ్లు భోరు భోరున వస్తాయని అతనికి తెలుసు.



బెడిసి కొట్టిన పథకం

యార్తిగులక్‌ని చూద్దామని షిర్దాక్ అనుకున్నాడు. వో పాత మల్బరీ చెట్టు పక్కన వో చిన్న యిల్లు వుంది. తలుపు వేసి వుంది. వో కర్ర అడ్డం పెట్టి వుంది, యజమాని యింట్లో లేడని సూచన అది.

షిర్దాక్ వెళ్లిపోబోయేడు. అప్పుడతనికి నేలమీద వో బాణం గుర్తు కనిపించింది. కొన్ని అడుగుల దూరంలో మరో బాణం గుర్తు కనిపించింది. అవి యార్తిగులక్ యెక్కడ వున్నదీ తెలియ చేసే గుర్తులు.

షిర్దాక్ వాటిని పట్టుకుని వెళ్లేడు. యెత్తైన కంచెకి అవి దారి తీశాయి. ఆ కంచె ఆమన్ ఆగా పళ్ల తోట కంచె. వో కొయ్య పలకని చూపిస్తూ వో బాణం గుర్తు కనిపించింది. షిర్దాక్ హూప్‌మని బలం కొద్దీ కొయ్య పలక మీదకి ఆనుకున్నాడు, అది దారి యిచ్చింది.

తోట చాలా పెద్దది. ఆప్రికాట్ చెట్లు పళ్ల బరువుతో వంగేయి.

తపా!

ఆపిల్ పండంత ఆప్రికాట్ వొకటి షిర్దాక్ కాళ్ల దగ్గర పడింది.

షిర్దాక్ మెడ చాచి పైకి చూశేడు. ఆఁ, అంతే మరి, యార్తిగులక్ మళ్లీ కొంటెతనం పోతున్నాడు.

''ఆమన్ ఆగా తోటలో ఆ చెట్టుమీద యేం చేస్తున్నావ్?''

''నువ్వు వస్తావని యెదురు చూస్తున్నాను.''

''నేను వస్తాననా?''

''షిర్దాక్, నువ్వు చిన్న పిల్లలందరికీ మంచి నేస్తానివి. అందర్నీ యిక్కడికి పిలు. అద్భుతమైన యీ పళ్లని కొన్నింటిని కిందికి రాలుస్తాను. వాళ్లు వాటిని తీసుకుని తింటారు.''

''కాని యార్తిగులక్, ఆమన్ ఆగా అంత దురాశా పరుడు లేడని తెలుసు కదా! పిల్లికి చెయ్యి విదపడు.''

''అతనికి గుణ పాఠం అవాలి. కాపలా కుక్కలన్నిట్నీ జోకొట్టేను. ఆమన్ ఆగా యివాళ వూరికి వెళ్లేడు. వెళ్లి నీ బుడతలందర్నీ పిలు.''

షిర్దాక్ లేదన్నట్టు తల వూపేడు.

''తమది కాని దాన్ని మా మిత్రులు తీసుకోరు.''

''కాని యీ చెట్లు చూడు! భారంతో వొంగి పోతున్నాయి. ఆమన్ ఆగా యింత పంట పోగు చేసుకోలేడు. సగం ఆప్రికాట్‌లు మగ్గిపోతాయి చెట్లమీదే.''

''వుహుఁ, యార్తిగులక్. నీ వూహ సాగదు. ఆమన్ ఆగా తనే పిల్లలందరీ పిలిచి వీటిని పెడితే బాగుంటుంది.''

''సరే అయితే! యింకోటి చేస్తా'' అంటూ యార్తిగులక్ చెట్టుమీదనుంచి కిందికి జారేడు. ''మా యింటికి పద'' అన్నాడు.

''అది మంచి పనే! కాని చిన్ని మెంగ్లి యేదో చిక్కులో వుందేమోనని నాకు అనిపిస్తోంది. వెళ్లి ఆమెకి సాయం చెయ్యాలి'' అన్నాడు.

షిర్దాక్ టోపీని తలమీదకంటా లాక్కుని యీల వేశాడు. వెంటనే వో పావురాయి నేలమీద వాలింది. షిర్దాక్ దానిమీదకి యెక్కి యెగిరిపోయేడు.

మెంగ్లి, కోడిపిల్ల

వూర కుక్క వొకటి వో కోడిపిల్లని పట్టుకుంది. కొక్కొకొక్కొ అని పిచ్చిగా అరుస్తూ దాని తల్లి కుక్కమీదికి దూకింది. దాని కోసమన్నెప్పి మెంగ్లి యింట్లోనుంచి బయటకి పరిగెత్తింది. వూర కుక్క కోడిపిల్లని వదిలేసి పారిపోయింది.



కోడిపిల్లకి వో రెక్క వాలిపోయింది. అది దారీ దిక్కూలేక నేలమీద దొర్లింది.

మెంగ్లి గుడ్ల నీరు కుక్కుకుంది. యెలా దీన్ని కాపాడడం?

''యేడిస్తే పనులవుతాయా? మందూ మాకూ వెయ్యాలి జాగ్రత్తగా చూడాలి'' అని వో సన్నని గొంతుక అంది.

మెంగ్లి చుట్టూ చూసింది, యెవళ్లూ కనిపించలేదు.

''నేను మాట్లాడుతున్నాను. జాగ్రత్త, నామీద అడుగు వేసేవ్!''

మెంగ్లి కాళ్లకేసి చూసింది.

చిత్రమైన టోపీ పెట్టుకుని చిన్న లిక్కి మనిషి కనిపించేడు.

''నువ్వేనా షిర్దాక్వి?''

''ఆఁ.''

''నాకు సాయం చెయ్యడానికి వచ్చేవా?''

''కాని మరి పని చెయ్యాలి, మెంగ్లి! వో పాత టోపీనో, గుడ్డ పీలికనో తే. కోడిపిల్లకి గూడు కట్టు.''

''ఆ దిష్టి బొమ్మమీద వున్న టోపీ పని కొస్తుందా?''

''సరిగ్గా అదే కావాలి. కాని ముందు కోడిపిల్లకి యేదన్నా తాగించు. కాస్త గంజి మంచిగా ముక్కలు తరిగిన గుడ్డు పెట్టు.''

మెంగ్లి కోడిపిల్లకి నీళ్లు యిచ్చింది. ఓ గూడు, తిండి తయారు చెయ్యడం మొదలుపెట్టింది. యీ లోపున షిర్దాక్ మందూ మాకూ సమకూర్చేడు: రెల్లు, శిలాజిత్తు, కాడ్ లివర్ ఆయిలు తెచ్చేడు. కోడిపిల్ల విరిగిన కాలికి రెల్లు కట్టి, శిలాజిత్తు వేసి నీళ్లల్లో కలిపి కట్టేరు. తర్వాత గాయపడిన రెక్కకి కాడ్ లివర్ ఆయిలు పామేరు.

వరసగా మూడు రోజులు షిర్దాక్ మెంగ్లి పెరట్లోకి వెళ్లేడు. నాలుగో రోజున అన్నాడు:

''యిలాంటి ఆపత్సమయంలో యేం చెయ్యాలో నీకు యిప్పుడు తెలిసింది కదా! కోడిపిల్లకి త్వరలోనే బాగవుతుంది. సెలవ్, మెంగ్లి!''

''నీ రుణం యెలా తీర్చుకోను షిర్దాక్. యిది నా గుర్తుగా వుంటుంది, తీసుకో.''

అంటూ ఆమె తనే పట్టుదారంతో అల్లిన చిన్న రుమాల్ని యిచ్చింది.

షిర్దాక్ దాన్ని నడుముకి కట్టుకున్నాడు. చెవిలేని కప్పులో వున్న నీళ్లల్లో ప్రతిబింబం చూసుకున్నాడు. అతనికి సంతోషం కలిగింది. పావురాయి పెరట్లో దిగింది. షిర్దాక్ దానిమీదకి గెంతి యెగిరిపోయేడు.

తర్వాత చాలా కాలందాకా అటు యెగిరి వెళ్లిన ప్రతి పావురాయికేసీ మెంగ్లి తదేకంగా చూస్తూనే వుండేది. యీ చిన్న మనిషి కనిపిస్తాడనే ఆశతో వుండేది.

కోడిపిల్లకి బాగయింది. అది చక్కని రంగు రంగుల యీకలు పెరిగిన కోడిపెట్ట అయింది.

మెంగ్లి కూడా బళ్లోకెళ్లేటంత పెద్దది అయింది. ప్రతి రోజూ ఉదయం కోడిపెట్ట ఆమెని గేటుదాకా సాగనంపేది. ప్రతిరోజూ మధ్యాహ్నం గుమ్మంలో స్వాగతం చెప్పి యింట్లోకి తీసుకువెళ్లేది.

చేదు మందు

డెగ్లి జలుబు రొంపతో బాధపడుతున్నాడు. అతనికి పీడకలలు వచ్చేయి. వో తెల్లని అరేబియన్ గుర్రంమీద సమర్ కండ్‌లో స్వారీ చేసుకు వెడుతూ వున్నట్టూ, ఉలుగ్‌బెక్ కొండమీదకి యెక్కి టెలిస్కోప్‌తో చంద్రుణ్ణి చూసినట్టూ కలలు వచ్చేయి. చంద్రుడిమీద తన తండ్రి ట్రాక్టర్‌తో దున్నుతూ కనిపించేడు. తర్వాత తులా పట్టణం గురించి కలలు వచ్చేయి. కచ్చితంగా చెప్పాలీ అంటే వూరు కాదు, ఆయుధాల మ్యూజియం కలలోకి వచ్చింది. తను ఆ మ్యూజియంలో తిరుగుతున్నాడు, ''వస్తువులని తాకకండి'' అన్న హెచ్చరిక చూశేడు. కాని రహస్యంగా వో రైఫిల్ ట్రిగ్గర్ నొక్కేడు. ధనామని పేలింది... వెంటనే యేడుస్తూ లేచి పక్కమీద కూర్చున్నాడు. వాళ్లమ్మ గబగబా పరిగెత్తుకుంటూ వచ్చింది. నాయన నాయన మందు తీసుకో అని బతిమలాడింది.

''కాని, ఛీ, చేదు'' అని డెగ్లి మందు గ్లాసుని తోసేశాడు నీళ్ల గ్లాసుని తోసేశాడు. నిద్రపోతున్నట్టు నటించేడు. నిజంగానే కొంచెం సేపట్లోనే నిద్రపోయేడు. మళ్లీ అదే కల వచ్చింది.

పిసరు కూడా వాడికి అది ఆశ్చర్యంగా లేదు. అంతకు ముందే వాడికి రెండు బేడ్జీలు యిచ్చారు. వొక దానిపై సమర్‌కండ్, మరో దానిమీద తులా ఆయుధ మ్యూజియం వున్నాయి. కాని సమర్‌కండ్, అక్కడ తను తెల్ల గుర్రం మీద వెళ్లడం కాక హఠాత్తుగా వింత టోపీ పెట్టుకున్న చిన్న మనిషి కనిపించడంతో భయం కలిగింది.

''యెందుకు అమ్మని కష్ట పెడతావ్?'' అని ఆ మనిషి అరిచేడు. ''నీకు జబ్బు చేసింది. మందులు తీసుకోవాలి'' అన్నాడు.

''కాని నువ్వెవరు?'' అని డెగ్లి అడిగేడు.

''నన్ను గుర్తు పట్టలేదా?''

''బహుశా షిర్దాక్‌వి అయివుంటావు. షిర్దాక్ జాలి మనిషి అంటారు. నువ్వేమో అరుస్తున్నావు.''

''నేను జాలి గుండె మనిషినే. నీకు గబగబా నయం కావాలని నాకు వుంది. అమ్మని పిలిచి మందు తీసుకో. అంత ఘన కార్యం చేసినందుకు నీకు కానుకలు యివ్వను కాని కథ చెప్తాను.''

మరో మాట అనకుండా డెగ్లి అమ్మని పిలిచి గబగబా మందు తాగేడు. అమ్మ దీపం ఆర్పేసి మునివేళ్లమీద గది బయటికి వెళ్లిపోయింది. డెగ్లి హఠాత్తుగా బుద్ధిమంతుడైపోయాడని ఆమెకి ఆశ్చర్యం కలిగింది. కాని వాడు మెల్లిగా తన మిత్రుణ్ణి పిలుస్తున్నాడు.

''షిర్దాక్! మందు తాగేను. యెక్కడున్నావ్?''

''యిక్కడే వున్నాను'' అని షిర్దాక్ తలగడ పక్క కూర్చుంటూ అన్నాడు. ''మందు బాగానే తాగావు. యిప్పుడు విను'' అంటూ షిర్దాక్ కథ మొదలుపెట్టేడు.

మంచీ చెడూ

అనగా అనగా చాలా కాలం కితం వో ముసలాడు వుండేవాడు. ముసలి పెళ్ళాం, ముసలి గాడిద తప్ప అతనికి యేమీ లేవు. యెడారి బీటిమీద వంట చెరకు పుల్లలు యేరి అమ్మి కాలక్షేపం చేసేవాడు.

ఓ సారి అతను యెడారిలో తిరుగుతున్నాడు. రెండు పెద్ద సుడిగాలులు లేచేయి. వొకటి నల్లగా వుంది, యింకోటి తెల్లగా వుంది. ఆకాశం అంత యెత్తు లేచేయి అవి.

బాగా చూడ్డం కోసమని చెప్పి దగ్గరసా వెళ్ళేడు.

హఠాత్తుగా తెల్ల సుడిగాలి తెల్లని పాములా మారిపోయింది.

ఆ తెల్లని పాము ముసలాడి దగ్గరికి పాకి వచ్చి మనిషి భాషలో అంది:

''ముసలాయనా! దేన్నేనా గానీ నా యిష్టం వచ్చినట్టు మార్చగలను. నేను సూదిలాగా మారిపోతాను. నన్ను దాచెయ్యి నీ జేబులో. నల్ల పాము నా బద్ధ శత్రువు. అది నీ పక్కనుంచి దూసుకుపోయేక సూదిని నీ జేబులోనుంచి తీసెయ్యి. నీకేం కావాలో దాన్ని యిస్తాను.''

శరణార్థికి సాయం చెయ్యడానికి ముసలాడు వొప్పుకున్నాడు.

''తెల్ల పాము మీద ఆన, నల్ల పాము మీద ఆన, నేను సూదిని అయిపోగాక!'' తెల్ల పాము యీ మాటలు అనీ అనగానే సూదిలాగా మారిపోయింది.

ముసలతను గబగబ దాన్ని యెత్తి జేబులో పెట్టుకున్నాడు.

కొంచెం సేపట్లోనే నల్ల సుడిగాలి గిర్రున తిరుగుతూ వచ్చి నల్ల పాము కింద మారింది.

''యేయ్, ముసలాయనా! తెల్ల పామేదేనా యీ పక్కల కనిపించిందా?'' అవి అడిగింది.

''లేదు'' అని ముసలతను జవాబు చెప్పేడు.

''నిజం చెప్పు! లేకపోతే తర్వాత బాధపడతావు'' అని బుసకొట్టింది నల్ల పాము.

నల్ల పాముని వొదిలించుకోవాలని ముసలతను చేతిని లేదన్నట్టు వూపి అన్నాడు:

''మరి యిదేమిటో నాకు తెలీదు. యేదో తెల్లని సుడిగాలి యిటు విసురుగా వెళ్ళింది.''

వెంటనే నల్ల పాము సుడిగాలిలా మారి అమిత వేగంతో దూసుకుపోయింది.

ముసలతను సూదిని తీసి చెప్పేడు:

''శత్రువు వెళ్ళిపోయినట్టే.''

సూది మళ్ళీ తెల్ల పాములాగా మారింది.

''నన్ను రక్షించేవు. యేదన్నా కోరుకో, నీ కోరిక తీరుస్తా.''

''నాకు పెద్ద యేమీ అక్కర్లేదు. వంట చెరకు తనంతట అదే గాడిద వీపుమీదకి యెక్కి గాడిద తోలకుండానే నడిచి వెళ్ళిపోతే చాలు.''

''తెల్ల పాము మీద ఆన, నల్ల పాము మీద ఆన, ముసలతని కోరిక తీరుగాక'' అంది తెల్ల పాము.

ఆ రకంగా ముసలతని కోరిక నెరవేరింది. వంట చెరకు దాని కదే గాడిద వీపుమీదకి చేరింది. గాడిద హుషారుగా





ఠకఠక నడుచుకుంటూ యింటికి బయల్దేరింది. నగర ప్రాకారాన్ని యేడు అంతరాలుగా మట్టితో కట్టేరు. అక్కడికి ముసలతను, గాడిదతో చేరే వేళకి రాజుగారి కూతురు కలిసింది. ఆమె తెల్లని ఒంటె వీపుమీద బంగారు పూత పెట్టిన పల్లకీలో కూర్చుంది. గాడిద యజమాని నడునడు అని పురిపెట్టి తోలకుండా తనకి తనే వస్తూ వుండడం చూసింది రాజు కూతురు.

వెంటనే ఒంటెని ఆపమని పురమాయించి ముసలతన్ని పిలిచింది.

''చూస్తే యిది చాలా అనుభవం గడించిన గాడిదలాగానే వుంది. అలా నడక దీనికి నేర్పింది యెవరో చెప్పు ముసలాయనా'' అని అడిగింది.

''నువ్వెవరు?'' అని ముసలతను అడిగేడు.

''నేను రాజు కూతుర్ని.''

''అయితే నేను జవాబు చెప్పను. నా జవాబు నీకు నచ్చకపోతే నా తల తీయిస్తావు.''

''యేం భయం వద్దు, చెప్పు'' అందామె.

''అయితే విను, ఆకలి దానికి నేర్పింది.''

రాజు కూతురు తన దారిన వెళ్లిపోయింది. కాని గూఢచారులు తాము చూసింది రాజుగారికి నివేదించారు.

''మీ అమ్మాయి బజార్లో కట్టెలు అమ్మే వాడితో మాట్లాడింది.''

రాజుగారికి చెడ్డ కోపం వచ్చేసింది. ఆ ముసలాణ్ణి పట్టుకుని హాజరు పరచమని ఆజ్ఞాపించేడు.

వాళ్లు ముసలతన్ని ప్రాసాదానికి యీడ్చుకువచ్చేరు.

రాజు యే విచారణా జరపకుండా దురాగ్రహంతో అరిచేడు:

''యీ తుచ్ఛుణ్ణి కొరడాలతో కొట్టి నగరంనుంచి బహిష్కరించండి.''

రాజుగారి తైనాతీలు ముసలతన్ని యిరవై కొరడా దెబ్బలు కొట్టేరు. పహారా వాళ్లు అతని పూరిగుడిసెని దగ్ధం చేశారు. అతన్నీ, అతని పెళ్లాన్నీ నగరంనుంచి బహిష్కరించేరు.

దాంతో వాళ్లు దారీ తెన్నూ లేకుండా తిరగడం మొదలుపెట్టేరు. అప్పుడు తెల్ల పాము ప్రత్యక్షమైంది.

''యేమయ్యా? యేమైంది నీకు?''

ముసలతను జవాబు చెప్పేడు:

''చిన్న విషయానికి మా రాజు నన్ను కొరడా దెబ్బలు కొట్టించి నగర బహిష్కారం చేశాడు. నాకు నువ్వు వో చలవరాతి మేడని నాలుగు బురుజులతో కట్టించి యిస్తే యెంత బాగుంటుంది! ప్రతి బురుజుమీద కూతకూసే కోడి వుండాలి. ప్రాసాదం గోడల బయట మట్టిపొయ్యిలు వుండాలి.''

''తెల్ల పాము మీద ఆన, నల్ల పాము మీద ఆన ముసలాయన కోరిక నెరవేరుగాక!'' అని తెల్ల పాము అంది.

తృటిలో ఆ యెడారిమీద చలవరాతి మేడ లేచింది. ముసలతనూ, అతని భార్యా భోగ భాగ్యాలతో తులతూగుతూ అందులో వున్నారు.

ఓ రోజున వేటకి వచ్చిన రాజు యెడారిలో ఆ చలవరాతి మేడని చూశేడు. గుర్రాన్ని వెనక్కి తిప్పి రక్షక భటుల్ని పిలిచి ఆజ్ఞాపించేడు:

''నా అనుమతీ లేకుండా యెవడో నా భూభాగంలో మేడ కట్టేడు. ఆ తుచ్ఛుడెవరో పట్టి యీడ్చుకు రండి. రాకుండా మొరాయిస్తే తల ఖండించి తీసుకు రండి.''

భయంకరమైన అట్టహాసంతో రాజుగారి రక్షక భటులు చలవరాతి మేడ దగ్గరికి వెళ్లేరు. అదే క్షణంలో తెల్ల పాము ముసలతని ముందు ప్రత్యక్షమై అడిగింది:

''యేం చెయ్యను? వీళ్ల పని పట్టనా?''

''నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి'' అని ముసలాడు అన్నాడు.

''తెల్ల పాము మీద ఆన, నల్ల పాము మీద ఆన యీ సైనికులు వెనక్కి అడుగులు వేసుకుంటూ రాజ మందిరానికి పోగాక'' అంది.

తక్షణం పాము ఆదేశించినట్టే జరిగి పోయింది.

రక్షక భటులు రాజ మందిరానికి దొర్లుకుంటూ పోయేరు.

వాళ్ల నాయకుడు రాజుగారి ముందర మోకరిల్లేడు.

''యిలాంటి శత్రువు బారినుంచి దేముడు మమ్మల్ని కాపాడు గాక! ప్రభూ తమరే అతనితో యుద్ధం చెయ్యండి. మాకు యేం జరిగిందో చూడండి! వాడు యెలా వుంటాడో కూడా మేం చూడలేదు'' అన్నాడు.

''పనికి మాలిన చవటా!'' అని రాజు కోపంతో నేలమీద తన్నుతూ అరిచేడు. రక్షక భటుల నాయకుడి చెంప వాయించి, రాజు స్వయంగా వజీర్‌ని తీసుకుని చలవరాతి మేడమీదకి దండు వెళ్లేడు.

వాళ్లు వస్తూ వుండడం ముసలాడు చూశేడు. తెల్ల పాముతో చెప్పేడు:

''రాజు వజీర్‌తో కలిసి వస్తున్నాడు.''

''యేం చెయ్యమంటావ్?'' అని తెల్ల పాము అడిగింది.

''నీకు యేది మంచిదని తోస్తే అలా చెయ్యి!'' అని ముసలతను ముందటికిలాగానే జవాబు యిచ్చేడు.

''తెల్ల పాము మీద ఆన, నల్ల పాము మీద ఆన, ముసలివాని అనుమతితో, రాజు మగగాడిదలాగా, వజీర్ గాడిద పిల్లలాగా మారిపోవుగాక! ఆ గాడిదలు ఓండ్ర పెట్టి యేడు సార్లు చలవరాతి మేడ చుట్టూ పరిగెత్తి తిరుగుగాక'' అంది.

రాజు, వజీరు వెంటనే అలా మారిపోయేరు. కఠోరంగా ఓండ్ర పెడుతూ చలవరాతి మేడ చుట్టూ దౌడు తియ్యడం మొదలుపెట్టేరు.

సరిగ్గా అదే సమయంలో ముసలతని భార్య బయట మట్టిపొయ్యిలో రొట్టె కాలుస్తోంది. గాడిదలు రెండూ దౌడు తీసుకుని వస్తూ వుండడం చూసి, అవి రాజూ, వజీరూ అని తెలియక, కర్ర తీసుకుని తరిమి వేసింది. ఆ గాడిదలు మేడ చుట్టూతా యేడు సార్లు దౌడు తీసి ఆగేయి.

''తెల్ల పాము మీద ఆన, నల్ల పాము మీద ఆన, ముసలతని అనుమతితో మీరు యెప్పటి మాదిరీ అవుగాక'' అంది తెల్ల పాము.

దాంతో మగగాడిద, గాడిద పిల్ల మరో సారి రాజుగా, వజీరుగా మారిపోయేయి.

''ఘనత వహించిన తెల్ల పామా! వాళ్లకి తగు మాత్రం జీవిక యిచ్చి, వాళ్లు యిల్లూ వాకిలీ లేకుండా దిమ్మరు

లుగా తిరిగేటట్టు చెయ్యి. వాళ్ళు యితరులకి అలా జరగాలని కోరుకున్నారు. అలా తిరిగితే మంచీ, చెడ్డా వాళ్ళకిగా వాళ్ళకి తెలిసి వస్తాయి.''

ఆ మర్నాడు డెగ్లి బుద్ధిగా మందు తాగేడు. ఆ రాత్రి షిర్దాక్ మళ్లీ ప్రత్యక్షమై మరో కథ చెప్పాడు.



ఒంటి కన్ను బొంతకాకి

అనగా అనగా వొకప్పుడు వో పసుల కాపరి వుండేవాడు. అతనికి భార్య, పూరి యిల్లు, వో ఆవూ వుండేవి. అతని భార్య ఆవుపాలు పితికేది. అతను జున్ను చేసేవాడు. దాన్ని ఆరబెట్టడానికి యింటి కప్పుమీద పెట్టేవాడు. అలా ఆరబెట్టిన జున్నులో కొంత మాయమై పోతోందని అతను గమనించేడు.

దొంగని పట్టాలని చెప్పి అతను, అతని భార్య చూశారు. అలా కొంత కాలం యెదురు చూశేరు. ఒంటి కన్ను బొంతకాకి వొకటి కప్పుమీద వాలి జున్ను తింటూ వుండడం వాళ్ళకి కనిపించింది.

పసుల కాపరి ఆ కాకిని పట్టుకున్నాడు. దాని పీక నులిమెయ్యబోతూ వుండగా బొంతకాకి యిలా వేడుకుంది.

''నన్ను చంపద్దు. నీకు మంచి బహుమతీ యిస్తాను. రేపు మా యింటికి రా. యెవళ్లనడిగినా మా యింటికి దారి చెప్తారు.''

పసుల కాపరీ, అతని భార్యా దాని మాటలు నమ్మారు. దాన్ని వదిలేశారు.

ఆ మర్నాడు పసుల కాపరి మందని వూళ్లోకి తోలి ఒంటి కన్ను బొంతకాకి యిల్లు వెతుక్కుంటూ బయల్దేరాడు.

అతను అలా నడిచి వెడుతూ వుండగా మేత మేస్తూ వున్న గొర్రెల మంద కనిపించింది.

''యెవరి మందలివి?''

''ఒంటి కన్ను బొంతకాకివి'' అని గొర్రెల కాపరులు బదులు చెప్పేరు.

''ఎక్కడ ఆ బొంతకాకి మకాం?''

''యీా రోడ్డమ్మటే వెళ్లు, కొంత మంది పసుల కాపర్లు తగులుతారు. వాళ్లు చెప్తారు.''

పసుల కాపరి ఆ రోడ్డమ్మటే వెళ్లాడు. కొంచెం సేపట్లోనే గుర్రాలని మేపే వాళ్లు కనిపించేరు.

''యెవరి గుర్రాలివి?'' అని అతను వాళ్లని అడిగేడు.

''ఒంటి కన్ను బొంతకాకివి.''

''యెక్కడ ఆ బొంతకాకి మకాం?''

''యీా దారినే వెళ్లు. ఒంటెల్ని కాసేవాళ్లు తగుల్తారు. వాళ్లని అడుగుతే చెప్తారు.''

పసుల కాపరి ఆ దారినే వెళ్లాడు. అతనికి ఒంటెల మంద కనిపించింది.

''యెవరివి యీా ఒంటెలు?''

''ఒంటి కన్ను బొంతకాకివి'' అని వాళ్లు జవాబు చెప్పేరు.

''ఆ ఒంటి కన్ను బొంతకాకి మకాం యెక్కడ?''

ఒంటెల కాపర్లు దారి చెప్పారు. పసుల కాపరి ఆఖరికి అక్కడికి చేరగలిగేడు. యీా మందలన్నిటికీ యజమాని అయిన బొంతకాకి పసుల కాపరికి హార్దిక స్వాగతం చెప్పి, కనివినీ యెరగని భోజ్య పదార్థాలు పెట్టింది. తర్వాత కూచుని తనివి తీరా కబుర్లు చెప్పుకున్నారు.

సెలవు తీసుకుని పసుల కాపరి వెళ్లిపోయే ముందు ఒంటి కన్ను బొంతకాకి అతనికి వో టేబిల్‌క్లాత్ యిచ్చింది.

''వూరికే చెప్పు: 'పరుచుకో, టేబిల్‌క్లాత్, పరుచుకో! ఆహార పదార్థాలు నిండనీ'. అలా అనగానే మీకు తృప్తి కలిగించేటట్టు అన్నీ అమురుతాయి. కడుపు నిండా తిన్నాక 'మడుచుకో టేబిల్‌క్లాత్, మడుచుకో' అను.''

యింటికి తిరిగి వచ్చేక అతను భార్యని పిలిచేడు.

''చేతులు కడుక్కుని రా, తిందాం'' అన్నాడు.

''యేం తింటాం? వంటా పెంటా తగలెట్టిందే'' అంది.

పసుల కాపరి చేతులు కడుక్కుని తివాసీమీద కూర్చుని, టేబిల్‌క్లాత్ వుంచేడు.

''పరుచుకో, టేబిల్‌క్లాత్, పరుచుకో'' అన్నాడు.

టేబిల్‌క్లాత్ పరుచుకుంది. చూడండి! ఆశ్చర్యం! యెన్ని రకాల భక్ష్య భోజ్యాలు వుంటాయో అన్నీ దానిమీద అమిరేయి.

భోజనాలు అయేక పసుల కాపరి అన్నాడు:

''ముడుచుకో, టేబిల్‌క్లాత్, ముడుచుకో.''

టేబిల్‌క్లాత్ ముడుచుకుంది.

''రేపు చక్రవర్తినీ, ఆయన పరివారాన్నీ భోజనానికి పిలుస్తా'' అన్నాడు పసుల కాపరి.

''చాలు! చాలు! వాళ్లు యీా వింతని కాస్తా యెత్తుకు చక్కాపోతారు'' అని వారించింది అతని భార్య.

''వుహూఁ, అలా అనుకున్నాను, చేస్తాను అంతే'' అన్నాడతను మొండిగా. ''యింతకీ టేబిల్‌క్లాత్ సంపాదించింది నేను కదా!'' అన్నాడు.

అతను చక్రవర్తినీ, రాజదర్బారు పెద్దలనీ ఘనమైన విందుకి పిలిచేడు. అందరూ వచ్చి యధాస్థానాల్లో కూర్చున్నాక పసుల కాపరి తివాసీమీద టేబిల్‌క్లాత్‌ని పెట్టేడు.

''పరుచుకో టేబిల్‌క్లాత్ పరుచుకో'' అని ఆజ్ఞాపించేడు.

రెప్పపాటులో ఆశ్చర్యకరమైన పిండి వంటలన్నీ, రకరకాల తిను బండారాలన్నీ చక్రవర్తి ముందూ, ఆయన పరివారం ముందూ ప్రత్యక్షమయేయి.

అతిథులు బ్రేవ్‌మని త్రేన్చి తృప్తిగా యిళ్లకి వెళ్లిపోయేరు. కాని చక్రవర్తి తన మందిరానికి వెళ్లేక యిద్దరు కాపలా వాళ్లని పిలిచేడు.

''వెళ్లి ఆ అద్భుతమైన టేబిల్‌క్లాత్‌ని యెత్తుకు రండి, ఆ దౌర్భాగ్యుడి దగ్గర్నుంచి. వాడు యెదిరిస్తే సఫా చేసెయ్యండి'' అన్నాడు.

కాపలా వాళ్లు పసుల కాపరి యింటికి వెళ్లి మహిమ వున్న టేబిల్‌క్లాత్‌ని లాగేసుకున్నారు.

పసుల కాపరికి చేసేదేమీ లేకపోయింది. మళ్లీ రాముడో దేముడో అని యేడ్చుకుంటూ ఒంటికన్ను బొంతకాకి దగ్గరికి వెళ్లేడు.

''మా చక్రవర్తి టేబిల్‌క్లాత్ యెత్తుకు పోయే''డని మొరపెట్టుకున్నాడు.

అప్పుడు ఆ బొంతకాకి వో గాడిదని పసుల కాపరికి యిచ్చింది.

''యిదుగో హేయ్! హోయ్! అని ఆదేశించు. యిది పేడకి బదులుగా బంగారాన్ని రాలుస్తుంది'' అని చెప్పింది.

పసుల కాపరి గాడిదమీదకి యెక్కి యింటికి బయల్దేరాడు. కాని ఆ దారి రాజ ప్రాసాదం పక్క నుంచే సాగుతుంది.

''యెందుకు తద్దినంకొని తెచ్చుకోవడం!'' అని పసుల కాపరి అనుకుని, గాడిదని మడమలతో తన్నుతూ ''హేయ్! హోయ్!'' అని మామూలుగా గాడిదలని తోలేటప్పుడు అరిచే అరుపు అరిచాడు.

అందుకు జవాబుగా గాడిద నేలమీద బంగారాన్ని కుమ్మరించింది. యీ అద్భుతం చక్రవర్తి కళ్లబడింది. పసుల కాపరి దగ్గర్నుంచి బొంతకాకి యిచ్చిన యీ కానుకని కూడా కాజేశాడు.

పాపం, ఆ మర్నాడు పసుల కాపరి మళ్లీ మొత్తుకుంటూ ఒంటికన్ను బొంతకాకి దగ్గరికి వెళ్లేడు. తన ఖర్మ యిలా కాలిందని లబోదిబోమన్నాడు.

''నీకు యెవరు అపకారం చేశారు?'' అని బొంతకాకి అడిగింది.

''మా చక్రవర్తి గాడిదని యెత్తుకు పోయేడు.''

బొంతకాకి చీదరించుకుని పసుల కాపరికి యింకో కానుక యిచ్చింది. రంగులు పూసిన పెట్టె.

''యిదుగో చూడు, తెరుచుకో, పెట్టే, తెరుచుకో అని మాత్రమే నువ్వు అనవలసిందల్లా. రా, సుత్తీ, రా! అను చాలు. కొయ్య సుత్తితో మనిషి వస్తాడు. యెవరు పక్కన వున్నా నెత్తిమీద మోదుతాడు. నీకు సరదా తీరిందనిపించేక వూరికే చాలింక, సుత్తీ! చాలు! అను. కొయ్య సుత్తి మనిషి లోపలికి వెడతాడు'' అని చెప్పింది.

పసుల కాపరి పెట్టెని పట్టుకుని బయల్దేరేడు. అంతలోకే అతనికి అనుమానం వచ్చింది. ''మనిషి యీ పెట్టెలో యెలా పడతాడు? యిక కొయ్య సుత్తి పట్టుకున్నవాడు అసలే పట్టడు కదా?'' అనిపించింది.

అసలేమిటో విషయం చూద్దాం అనిపించింది.



అతను పెట్టెని వో గుట్టమీద పెట్టి తను వో కయ్యిలో దాంకుని అరిచేడు:

''తెరుచుకో, పెట్టే తెరుచుకో! రా, సుత్తీ, రా!''

పెట్టెలోనుంచి కొయ్య సుత్తి పట్టుకుని వో మనిషి వచ్చేడు. చుట్టు పక్కల యెవరూ కనిపించకపోవడంతో కయ్యిలో వున్న పసుల కాపరిని చూసి మోదడం పెట్టాడు.

''చాలింక సుత్తీ చాలు! మూసుకో, పెట్టీ, మూసుకో!'' అన్నాడు.

సుత్తి పట్టుకున్న మనిషి పెట్టెలోకి మళ్లీ దూరేడు. పసుల కాపరి పెట్టెని పట్టుకుని చక్రవర్తిగారి పెరట్లోకి వెళ్లేడు. ఆ పెట్టెని వో నదురైన చోట పెట్టి తను వో పక్క దాంకుని అరిచేడు:

''తెరుచుకో పెట్టీ తెరుచుకో! రా, సుత్తీ, రా!''

సుత్తె పట్టుకున్న మనిషి యివతలికి వచ్చేడు. చక్రవర్తిని, వజీర్‌ని, దర్బారు మనుషుల్ని మోదడం మొదలు పెట్టేడు. అతను ఆ మోదడంలో యెంత పరవశించిపోయేడంటే ఆఖరికి మొత్తం ప్రాసాదం అంతట్నీ సుత్తితో మోదేశాడు.

అప్పుడు పసుల కాపరి అరిచేడు:

''చాలింక సుత్తీ చాలు, మూసుకో పెట్టీ మూసుకో.'' పెట్టె మూసుకుంది. పసుల కాపరి తన టేబిల్‌క్లాత్‌నీ, గాడిదనీ తీసుకుని యింటికి తిరిగివెళ్లి బ్రహ్మాండమైన విందు చేసి మొత్తం దేశమంతట్నీ పిలిచేడు.

అప్పట్నుంచీ అతను హాయిగా బతికేడు. ఆపదలో ఆకలితో వున్న వాళ్లందరినీ ఆదుకున్నాడు.

అతను దివంగతుడయేక అతని కీర్తి నిలిచిపోయింది.

మూడో రోజుకి డెగ్లికి పూర్తిగా బాగయింది. షిర్దాక్ మళ్లీ వచ్చి హుషారైన కథ చెప్పేడు.

కెలెవ్

పూర్వం వొకప్పుడు కెలెవ్ అనే పేరు వున్న మనిషి వొకడుండేవాడు. ఓ రోజున అతని భార్య అతనికి కొంత డబ్బు యిచ్చింది.

''బజారుకి వెళ్లి కొంచెం వెన్న కొని పట్రా'' అంది.

వెన్నని పెట్టడానికి బోలు సొరకాయని తీసుకుని కెలెవ్ గాడిద యెక్కి బయల్దేరేడు.

వెన్నని కొని యింటికి తిరిగివచ్చేటప్పుడు దారిలో ఆగి కొంచెం సేపు విశ్రాంతి తీసుకుందా మనుకున్నాడు.

గాడిదమీదనుంచి దిగి, వెన్న వున్న సొరకాయని నేలమీద పెట్టి గాడిదని యెక్కడ కట్టాలా అని చోటు కోసం చూశేడు. ఆ చుట్టు పక్కలంతా పిసరు గడ్డి పరక కూడా లేని బీడు, సాఫీగా వుంది. అప్పుడు అతని దృష్టి సొరకాయమీద పడింది. సొరకాయ వంకర మెడకి గాడిద తాడు కట్టాలని అనుకున్నాడు.

''యేం తెలివి నాది!'' అనుకుని కెలెవ్ నేలమీదకి వాలుతూ అన్నాడు.

నుంచుని నుంచుని గాడిదకి విసుగొచ్చింది. అది మెడ చాచి ఓండ్ర పెట్టడం లంకించుకుంది. గెంతుకుంటూ పోవడం మొదలెట్టింది. వెనక్కాలే సొరకాయ కూడా పడుతూ లేస్తూ వుంది. కెలెవ్ వొక్క ఉదుట్న లేచి దాని వెంట బడ్డాడు. చాలా సార్లు అది అందినట్టే అందేది. కాని వెంటనే మళ్లీ మంచి దౌడు లంకించుకునేది.

సొరకాయ మిట్టమీద, గొప్పమీద పడుతూ లేస్తూ గాడిద వెనక్కాలే పోతూనే వుంది. ఆఖరికి అది తునా తునకలైపోయింది. గాడిద కనిపించకుండా పోయింది.

కెలెవ్‌కి చేసేది యేమీ లేకపోయింది. గాడిదని వెతుకుతూ బయల్దేరడం తప్ప గత్యంతరం లేకపోయింది. దారిలో అతనికి వో మనిషి తగిలేడు.

''యేమయ్యా దారిలో యెక్కడనా నా గాడిద కనిపించిందా?'' అని అడిగేడు.

కెలెవ్ శుద్ధ అమాయకుడు అని ఆ మనిషి గ్రహించేడు. కొంచెం ఆట పట్టించాలి అనుకున్నాడు.

''కనిపించిందయ్యా.''

''యెక్కడ?''

''రాజ ప్రాసాదంలో వుంది. న్యాయాధికారి పని చెయ్యమని దాన్ని పిలిపించేరు.''

మరి ఆలోచనా, పాలోచనా లేకుండా కెలెవ్ న్యాయాధికారి యింటికి పరిగెత్తేడు. ఆయన్ని వీధిలోకి లాగి అరవడం మొదలుపెట్టేడు:

''యిక పదపోదాం.''

యీ రచ్చకి జనం అక్కడ పోగయేరు. కెలెవ్‌నీ న్యాయాధికారినీ చుట్టు ముట్టేరు.

''కెలెవ్, యెక్కడికి ఆయన్ని యీడ్చుకుపోతున్నావ్?'' అని అడిగేరు.

''యింటికి! యిది నా గాడిద. నేను దీన్ని వెన్న వుంచిన సొరకాయకి కట్టేశాను. యిది పారిపోయింది. సొరకాయ ముక్కలు ముక్కలైపోయింది. వెన్నంతా నేలపాలైంది. అదెలాగూ పోయింది, గాడిదని కూడా పోగొట్టు కొమ్మంటారా?'' అని అడిగేడు. కెలెవ్ ఆ కథంతా జనానికి చెప్పి మళ్లీ అరుపులు మొదలుపెట్టేడు.

''పద, పోదాం యింటికి.''

యేం చెయ్యాలో తోచక న్యాయాధికారికి మతిపోయింది. ఓ పక్క జనం నవ్వుతున్నారు, కెలెవ్ తనని తోస్తున్నాడు.

''తెలివైన పని వీడికి సొమ్ము ముట్ట చెప్పడం'' అని న్యాయాధికారి తనలో తను అనుకున్నాడు. గాడిదకి, సొర కాయకి, వెన్నకి సొమ్ము యిచ్చెయ్యడం.

కెలెవ్ సొమ్ము తీసుకుని యింటికి బయల్దేరి వెళ్లేడు. కాని న్యాయాధికారి ఆశ్రితుడొకడికి దురాశ పుట్టింది.

''వాడు అమాయకుడు, అంత సొమ్ము యెలా పట్టుకు పోగలిగేడు? దాన్ని యెలాగైనా లాగేసు కోవాలి'' అనుకున్నాడు.

కెలెవ్‌కంటే ముందే వెళ్లి రెండు పుచ్చకాయలు తీసుకుని రోడ్డుమీద కూర్చున్నాడు. కెలెవ్ దగ్గరికి వస్తూ వుండడం చూసి వొక దాన్ని కోసి తినడం మొదలుపెట్టేడు. కెలెవ్‌కి విపరీతమైన దాహం వేసేసింది. న్యాయాధికారి ఆశ్రితుడు వో ముక్క కోసి అతనికి యిచ్చేడు.

''అబ్బ, యెంత తియ్యగా వుందో?'' అన్నాడు కెలెవ్.

''దాన్దేముంది! యీ పుచ్చకాయ యింకా తియ్యగా వుంటుంది. దీనికి త్వరలోనే గుర్రం పిల్ల పుడుతుంది'' అన్నాడా మోసగాడు.

''నీ పుచ్చకాయ ఖరీదు యెంత?'' అని కెలెవ్ అడిగేడు.

''ఒక గాడిద ఖరీదు అంత, సరిగ్గా.''

''యేం బేరం!'' అనుకున్నాడు కెలెవ్. ''నా దాహమూ తీరుతుంది. గాడిద బదులు గుర్రం పిల్లా వుంటుంది'' అనుకున్నాడు.

కెలెవ్ పుచ్చకాయకి డబ్బు యిచ్చేడు.

''యింటికి వెళ్లేదాకా దీన్ని కొయ్యకేం. కోస్తే గుర్రం పిల్ల గెంతిపోతుంది'' అని న్యాయాధికారి ఆశ్రితుడు చెప్పేడు.

నీళ్ల కడవని మోసుకెళ్లినట్టుగా కెలెవ్ జాగ్రత్తగా పుచ్చకాయని మోసుకు వెడుతూ దారిలో తొట్రుపడ్డాడు. పుచ్చకాయ చెయ్యి జారి కింద పడింది. రెండు ముక్కలైపోయింది.

ఆ చోట్లో వో కుందేలు పడుకుంది. యీ చప్పుడుకి బెదిరి అది గెంతుకుంటూ పారిపోయింది.

''గుర్రం పిల్ల పారిపోయింది'' అని ఆ గొడవ చూసి కెలెవ్ అనుకున్నాడు.

అయ్యో అని బాధపడి యేడ్చుకుంటూ యింటికి పోయేడు.

అతన్ని చూసి భార్య

''వెన్న యేదీ?'' అని అడిగింది.

చిర్రెత్తిపోయింది కెలెవ్‌కి.

''తెలివితక్కువదానా! గుర్రం పిల్ల చెయ్యి జారిపోయిందని నే బాధ పడుతూ వుంటే నువ్వేమో వెన్నో వెన్నో అంటావేమిటి?'' అని విసుక్కున్నారు.

కెలెవ్ జరిగిన గొడవలన్నీ చెప్పేక విని ఆమె అంది:

''యెంత అమాయకుడు దొరికాడు నా భర్తగా.''

జింక

షిర్దాక్ గురించి మీరిప్పటి దాకా చదివిన కథలన్నీ లోగడ పత్రికలలో పడినటువంటివే. ఓ సారి వో పరాయి వ్యక్తి నన్ను చూడ్డానికి వచ్చేడు.

''నేను మీ పాఠకుణ్ణి. షిర్దాక్‌తో నా భేటీ గురించి మీకు చెపుదామని వచ్చేను'' అని తనని తను పరిచయం చేసుకుంటూ అన్నాడు.

''నాకు తెలిసిన మేరకి షిర్దాక్ చిన్న పిల్లలకే కనిపిస్తాడు'' అన్నాను.

''నా బాల్యంలో జరిగినది చెప్పడానికే వచ్చేను'' అని అతను నవ్వుతూ అన్నాడు.

తివాసీమీద కూర్చోమని చోటు చూపించి ఆకుపచ్చ టీ యిచ్చేను. అతను చెప్పిన కథ నిజంగా జరిగినట్టే కనిపించింది. అందుకని దాన్ని రాసి యీ పుస్తకంలో చేర్చాను.

''నా పేరు మీయ్‌లిన్'' అని అతను మొదలుపెట్టేడు. ''మా నాన్న వేటగాడు. ఓ సారి ఆయన వేట సంచీలో వో ప్రాణిని తీసుకువచ్చేడు. అది కొంచెం యించుమించులో మేక పిల్ల మాదిరీ వుంది. అది జింక. వొంటరిగా స్తెప్ బీటిమీద వుండగా నాన్న దాన్ని చూశేరు. దాని తల్లికి యేదో చెడు సంభవించి వుండాలి. అదృష్టవశాత్తూ మా మేక అప్పుడే యీనింది. మేం యీ జింకని కూడా దాని పిల్లలతోబాటే వుంచేం అది సాకుతుందని. మొదట్లో మేక దాన్ని తరిమివేసేది. తర్వాత దానికి జాలిపుట్టిందేమో సాకడం మొదలెట్టింది. యిప్పుడు దానికి నాలుగు పిల్లలయేయి. జింకంటే మా అందరికీ యిష్టం కలిగింది. దానికి కూడా మేమంటే యిష్టంగానే వుండేది. వేసవికాలం గడిచింది. తర్వాత ఆకురాలుకాలం, శీతాకాలం గడిచేయి. వసంతరుతువులో వో రోజు పొద్దుట జింక స్తెప్ బీట్లోకి వెళ్లింది. మళ్లీ తిరిగి రాలేదు. మేక వొకటే యేడుపు. నాక్కూడా యేడుపు వచ్చింది. 'యేడవకు! నీ జింక తిరిగివస్తుంది. నేను దాన్ని తీసుకువస్తా' అని యెవళ్లో చెప్తున్నట్టు మాటలు వినిపించి అర్ధరాత్రి వేళ నేను లేచి కూర్చోవడం నాకు గుర్తు వుంది. నిజంగా చిత్రం! మూడో నాడు ఉదయం జింక తిరిగి యింటికి వచ్చింది. 'అర్ధరాత్రి నాతో అలా చెప్పింది యెవరా' అని నాకు ఆశ్చర్యంగా వుంటుంది. అలా అనుకుని యెవరో మంత్రగాడే అయివుండాలని నిర్ణయించుకున్నాను.

''కాని స్వేచ్ఛ యెలా వుంటుందో చవి చూశాక మా జింక ముందటి మాదిరిగా వుండనే లేదు. దాన్ని కావిటేసుకుందామని నేను వెళితే అది నన్ను తప్పించుకునేది.

'''యీ సారి వెళ్లిపోతే యిక రాదు' అని చెప్పి మా నాన్న దాన్ని తాడుతో కట్టేశాడు.

''కొంత కాలం గడిచింది. మా యింటికి చుట్టాలెవరో వచ్చేరు.

'''రేపు మీకు జింక మాంసం రుచి చూపిస్తా' అని మా నాన్న తన నేస్తంతో చెప్పేడు.

''ఆ రాత్రి నేను చాలా సేపు నిద్రపోలేదు. హఠాత్తుగా వెన్నెల కాంతిలో నాకో చిన్న మనిషి చిత్రమైన **టోపీ** పెట్టుకుని కనిపించేడు.

'''నా పేరు షిర్దాక్. యేం యిలా పడుకున్నావ్? మీ నేస్తం జింకకి రేపు యేం మూడబోతోందో నీకు తెలీదా? అందుకేనా దాన్ని నేను పచ్చిక బీటిమీదనుంచి వెనక్కి తీసుకువచ్చింది?' అన్నాడు.

''ఆ మనిషిని బాగా చూద్దామని నేను యెగిరిగెంతేను, కాని అతను మాయమై పోయేడు. తర్వాత చడిచప్పుడూ

లేకుండా యింట్లోనుంచి బయటికి పశువులున్న చోటుకి వెళ్ళేను. జింకకి కట్టిన తాటిని విప్పేను. వీడ్కోలు చెపుతూ దాని చెవి గీరేను. దాన్ని వాటేసుకున్నాను. దాని గుండె దడదడ కొట్టుకోవడం నాకు వినిపించింది.

''అది స్తెప్ బీట్లోకి యెలా గెంతుకుంటూ పోయిందో నాకు గుర్తు వుంది. తెల్లవారుతోంది. అది గెంతుకుంటూ పోతూ వుంటే దాని గిట్టల్లోనుంచి ధూళి లేచింది. నాకు విచారమూ కలిగింది, సంతోషమూ కలిగింది.''

షిర్దాక్ గురించి నాకు మీయ్‌లిన్ చెప్పింది అదీ. యీ కథని యీ పుస్తకంలో చేర్చడం యెందుకంటే షిర్దాక్‌ని చూసిన యితర పాఠకులు, ఆ చిన్ని మనిషితో స్నేహం కూడా చేసే వుంటే ఆ కథని నాకు చెప్తారు అని. మంచిది.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దీని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను ''రాదుగ'' ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Raduga Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR





